www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 27-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 72 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: షష్ఠి సా. 6.40 తదుపరి సప్తమి; నక్షత్రం: శతభిషం ఉ. 11.37 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: సా. 5.38-7.08; దుర్ముహూర్తం: ఉ. 10.07-11.00, మ. 3.20-4.12; అమృతఘడియలు: శేషం ఉ. 6.12, రా. 2.39-4.09; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**


Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సంస్మరణ సభ

సుప్రభాత సూర్యుడా వందనం.

మహోన్నత తేజమా అభివందనం..



రామోజీరావు

తెలుగు వెలుగు, మీడియా దిగ్గజం, ఆదర్శ పారిశ్రామికవేత్త, నిత్యకృషీవలుడు, ప్రజల అభ్యున్నతికై శ్రమించిన మహామనీషి, పద్మవిభూషణ్ రామోజీరావు గారి అసాధారణ, అద్భుత జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకం.. శక్తివంతం.. ఆచరణీయం.. చిరస్మరణీయం.. వారి జీవితాన్ని స్మరించుకుని, విజయాల్ని తలచుకుని, మధుర జ్ఞాపకాలను పంచుకునేందుకు వారి ఆదర్శాలను గౌరవిస్తూ మేము నిర్వహిస్తున్న ఈ సంస్మరణ కార్యక్రమానికి హాజరు కావలసిందిగా కోరుతున్నాం.

రండి.. మరలిరాని మహామనీషికి శిరసా.. మనసా.. సమర్పిద్దాం.. సహృదయ సుమాంజలి!

తేదీ: 27.06.2024 | సాయంత్రం 4 గం.ల నుంచి
వేదిక: అనుమోలు గార్డెన్స్, కానూరు, విజయవాడ

ముఖ్య అతిథి

గౌరవ ముఖ్యమంత్రి వర్యులు

శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

జారీ చేసిన వారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం

లెక్క సరిచేస్తారా!

జోరుమీదున్న రోహిత్ సేన

రాత్రి 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో

కీలకంగా బుమ్రా, కుల్దీప్

రెండో సెమీస్‌లో ఇంగ్లండ్‌తో భారత్ ఢీ నేడు

జార్జ్‌టౌన్ (గయానా): ఆలస్యంగా జోరందుకొన్న భారత్.. నాకౌట్ తడబాటుకు చెక్ చెప్పాలన్న కసితో ఉంది. గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంప్ ఇంగ్లండ్‌తో టీమిండియా తలపడనుంది. చివరిసారి ఈ రెండు జట్లు 2022 పొట్టికప్ సెమీస్‌లో తలపడగా.. రోహిత్ సేన 10 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడింది. ఆ ఓటమికి ఈసారి ఎలాగైనా బదులు తీర్చుకోవాలని టీమిండియా పట్టుదలతో ఉంది. మనోళ్ల సంప్రదాయ ఆటతీరు అప్పట్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. దీంతో ఆటతీరు మార్చుకొన్న భారత్.. టీ20లకు అవసరమైన దూకుడును అలవర్చుకొంది. పేపర్‌పై చూస్తే భారత జట్టు ఎంతో బలంగా కనిపిస్తోంది. అజేయంగా సెమీస్‌కు చేరినా.. టాపార్డర్‌లో కోహ్లీ ఫామ్ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. కానీ, రోహిత్ ఫియర్‌లెస్ బ్యాటింగ్‌తో మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఆస్ట్రేలియాపై చెలరేగిన తీరు.. అతడి ఆటపై నెలకొన్న అనుమానాలన్నింటినీ పటాపంచలు చేసింది. మిడిలార్డర్‌లో శివమ్ దూబే కూడా ఆశించిన స్థాయిలో ఆడలేక పోవడం విమర్శలకు దారితీస్తున్నా.. విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చడానికి మేనేజ్‌మెంట్ ఇష్టపడడం లేదు. స్పిన్ బాధ్యతలను జడేజా, అక్షర్, కుల్దీప్ చేపట్టనున్నారు. ఇక, పేసర్ బుమ్రా నిలకడగా రాణిస్తుండడం భారత్‌కు సానుకూలం. ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా మెరుగ్గా రాణిస్తున్న నేపథ్యంలో.. జట్టు మరోసారి అతడి నుంచి అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది.

ప్రమాదకరంగా బట్లర్..: కిందామీదా పడుతూ సెమీస్ చేరిన ఇంగ్లండ్.. ప్రమాదకరంగా కనిపిస్తోంది. అమెరికా మ్యాచ్‌తో కెప్టెన్ బట్లర్ ఫామ్‌లోకి రావడం ఆ జట్టుకు ఊరటనిచ్చే అంశం. ఓపెనర్ ఫిల్‌సాల్ట్, బెయిర్‌స్టో, బ్రూక్ కూడా ధనాధన్ బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పగల సమర్థులు. మొయిన్ అలీ, ఆదిల్ రషీద్, లివింగ్‌స్టోన్ స్పిన్ భారాన్ని మోస్తున్నారు. పేసర్లలో ఆర్చర్‌కు జోడీగా జోర్డాన్, మార్క్ ఉడ్‌లలో ఎవరికి తుదిజట్టులో చోటు కల్పించాలనే డైలమాలో బట్లర్ ఉన్నాడు. మొత్తంగా ఈ సమవుజ్జీల సమరం ఆసక్తిగా సాగే అవకాశం ఉంది.



రోహిత్



బట్లర్

జట్లు (అంచనా)

భారత్: రోహిత్, కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, పాండ్యా, జడేజా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, బుమ్రా, కుల్దీప్.

ఇంగ్లండ్: సాల్ట్, బట్లర్ (కెప్టెన్), బెయిర్‌స్టో, హ్యారీ బ్రూక్, మొయిన్ అలీ, లివింగ్‌స్టోన్, కర్రాన్, జోర్డాన్/మార్క్ ఉడ్, ఆర్చర్, టోప్లే, రషీద్.

పిచ్/వాతావరణం

వికెట్ స్పిన్నర్లకు అనుకూలం కావడంతో.. ఓ మాదిరి స్కోర్లు నమోదయ్యే అవకాశాలున్నాయి. బౌన్స్ తక్కువగా ఉండడంతో పాటు బంతి వేగంగా టర్న్ తీసుకొనే చాన్సులున్నాయి. కాగా, భారత్‌కు ఈ వికెట్‌పై ఆడిన అనుభవం కలసిరానుంది. వర్షం కురిసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ వరల్డ్‌కప్‌లో ఈ వికెట్‌పై ఆడిన గత ఐదు మ్యాచ్‌ల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు మూడు గెలిచింది.

రిజర్వు డే లేదు..

భారత్, ఇంగ్లండ్ మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే, ఈ మ్యాచ్‌కు రిజర్వు డే లేదని ఎంతో ముందుగానే నిర్ణయించారు. రిజర్వ్‌డే ఉంటే ఫైనల్ మ్యాచ్ ఆడేందుకు గెలిచిన జట్టు.. మరి కొన్ని గంటల్లోనే సిద్ధం కావాల్సి వస్తుంది. కానీ, 250 నిమిషాల అదనపు సమయం మాత్రం కేటాయించారు. సెమీస్‌లో విజేతను తేల్చాలంటే కనీసం 10 ఓవర్ల మ్యాచ్ జరగాలి. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే సూపర్-8 టాపర్ భారత్.. ఫైనల్‌కు చేరుకొంటుంది.

నాకౌట్‌కు ఇంగ్లండ్

కొలోగ్ని (జర్మనీ): యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్స్‌లో ఇంగ్లండ్ నాకౌట్‌కు దూసుకెళ్లింది. గ్రూప్-సిలో మంగళవారం అర్ధరాత్రి ఇంగ్లండ్-స్లొవేనియా మధ్య మ్యాచ్ 0-0తో గోల్‌లెస్ డ్రాగా ముగిసింది. దీంతో ఇంగ్లండ్ మొత్తం 5 పాయింట్లతో గ్రూప్ విన్నర్‌గా రౌండ్-16కు చేరగా.. 3 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన స్లొవేనియా కూడా నాకౌట్ బెర్త్ పట్టేసింది. ఇదే గ్రూప్‌లో డెన్మార్క్, సెర్బియా మధ్య మ్యాచ్ కూడా 0-0తో డ్రా అయింది. అయితే, రెండో స్థానంతో డెన్మార్క్ ప్రీక్వార్టర్స్‌కు చేరుకోగా.. సెర్బియా టోర్నీ నుంచి నిష్క్రమించింది.

అర్ష్‌దీప్ టాంపరింగ్ చేస్తున్నాడు



న్యూఢిల్లీ: పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్ భారత పేసర్ అర్ష్‌దీప్‌పై తీవ్ర విమర్శ చేశాడు. అర్ష్‌దీప్ బంతిని టాంపర్ చేస్తున్నాడని అన్నాడు. '15వ ఓవర్లో రివర్స్ స్వింగ్ రాబట్టడమేవిటి. అంటే 11, 12 ఓవర్లలోనే బంతిని టాంపర్ చేసి ఉండొచ్చు' అని అన్నాడు. అయితే ఇంజీ విమర్శల్ని భారత సారథి రోహిత్ శర్మ కొట్టిపారేశాడు. ఇక్కడి పిచ్‌లపై అన్ని జట్లకూ రివర్స్ స్వింగ్ లభిస్తోందని అన్నాడు.

రషీద్‌ఖాన్‌కు మందలింపు

టరోబా (ట్రినిడాడ్) : అఫ్ఘానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్‌ను ఐసీసీ మందలించింది. బంగ్లాదేశ్‌తో సూపర్-8 మ్యాచ్‌లో రెండో పరుగు తీసేందుకు నిరాకరించిన సహచరుడు జనత్‌పై ఆగ్రహం వ్యక్తంచేసిన రషీద్..బ్యాట్‌ను విసిరి కొట్టాడు. ఇది ఐసీసీ నియమావళికి విరుద్ధమంటూ అతడిని మందలించింది.

నితీశ్‌కు గాయం

జింబాబ్వే టూర్ నుంచి అవుట్
దూబేతో భర్తీ



న్యూఢిల్లీ: తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో జింబాబ్వే టూర్ నుంచి అవుటయ్యాడు. అతడి స్థానంలో శివమ్ దూబేను ఎంపిక చేసినట్టు బీసీసీఐ బుధవారం ప్రకటించింది. సన్‌రైజర్స్ ఆల్‌రౌండర్ నితీశ్ పరిస్థితిని మెడికల్ టీమ్ పర్యవేక్షిస్తోందని తెలిపింది. అయితే హెర్నియాతో బాధపడుతున్నట్టు సమాచారం. వచ్చే నెల 6 నుంచి జింబాబ్వేతో భారత్ ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ఇందుకోసం శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో భారత జట్టును సెలెక్టర్లు సోమవారం ప్రకటించారు. ఐపీఎల్‌లో అదరగొట్టిన రియాన్ పరాగ్, నితీశ్, అభిషేక్ శర్మలకు తొలిసారి చోటు కల్పించారు.

జర్మనీలో నిఖత్ శిక్షణ

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఆరుగురిలో ఒక్కరు మినహా మిగిలిన ఐదుగురు భారత బాక్సర్లు ప్రత్యేక శిక్షణ కోసం జర్మనీ వెళ్లనున్నారు. వీరిలో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ కూడా ఉంది. ఈనెల 28న జర్మనీ బయలుదేరుతున్న ఈ ఐదుగురు నెల రోజుల పాటు అక్కడ శిక్షణ తీసుకోనున్నారు. వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ (50 కిలోలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కి.), నిషాంత్ దేవ్ (71 కి.), ప్రీతి పవార్ (54 కి.), జాస్మిన్ లాంబోరియా (57 కి.) ఐర్లాండ్, అమెరికా, మంగోలియా, జర్మనీ, డెన్మార్క్ దేశాల బాక్సర్లతో కలిసి వీరు ప్రాక్టీస్‌లో పాల్గొంటారు. జర్మనీ వాతావరణం పారిస్‌కు దగ్గరగా ఉండడంతో అక్కడి పరిస్థితులకు కూడా భారత బాక్సర్లు అలవాటు పడతారని జాతీయ బాక్సింగ్ సమాఖ్య తెలిపింది. కామన్వెల్త్ స్వర్ణ పతక విజేత అమిత్ పంఘల్ (51 కి.) మాత్రం శిలారూలోని సాయ్ సెంటర్‌లోనే శిక్షణ కొనసాగించనున్నాడు. భారత్ నుంచి పారిస్ ఒలింపిక్స్‌లో ఈసారి ఆరుగురు బాక్సర్లు బరిలోకి దిగనున్నారు.

హర్మన్‌కు 'పారిస్' పగ్గాలు




న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారత పురుషుల జట్టును జాతీయ హాకీ సమాఖ్య బుధవారం ప్రకటించింది. 16 మంది సభ్యుల ఈ బృందానికి ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వం వహించనున్నాడు. ఒలింపిక్స్‌లో ఆడే బృందంలో ఈసారి ఐదుగురు కొత్త కుర్రాళ్లకు అవకాశమివ్వడం విశేషం. గత ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించిన భారత్ ఈ ఒలింపిక్స్‌లో పూల్-బిలో బెల్జియం, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, న్యూజిలాండ్, ఐర్లాండ్‌తో తలపడనుంది. భారత జట్టు ప్రస్తుతం బెంగళూరులోని సాయ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటోంది. గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్, మిడ్‌ఫీల్డర్ మన్‌ప్రీత్ సింగ్‌కు ఇది నాలుగో ఒలింపిక్స్ కాగా, హర్మన్‌కు మూడోది. వచ్చే నెల 27న న్యూజిలాండ్ మ్యాచ్‌తో భారత్ ఒలింపిక్స్ వేట ఆరంభమనుంది.

అఫ్ఘాన్‌కు అద్భుత అవకాశం


రషీద్‌ఖాన్

ఉదయం 6 గం. నుంచి


మార్‌క్రమ్

దక్షిణాఫ్రికాతో సెమీస్ నేడు

టరోబా (ట్రినిడాడ్) : తుది దశకు చేరిన టీ20 వరల్డ్ కప్‌లో మరో ఆసక్తికర సమరానికి రంగం సిద్ధమైంది. భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం జరిగే తొలి సెమీఫైనల్లో సంచలన అఫ్ఘానిస్థాన్-తొలిసారి ఐసీసీ టోర్నీ టైటిల్ గెలవాలని పట్టుదలగా ఉన్న సౌతాఫ్రికా తలపడనున్నాయి. వర్ణ వివక్ష నిషేధం నుంచి బయటపడి 1991లో తిరిగి అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన సఫారీలు..నాటినుంచి ఇప్పటివరకు టీ20, వన్డే వరల్డ్ కప్‌లలో టైటిల్ ఫైట్‌కు చేరలేదు. పైగా..ప్రతి మేజర్ టోర్నీలలో కీలక మ్యాచ్‌ల్లో తడబాటుకు లోనవుతూ 'చోకర్సు'గా పేరు పొందింది దక్షిణాఫ్రికా జట్టు. ఈసారి అందుకు భిన్నంగా ఉత్కంఠ భరిత మ్యాచ్‌ల్లో విజయాలు సాధించి సెమీస్ వరకు వచ్చింది. నేపాల్‌పై ఒక్క పరుగుతో, బంగ్లాదేశ్‌పై నాలుగు రన్స్‌తో, వెస్టిండీస్‌పై మూడు వికెట్లతో నెగ్గడం విశేషం. అపజయమే లేకుండా సెమీస్ వరకూ దూసుకొచ్చిన సౌతాఫ్రికా ఆ జోరు కొనసాగిస్తుందా అనేది చూడాలి. ఓపెనర్ డికాక్ అద్భుతంగా ఆడుతున్నాడు. మార్‌క్రమ్, స్టబ్స్, క్లాసెన్‌తో మిడిలార్డర్ డైనమిక్‌గా ఉంది. ఇక హార్డ్‌హిట్టర్ మిల్లర్ సంగతి చెప్పాల్సిన పనిలేదు. స్పిన్నర్లు కేశవ్, షంసీ ప్రత్యర్థి బ్యాటర్ల పనిపట్టగలరు. మరోవైపు..20 ఏళ్ల కిందట..2004లో ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ ట్రోఫీలో అఫ్ఘానిస్థాన్ తమ మొదటి అంతర్జాతీయ పోటీ ఆడింది. ఆపై రెండు దశాబ్దాల్లోనే ఏకంగా టీ20 వరల్డ్ కప్ సెమీస్‌కు చేరడం ఆ జట్టు అనూహ్య పురోగతికి అద్దం పడుతుంది. కెప్టెన్ రషీద్ అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌లో ముందుండి జట్టును అమోఘంగా నడిపిస్తున్నాడు. ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ పవర్ ప్లేలో ప్రత్యర్థులకు గుబులు పుట్టిస్తున్నాడు. పేసర్లు ఫరూఖీ, నవీనుల్ ప్రత్యర్థి బ్యాటర్లను గడగడలాడిస్తున్నారు.

జట్లు (అంచనా)

సౌతాఫ్రికా : మార్‌క్రమ్ (కెప్టెన్), డికాక్, హెన్‌డ్రిక్స్, మిల్లర్, క్లాసెన్, స్టబ్స్, యాన్సెన్, కేశవ్, రబాడ, నోకియా, షంసీ.

అఫ్ఘానిస్థాన్ : రషీద్ (కెప్టెన్), ఇబ్రహీమ్ జద్రాన్, రహ్మనుల్లా గుర్బాజ్/హజ్రతుల్లా జజాయ్, అజ్మతుల్లా, నైబ్, నబీ, జానత్/ఇషాఖ్ (కీపర్), ఖరోటె, నవీనుల్, నూర్, ఫరూఖీ.

పిచ్/వాతావరణం

వికెట్ బ్యాటింగ్, బౌలింగ్‌కు సహకరిస్తుంది. తొలి ఓవర్లు బ్యాటర్లకు అనుకూలిస్తాయి. మ్యాచ్ సాగే కొద్దీ స్పిన్నర్లదే హవా. టోర్నీలో ఈ పిచ్‌పై జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో..రెండోసారి బ్యాటింగ్ చేసిన జట్లు మూడుసార్లు నెగ్గాయి. వర్షానికి ఐదు శాతమే అవకాశం.

మ్యాచ్‌కు శుక్రవారం రిజర్వ్ డే

బిజినెస్

డాక్టర్ రెడ్డీస్ చేతికి నికోటినెల్ బ్రాండ్



బ్రిటన్ కంపెనీతో డాక్టర్ రెడ్డీస్ ఒప్పందం

డీల్ విలువ రూ.5250 కోట్లు

హైదరాబాద్: లండన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రపంచంలోనే అతి పెద్ద కన్స్యూమర్ హెల్త్‌కేర్ కంపెనీ హేలియాన్ పీఎల్‌సీకి చెందిన నికోటినెల్ బ్రాండ్ డాక్టర్ రెడ్డీస్ చేతికి వచ్చింది. నికోటినెల్ బ్రాండ్‌తో పాటు ఇతర స్థానిక మార్కెట్లలో దాని అనుబంధ బ్రాండ్లు నికాబెట్ (ఆస్ట్రేలియా), హబిట్రాల్ (న్యూజిలాండ్, కెనడా), థ్రైవ్ (కెనడా) హక్కులు కూడా డాక్టర్ రెడ్డీస్ చేతికి వస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసులకు లోబడి నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) కింద ఈ ఔషధాలు వినియోగంలో ఉన్నాయి. ఈ బ్రాండ్లు చేజిక్కించుకునే ప్రక్రియలో భాగంగా హేలియాన్ గ్రూప్ కంపెనీ అయిన నార్త్ స్విట్జర్లాండ్ ఎస్ఏఆర్ఎల్ వాటాలను కొనుగోలు చేసేందుకు తమ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఎస్ఏ ఒక ఒప్పందంపై సంతకాలు చేసినట్టు కంపెనీ ప్రకటించింది. ఈ డీల్ విలువ 50 కోట్ల పౌండ్లు (రూ.5250 కోట్లు). ఇందులో 45.8 కోట్ల పౌండ్లు రెండు సంవత్సరాల్లో (2025, 2026) నగదుగా చెల్లిస్తారు. రెగ్యులేటరీ అనుమతులకు లోబడి ఈ డీల్ ఉంటుందని డాక్టర్ రెడ్డీస్ ప్రకటించింది. ఈ ఏడాది నాలుగో త్రైమాసికానికి ఈ డీల్ ముగియవచ్చునని పేర్కొంది.

లావాదేవీ ముగియగానే అమెరికా వెలుపల జపాన్, లాటిన్ అమెరికా సహా సుమారు 30 మార్కెట్లలో ఆ ఔషధాలను డాక్టర్ రెడ్డీస్ మార్కెటింగ్ చేయగలుగుతుంది. ఎన్ఆర్‌టీ విభాగంలో ప్రపంచంలోనే (అమెరికా మినహా) అతి పెద్ద బ్రాండ్ నికోటినెల్ అని తెలిపింది. అలాగే యూరప్‌లోని (రష్యా, ఇటలీ మినహా) 15 అతి పెద్ద ఓటీసీ బ్రాండ్లలో ఇదొకటి, ప్రపంచంలోని ఓటీసీ బ్రాండ్లలో 32వ స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా కన్స్యూమర్ హెల్త్‌కేర్ రంగంలో డాక్టర్ రెడ్డీస్ ఇటీవల పరిధిని విస్తరించుకుంటూ వస్తోంది. నికోటినెల్ వ్యూహాత్మక కొనుగోలు ఆ విభాగంలో తమ స్థానాన్ని పటిష్ఠం చేస్తుందని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెల్ అన్నారు. అయితే వ్యాపార అనుసంధానత విజయవంతంగా పూర్తి చేయడానికి వీలుగా దశలవారీ విధానం అనుసరించనున్నట్టు కంపెనీ తెలిపింది. కొవిడ్-19 సమయంలో పొగాకు వినియోగదారులు ఆ అలవాటు నుంచి బయటపడడం ద్వారా మహమ్మారి తీవ్రతను తగ్గించుకునేందుకు ఎన్ఆర్‌టీ ఔషధాలను వినియోగించారు. పొగాకు కారణంగా ఏటా 80 లక్షల మంది వివిధ ప్రాణాంతక వ్యాధుల బారిన పడి మరణిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 130 కోట్ల మంది పొగాకు వినియోగదారులున్నారని అంచనా. వారిలో 60 శాతం మంది ఆ అలవాటు నుంచి బయటపడాలని కోరుకుంటున్నప్పటికీ 30 మందికి మాత్రమే నివారణా మార్గాలు అందుబాటులో ఉంటున్నాయి. సరైన వైద్య చికిత్సలు అందించగలిగినట్టయితే వారు కూడా ఈ అలవాటు నుంచి బయటపడగలుగుతారన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ అభిప్రాయం.

స్టాండర్డ్ డిడక్షన్ రూ.లక్షకు పెంచాలి

ఆర్థిక మంత్రికి ఈవై సూచన

న్యూఢిల్లీ: వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మరిన్ని పన్ను సంస్కరణలు ప్రవేశపెట్టాలని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ ఈవై కోరింది. ముఖ్యంగా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని ప్రస్తుత రూ.50,000 నుంచి రూ.లక్షకు పెంచాలని కోరింది. ఇది వీలుకాని పక్షంలో ఆదాయ పన్ను (ఐటీ) పరిధిలోకి వచ్చే వ్యక్తిగత వార్షిక ఆదాయ పరిమితిని ప్రస్తుత రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు పెంచాలని సూచించింది. ఇలా చేస్తే కొత్త ఐటీ విధానాన్ని వీలైనంత ఎక్కువ మంది ఎంచుకునే అవకాశం ఉందని తెలిపింది. వీటికి తోడు పన్ను శ్లాబులను మరింత స్ట్రీమ్‌లైన్ చేసి ఆర్థిక వృద్ధికి దోహదపడేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరింది. ఇలా చేయడం ద్వారా పెట్టుబడులను, అభివృద్ధిని మరింత పరుగులు పెట్టించవచ్చని ఈవై కేంద్ర ఆర్థికమంత్రికి సూచించింది.

ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ఎల్‌టీటీఎస్ పదవులకు నాయక్ గుడ్‌బై

» కొత్త చైర్మన్‌గా ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్

న్యూఢిల్లీ: ఎల్‌టీఐమైండ్‌ట్రీ, ఎల్ అండ్ టీ టెక్నాలజీ సర్వీసెస్ (ఎల్‌టీటీఎస్) చైర్మన్ పదవుల నుంచి ఏఎం నాయక్ తప్పుకున్నారు. నాయక్ స్థానంలో కొత్త చైర్మన్‌గా ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ ఈనెల 27 నుంచి బాధ్యతలు చేపడతారని రెండు సంస్థలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి.

కైగా ప్రాజెక్టు మేఘాకే...

అణు ఇంధన రంగంలోకి ప్రవేశం

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎంఈఐఎల్) కర్ణాటకలోని కైగా అణు విద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్టును చేజిక్కించుకుంది. అణు ఇంధన శాఖకు అనుబంధంగా పని చేస్తున్న న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐఎల్) నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో తమ కంపెనీ అతి తక్కువ బిడ్డర్‌గా ఎంపికయిందని ఎంఈఐఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్‌పీసీఐఎల్ ఇంతవరకు నిర్వహించిన బిడ్లలో భారీ విలువ గల బిడ్ ఇదే. కర్ణాటకలోని కైగా వద్ద 700 మెగావాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ రియాక్టర్ల నిర్మాణానికి ఈపీసీ విధానంలో ఎన్‌పీసీఐఎల్ బిడ్డింగ్ నిర్వహించింది. టెండరింగ్ ప్రక్రియ గత ఏడాది మే నెలలో ప్రారంభం కాగా అక్టోబరులో టెక్నికల్ బిడ్‌ను తెరిచారు. ఎల్ అండ్ టీ, భెల్ వంటి దిగ్గజాలు పాల్గొన్న తీవ్ర పోటీ వాతావరణంలో అతి తక్కువ మొత్తానికి బిడ్ వేసిన కంపెనీగా ఎంఈఐఎల్‌ను ప్రకటించారు. రూ.12,799.92 కోట్లకు ఎంఈఐఎల్ బిడ్ దాఖలు చేసింది. ఇది ఎంఈఐఎల్ చరిత్రలో అత్యంత విశిష్టమైన ఘట్టమని, అణు ఇంధన రంగంలోకి తమ వ్యూహాత్మక ప్రవేశానికి ఇది వీలు కల్పిస్తుందని కంపెనీ డైరెక్టర్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు.

విజయ డయాగ్నోస్టిక్స్‌లో మెడినోవా విలీనం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వైద్య సేవల రంగంలో మరో విలీనం చోటు చేసుకుంటోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మెడినోవా డయాగ్నోస్టిక్స్ సర్వీసెస్ (ఎండీఎస్ఎల్) తన మాతృ సంస్థ విజయ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో (వీడీసీఎల్) విలీనం అవుతోంది. బుధవారం జరిగిన సమావేశంలో రెండు కంపెనీల డైరెక్టర్ల బోర్డులు ఇందుకు ఆమోదం తెలిపాయి. రెగ్యులేటరీ సంస్థలు, వాటాదారుల ఆమోదం లభించి ఈ విలీనం పూర్తయ్యేందుకు ఏడాది వరకు సమయం పట్టే అవకాశం ఉందని విజయ డయాగ్నోస్టిక్స్ తెలిపింది. ఈ విలీనం ద్వారా రూ.10 ముఖ విలువ ఉన్న ప్రతి 22 మెడినోవా డయాగ్నోస్టిక్స్ షేర్లకు, రూపాయి ముఖ విలువ ఉండే ఒక విజయ డయాగ్నోస్టిక్స్ షేరు జారీ చేస్తారు.

ఆగని రికార్డుల హోరు

మూడో రోజూ లాభపడిన మార్కెట్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో వరుసగా మూడో రోజూ సరికొత్త రికార్డులు నమోదయ్యాయి. సెన్సెక్స్ 620.73 పాయింట్ల లాభంతో 78,674.25 వద్ద, నిఫ్టీ 147.5 పాయింట్ల లాభంతో 23,868.80 వద్ద క్లోజయ్యాయి. ఇంట్రా డేలోనూ సూచీలు జీవిత కాల గరిష్ఠ స్థాయిలను తాకాయి. గత మూడు రోజుల ర్యాలీతో మదుపరుల సంపద రూ.2.53 లక్షల కోట్లు పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి లార్జ్ క్యాప్ షేర్లలో ర్యాలీ, ఆసియా మార్కెట్ల లాభాలతో మదుపరులు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు దిగడం, ఈ ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు ఎనిమిది శాతానికి చేరువలో ఉంటుందనే అంచనాలు, తగ్గుతున్న ద్రవ్యోల్బణంతో త్వరలోనే వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు బుధవారం నాటి ర్యాలీకి దోహదం చేశాయి.

'రిలయన్స్' షేర్ల జోరు : బుధవారం నాటి ర్యాలీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో ర్యాలీ బాగా దోహదం చేసింది. బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు 4.09 శాతం లాభంతో రూ.3,027.40 వద్ద ముగిశాయి. దీంతో బుధవారం ఒక్కరోజే రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల మార్కెట్ క్యాప్ రూ.80359.48 కోట్లు పెరిగి రూ.20,48,282.28 కోట్లకు చేరింది.

బాండ్ల ద్వారా ఎస్‌బీఐ రూ.10,000 కోట్లు సమీకరణ

న్యూఢిల్లీ: రుణ పత్రాల (బాండ్స్) జారీ ద్వారా ఎస్‌బీఐ బుధవారం రూ.10,000 కోట్లు సమీకరించింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అందుబాటు ధరల గృహ నిర్మాణ ప్రాజెక్టులకు అవసరమైన రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకు ఈ నిధులను ఉపయోగించనుంది. నిజానికి ఈ బాండ్స్ ద్వారా రూ.5,000 కోట్లు సమీకరించాలని భావించింది. అయితే ప్రావిడెండ్ ఫండ్ సంస్థలు, బీమా కంపెనీలు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఎగబడి సబ్‌స్క్రైబ్ చేయడంతో రూ.19,884 కోట్లకు బిడ్స్ వచ్చాయి. దీంతో రూ.10,000 కోట్లు మాత్రమే స్వీకరించాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. ఈ బాండ్స్‌పై ఎస్‌బీఐ 7.36 శాతం వడ్డీ చెల్లించనుంది.

'సీఎఫ్‌ఓ'లది కీలక పాత్ర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి, కంపెనీల ఆర్థిక నిర్ణయాల్లో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లది (సీఎఫ్ఓ) కీలక పాత్ర అని తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ చాప్టర్ నిర్వహించిన 'సీఎఫ్ఓ కాన్‌క్లేవ్'లో ఆయన ఈ విషయం చెప్పారు. కంపెనీల వ్యాపార విస్తరణలో రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు కీలకమే అయినా, వ్యాపారాన్ని బట్టి ఆర్థికేతర అంశాలూ కీలకంగా మారతాయనే విషయాన్ని సీఎఫ్ఓలు గుర్తుంచుకోవాలని కోరారు.

స్పెక్ట్రమ్ వేలం తుస్..

పెద్దగా ఆసక్తి చూపని టెలికాం కంపెనీలు.. రెండో రోజే ముగిసిన ప్రక్రియ

రూ.96,238 కోట్ల విలువైన స్పెక్ట్రమ్‌లో టెల్కోలు కొనుగోలు చేసింది రూ.11,340 కోట్లే..

న్యూఢిల్లీ: ఈ సారి టెలికాం స్పెక్ట్రమ్ వేలానికి కంపెనీల నుంచి స్పందన కరువైంది. స్పెక్ట్రమ్ కొనుగోలుకు టెలికాం కంపెనీలు పెద్దగా ఆసక్తి చూపకపోవడం తో రెండో రోజే, కేవలం ఏడు రౌండ్లలోనే వేలం ప్రక్రియ ముగిసింది. రూ.96,238 కోట్ల కనీస విలువ చేసే 10 గిగాహెట్జ్‌ల స్పెక్ట్రాన్ని ప్రభుత్వం అమ్మకానికి పెట్టగా.. అందులో 12 శాతానికి సమానమైన రూ.11,340.78 కోట్ల విలువైన 141.4 మెగాహెట్జ్‌ల రేడియో తరంగాలను మాత్ర మే టెల్కోలు కొనుగోలు చేశాయి. ఈ వేలంలో భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా రూ.6,856.76 కోట్ల విలువైన స్పెక్ట్రమ్‌ను దక్కించుకోగా.. వొడాఫోన్ ఐడియా (వీఐ) రూ.3,510.4 కోట్ల తరంగాలను కొనుగోలు చేసింది. కాగా, ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో కేవలం రూ.973.62 కోట్ల స్పెక్ట్రాన్ని తీసుకుంది. 2022లో నిర్వహించిన వేలం ఏడు రోజులు కొనసాగగా.. కంపెనీలు రూ.1.5 లక్షల కోట్ల విలువైన 5జీ స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేశాయి. రిలయన్స్ జియో అత్యధికంగా రూ.88,078 కోట్ల విలువైన రేడియో తరంగాలను దక్కించుకుంది. అమ్మకానికి పెట్టిన స్పెక్ట్రమ్‌లో దాదాపు సగం జియోనే కొనుగోలు చేసింది. కాగా, ఎయిర్‌టెల్ రూ.43,084 కోట్లు, వీఐ రూ.18,799 కోట్ల స్పెక్ట్రాన్ని కొనుగోలు చేశాయి. దాదాపు రెండేళ్ల తర్వాత మళ్లీ స్పెక్ట్రమ్ వేలాన్ని నిర్వహించిన కేంద్ర ప్రభుత్వం.. ఈసారి 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 మెగాహెట్జ్‌ల తోపాటు 26 గిగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్ రేడియో తరంగాలను అమ్మకానికి పెట్టింది. ఈసారి వేలానికి టెల్కోల నుంచి పెద్దగా స్పందన ఉండకపోవచ్చని మార్కెట్ వర్గాలు ముందుగానే అంచనా వేశాయి.



ఆ అంచనాలకు తగినట్లుగానే కంపెనీలు అతి స్వల్ప వనరుల కొనుగోలుతో సరిపెట్టాయి. ఎందుకంటే, ప్రస్తుతం కంపెనీలు గతంలో కొనుగోలు చేసిన స్పెక్ట్రమ్ రెన్యువల్, 5జీ కవరేజీ విస్తరణ, స్పీడ్ పెంపుపై ప్రధానంగా దృష్టి సారించాయి. అందుకే ఈసారి అత్యంత వేగంతో సేవలందించగలిగే బ్యాండ్‌విడ్త్ స్పెక్ట్రమ్ కోసం మాత్రమే కంపెనీ లు బిడ్ వేసినట్లు తెలిసింది. వేలం తొలి రోజున (మంగళవారం) 5 రౌండ్ల బిడ్డింగ్ జరగగా.. బుధవారం మరో రెండు రౌండ్ల బిడ్డింగ్ జరిగింది. దాంతో ఉదయం 11.30 గంటలకే వేలం ప్రక్రియ ముగిసింది. టెలికాం శాఖ విడుదల చేసిన మంగళవారం బిడ్డింగ్ నివేదిక ప్రకారం.. కంపెనీలు ప్రధానంగా 900, 1800 మెగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్ స్పెక్ట్రమ్ కోసమే పోటీపడ్డాయి. ఓ కంపెనీ మూడు సర్కిళ్లలో 2100 మెగాహెట్జ్ బ్యాండ్‌విడ్త్ తరంగాల కోసమూ బిడ్ వేసినట్లు తెలిసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,000 ▼	66,000 ▼	94,500 ▼
ముంబై	71,270 ▼	65,280 ▼	86,940 ▼



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ

హైదరాబాద్	515	విజయవాడ	515
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ.	72



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	131
కర్నూలు	110	నెల్లూరు	131
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 27-6-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

కదలరు.. మెదలరు



సగం మంది భారతీయులు వ్యాయామం చేయట్లేదు

శారీరక శ్రమ లేని పెద్దలు 49.4%

పురుషుల కంటే మహిళలే ఎక్కువ!

ఇలాగైతే దేశంలో 2030 నాటికి.. 60% మంది శారీరక నిర్బలురవుతారు

దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడతారు

ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

'లాన్సెట్ గ్లోబల్ హెల్త్'లో వ్యాసం

10




రాహుల్ ఇలా.. మరి జగన్?

లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓంబిర్లాను ప్రధాని మోదీతోపాటు రాహుల్ గాంధీ సభాపతి స్థానం వద్దకు తీసుకెళ్లి కూర్చోబెట్టారు. విపక్షం తరఫున అభ్యర్థిని నిలబెట్టినప్పటికీ... రాహుల్ హుందాగా ప్రవర్తించారు. కానీ.. ఏపీలో జగన్ స్పీకర్ ఎంపిక ప్రక్రియలోనే పాల్గొనలేదు. కనీస సభా మర్యాద పాటించలేదు.

స్పీకర్ ఓం బిర్లా

వరుసగా రెండోసారి లోక్‌సభాధ్యక్ష పదవి

- మూజువాణి ఓటుతో విజయం
- మీ చిరునవ్వుతో లోక్‌సభలో ఆనందం వెల్లివిరుస్తుంది
- చరిత్రలోనే స్వర్ణయుగానికి మీరు నేతృత్వం వహిస్తున్నారు
- ఓం బిర్లాపై ప్రధాని మోదీ ప్రశంసలు
- విపక్షాలకూ అవకాశమివ్వండి
- ఓం బిర్లాను కోరిన రాహుల్ గాంధీ
- సస్పెన్షన్ల పర్వం కూడదన్న విపక్షాలు
- మోదీ, రాహుల్ పరస్పర కరచాలనం
- ఎమర్జెన్సీ, ఇందిరపై స్పీకర్ విమర్శలు
- భగ్గుమన్న కాంగ్రెస్, ప్రతిపక్షాలు
- సభ వెలుపల బీజేపీ ఆందోళనలు



న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదో లోక్‌సభ స్పీకర్‌గా బీజేపీ ఎంపీ ఓం బిర్లా ఎన్నికయ్యారు. 48 ఏళ్ల తర్వాత మళ్లీ లోక్‌సభ సభాధ్యక్ష పదవికి ఎన్నిక జరగ్గా.. ఓం బిర్లా మూజువాణి ఓటుతో విజయం సాధించారు. దీంతో వరుసగా రెండోసారి సభాధ్యక్షులుగా ఎన్నికైన ఐదో స్పీకర్‌గా

మిగతా 10వ పేజీలో...

₹1861 కోట్లు 'ఔట్'!

విలువలు గల నేత.. విశ్వసనీయ మేత

ఎన్నికల ఏడాదిలో ఔట్ సోర్సింగ్ వ్యయం రూ.2861 కోట్లు	2018-19తో పోల్చితే మూడు రెట్ల కంటే ఎక్కువ



డిజిటల్ కార్పొరేషన్ పేరుతో జగన్ భారీ మాయ

- వైసీపీ సోషల్ మీడియా ఖర్చు అందులోనే
- ఐప్యాక్‌కు దోచి పెట్టిందీ ప్రజా ధనమే
- పేటీఎం బ్యాచ్‌కు పంచిందీ ఖజానా నుంచే
- ఐ అండ్ పీఆర్‌లో స్కామ్ మూలాలు!
- విచారణ జరిపితే మొత్తం వెలుగులోకి

డిజిటల్ కార్పొరేషన్ పేరుతో ఒక మాయా ప్రపంచాన్ని సృష్టించి... ఔట్ సోర్సింగ్ పేరుతో అడ్డగోలు పనులు చేశారు.

ఏపీసీఎఫ్ఎస్ఎస్‌లో 400 మందిని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా కూర్చోబెట్టారు. వీరు చేసింది... అచ్చంగా వైసీపీ సేవ!

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబ్ చానళ్లు, ఇన్‌స్టా పేజీల్లో అసభ్యకర పోస్టులు పెట్టే పేటీఎం బ్యాచ్ ఖర్చు మొత్తం కూడా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బడ్జెట్ పద్దు నుంచే చేశారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్' అని ఇప్పటికీ చక్కటి కబుర్లు చెబుతున్న జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఏం చేశారో తెలుసా... ఒకే ఒక్క ఏడాదిలో రూ.1800 కోట్లకు పైగా ప్రజాధనాన్ని తన 'సోషల్ మీడియా' ప్రచారానికి ఖర్చు పెట్టేశారు. సజ్జల భార్గవ్ రెడ్డి నేతృత్వంలో నడిచిన వైసీపీ సోషల్ మీడియా విభాగం... వైసీపీ ఎన్నికల వ్యూహకర్తగా పని చేసిన 'ఐ ప్యాక్' ఖర్చునూ జనంపైనే రుద్దేశారు. 'ఏపీ డిజిటల్ కార్పొరేషన్' పేరుతో ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేసి... ప్రజాధనాన్ని మళ్లించి, అదే డబ్బును తన సొంత పార్టీకి సేవ చేసిన సంస్థలకు కట్టబెట్టారు. ఇవీ.. ముఖ్యమంత్రిగా జగన్ పాటించిన విలువలు! ఇదీ.. ఆయన విశ్వసనీయత! ఔట్ సోర్సింగ్ వ్యవస్థను జగన్ తన అక్రమాలకు వేదికగా మలుచుకున్నారు. చంద్రబాబు హయాంలో చివరి ఏడాది 2018-19లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతం

మిగతా 12వ పేజీలో...



పింఛన్ పెంపు ఉత్తర్వులు జారీ

- 1న సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ
- 2 రోజుల్లో పూర్తికి ఆదేశాలు
- ఒక్కో ఉద్యోగి కనీసం 50 మందికి ఇవ్వాలని స్పష్టీకరణ

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ మొత్తాన్ని పెంచుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లు గీత కార్మికులు, మత్స్యకార, ఒంటరి మహిళలు, చెప్పులు కుట్టే

మిగతా 11వ పేజీలో...



నరసరావుపేటలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు

ఎట్టకేలకు పిన్నెల్లి అరెస్టు

ఈవీఎం ధ్వంసం, హత్యాయత్నం కేసుల్లో అదుపులోకి

- ఎస్పీ కార్యాలయానికి తరలింపు.. 'బెయిల్' పిటిషన్‌ను కోర్టు కొట్టేసిన వెంటనే రంగంలోకి పోలీసులు.. మొత్తం 14 కేసులు

పిన్నెల్లికి హైకోర్టు షాక్

- నేరారోపణలు తీవ్రమైనవి.. బెయిల్ ఇస్తే ప్రజలకు తప్పుడు సంకేతాలు.. బెయిల్ పిటిషన్లు కొట్టివేత
- పోలింగ్‌రోజు ఈవీఎంల ధ్వంసం, సీఐపై దాడి, హత్యాయత్నం కేసుల్లో 'బెయిల్' కోరిన పిన్నెల్లి
- అయితే, దానివల్ల దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం
- బెయిల్‌కు సహేతుక కారణాలు లేవన్న బెంచ్

నరసరావుపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాచర్లలో రాజకీయ అరాచకాలకు కేరాఫ్‌గా మారిన వైసీపీ మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆట ఎట్టకేలకు కట్టింది. ఈవీఎం ధ్వంసం, సీఐపై దాడి, టీడీపీ ఏజెంట్లపై దౌర్జన్యానికి పాల్పడిన కేసుల్లో నరసరావుపేటలో బుధవారం ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో ఆయన వేసిన పిటిషన్లు బుధవారం తిరస్కరణకు గురయ్యాయి. ఆ వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. మధ్యాహ్నం 3.47 గంటల

మిగతా 12వ పేజీలో...



కేజ్రీవాల్‌ను తీసుకెళ్తున్న సీబీఐ అధికారులు

సీబీఐ కస్టడీకి కేజ్రీవాల్

- 3 రోజులకు అనుమతించిన ప్రత్యేక కోర్టు
- మద్యం కేసులో ఆయనది కీలక పాత్ర
- తప్పంతా సిసోడియాదేనంటున్నారు
- సీబీఐ న్యాయవాది వాదనలు
- ఇది మీడియా వేదికగా సీబీఐ కుట్ర: కేజ్రీవాల్

10

జగన్ బొమ్మలున్న పాస్‌పుస్తకాలు వెనక్కి!

- రైతులకు రాజముద్రతో కొత్తవి జారీ
- త్వరలో సీఎంతో చర్చించి నిర్ణయం
- రెవెన్యూ అధికారులతో మంత్రి అనగాని సమీక్ష

11



12

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే

- చట్టనిబంధనలు కఠినంగా అమలు చేయండి
- ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలి
- నిబంధనలు ఉల్లంఘించేవారిని ఉపేక్షించవద్దు
- కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం ఏ మేరకు అమలు చేస్తున్నారు?: హైకోర్టు ప్రశ్న
- కౌంటర్ దాఖలుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

మనమంతా ఒక్కటే!

- సమస్యలుంటే నాతో చెప్పండి
- లోక్‌సభలో చర్చల్లో పాల్గొనండి
- టీడీపీ ఎంపీలకు ప్రధాని సూచన
- అరగంట భేటీ, సరదా సంభాషణ
- లోక్‌సభ స్పీకర్ ఎన్నిక తర్వాత మోదీని కలిసి సత్కరించిన ఎంపీలు

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే సభ్యులమైన మనమందరం ఒకటేనని.. తనను కలవాలనుకుంటే ఎప్పుడైనా నిరభ్యంతరంగా కలవొచ్చని ప్రధాని మోదీ టీడీపీ ఎంపీలతో అన్నారు. అందరూ కలిసి వచ్చినా.. లేదంటే విడివిడిగా వచ్చినా పర్వాలేదన్నారు. బుధవారం లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అనంతరం మధ్యాహ్నం టీడీపీ ఎంపీలు ప్రధానితో భేటీ అయ్యారు. సుమారు అరగంట పాటు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, ఇతర ఎంపీలు పాల్గొన్నారు. రామ్మోహన్‌నాయుడు ఎంపీలను మోదీకి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని కుశల ప్రశ్నలు వేశారు. చాలా సరదాగా మాట్లాడారు. తనను కలిసేందుకు కుటుంబ సభ్యులతో రావచ్చొని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తనతో ఓపెన్‌గా చెప్పాలన్నారు. దేశ, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసం

మిగతా 10వ పేజీలో...

రాష్ట్రాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా: మోదీ



ప్రధాని మోదీతో సమావేశమైన టీడీపీ ఎంపీలు

అక్రమ తవ్వకాలు నిజమే

ఇసుకపై సుప్రీం ఆదేశాలు బేఖాతరు



- నదులను తోడేసిన ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ
- మైన్, పర్యావరణ అనుమతులు తీసుకోలేదు
- కనీసం వాటి కోసం దరఖాస్తు కూడా చేయలేదు
- నాగేంద్రకుమార్ పంపిన ఫొటోలన్నీ వాస్తవాలు
- మే 18న సుప్రీంకోర్టుకు కేంద్ర బృందం నివేదిక
- బుకాయించి, అడ్డంగా దొరికిపోయిన జగన్ సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'ఆంధ్రప్రదేశ్‌లో మే 16 వరకూ అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిగాయి. ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ కంపెనీలు ఎలాంటి అనుమతులూ తీసుకోకుండానే తవ్వకాలు సాగించాయి' అని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ శాస్త్రవేత్తల బృందం సుప్రీంకోర్టుకు నివేదించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన తర్వాత మే 14 నుంచి 16 వరకూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరితో పాటు పలు జిల్లాల్లోని ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డులను ఈ బృందం తనిఖీ చేసి అదే నెల 18న నివేదిక సమర్పించింది. ఈ నివేదికలో అనేక సంచలన అంశాలు ఉన్నాయి. ఏపీలో అక్రమ ఇసుక తవ్వకాలా.. అలాంటిదేమీ లేదే? తవ్వకాలు జరిపిన ఆనవాళ్లే లేవంటూ ఇటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున గనుల శాఖ, అటు 23 జిల్లాల కలెక్టర్లు తొలుత ఎన్జీటీకి, ఆ తర్వాత హైకోర్టుకు నివేదికలు ఇచ్చారు. చివరికి మే 10న సుప్రీంకోర్టుకు కూడా అవే నివేదికలు ఇచ్చి, అక్రమ తవ్వకాలు జరగడం లేదని చెప్పారు. వాటిని విశ్వసించని సుప్రీంకోర్టు... ఏపీలో ఇసుక తవ్వకాలపై రెండురోజుల్లో అధ్యయనం చేసి, క్షేత్రస్థాయి పరిశీలనతో నివేదిక ఇవ్వాలని అదేరోజున కేంద్ర అటవీ, పర్యావరణ శాఖను ఆదేశించింది. దీంతో విజయవాడ కేంద్రంగా ఉన్న ఎంవోఈఎఫ్ విభాగంలో ప్రముఖ శాస్త్రవేత్త

మిగతా 12వ పేజీలో...



కుప్పంలో వినతులు స్వీకరిస్తున్న చంద్రబాబు

నన్ను కుప్పంలో లాక్ చేయాలని కుట్ర

ఓటుకు 5 వేలు పంచారు

- కొందరు టీడీపీ నేతలను మభ్యపెట్టారు
- అందుకే ఆశించిన మెజారిటీ రాలేదు
- పేదరిక నిర్మూలనకు ఇక్కడి నుంచే శ్రీకారం
- సింపుల్ ప్రభుత్వం.. సమర్థ పాలన
- ఇదే నా సర్కారు విధానం
- అధికారులు అలా పనిచేయాలి
- బలవంతపు జనసమీకరణలు ఉండవు
- భారీ కాన్వాయ్ హంగామా ఉండదు: సీఎం
- కుప్పంలో ముగిసిన పర్యటన

11

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్వేచ్ఛాజీవి అసాంజే

వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే ఇప్పుడు స్వేచ్ఛాజీవి. ప్రత్యేక విమానంలో బుధవారం స్వదేశం ఆస్ట్రేలియా చేరుకున్న ఆయన, విమానాశ్రయంలో భార్యనీ, తండ్రినీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు, ఎంతో ఉత్సాహంగా తనను పలుకరిస్తున్న మీడియాకు చేతులూపారు. పద్నాలుగేళ్ళ సుదీర్ఘ వివాదం నుంచి తనను బయటపడవేసి, సొంతింటికి చేర్చడంలో కీలకమైన పాత్ర పోషించినందుకు ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌కు ఫోన్‌చేసి ధన్యవాదాలు కూడా తెలియచేశారు. కాస్తంత విశ్రాంతి తీసుకున్నాక త్వరలోనే అసాంజే మీడియా ముందుకు వస్తారని కుటుంబీకులు హామీ ఇచ్చారు. ఏళ్ళతరబడి న్యాయపోరాటం చేస్తూ, ఒకదశలో ప్రాణభయంతో వణికిపోయిన ఆయన చివరకు ఇలా ఒక ఒప్పందానికి వచ్చి, నిర్దోషిగా బయటపడిన క్రమం, అది అమలుజరిగిన వేగం చాలామందికి ఆశ్చర్యం కలిగిస్తున్నది.

నేరాంగీకారానికి అమెరికా ప్రభుత్వంతో ఓ అంగీకారానికి రాగానే ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. బ్రిటన్‌లోని హైసెక్యూరిటీ జైలునుంచి అసాంజే బయటకు వచ్చారు, ఒక ప్రైవేట్ విమానంలో పశ్చిమ పసిఫిక్‌లోని ఉత్తర మారియానా ద్వీపం చేరుకొని, అక్కడి అమెరికా కోర్టులో తప్పు ఒప్పుకున్నారు. నేరుగా అమెరికాలో అడుగుపెట్టి, అక్కడి కోర్టులో ఆ పని చేయాల్సిన బాధలేకుండా ఆస్ట్రేలియాకు అత్యంత సమీపంలో ఉన్న ఓ అమెరికన్ ద్వీపాన్ని ఎంచుకున్నారన్నమాట. అసాంజే తన నేరాన్ని అంగీకరిస్తారు, అందుకు బదులుగా అమెరికా ప్రభుత్వం ఆయనకు విముక్తి ప్రసాదిస్తుంది అన్న సమాచారం అందరికీ ముందే తెలిసినప్పటికీ, న్యాయస్థానంలో అసాంజే ఏయే మాటలతో ఆ పనిపూర్తిచేస్తారన్న ఉత్సుకత మాత్రం కాస్తంత మిగలకపోలేదు. గూఢచర్యం చట్టానికి విరుద్ధంగా, దేశ భద్రతకు సంబంధించిన అతిముఖ్యమైన సమాచారాన్ని సేకరించడం, వ్యాప్తిచేయడం తప్పేనని ఒప్పుకుంటే కథ సుఖాంతం అవుతుంది కనుక ఆయన ఆ పని సవ్యంగా పూర్తిచేశారు, క్షేమంగా బయటపడ్డారు.

అసాంజేను అమెరికాకు అప్పగించండంటూ బ్రిటన్ దిగువకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పుమీద మరో రెండువారాల్లో ఆయన ఎగువకోర్టులో అప్పీలు చేసుకోవాల్సి ఉండగా ఈ ఒప్పందం కుదిరింది. అమెరికా ఆయన మీద పెట్టిన కేసుల లెక్కప్రకారం 175సంవత్సరాల వరకూ జైలుశిక్ష అనుభవించాల్సి రావచ్చు. కానీ, అధికారంలో బైడెన్ ప్రభుత్వం ఉండటం, ఈ ఏడాది చివర్లో అక్కడ అధ్యక్ష ఎన్నికలు జరగబోతూండటంతో వాతావరణం కలిసొచ్చింది.

దేశీయంగానూ, అంతర్జాతీయంగానూ వస్తున్న ఒత్తిడికి బైడెన్ లొంగుతున్న విషయం ఫిబ్రవరిలోనే అర్థమైంది. అసాంజే మీద కేసులు ఉపసంహరించుకోవాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం విజ్ఞప్తిచేయడం, సానుకూలంగా పరిశీలిస్తానని బైడెన్ హామీ ఇవ్వడంతో ఈ నేరాంగీకార ఒప్పందం ద్వారా బయటపడిపోవడానికి అసాంజేకు వీలుకలిగింది. మూడుగంటల విచారణలో ఆయన వాక్‌స్వాతంత్ర్యం, భావ ప్రకటనాస్వేచ్ఛ ఇత్యాది ప్రస్తావనలతో తనను తాను సమర్థించుకుంటూ కొన్ని వ్యాఖ్యలు, విశ్లేషణలు చేశారు. ఒక జర్నలిస్టుగా రహస్యపత్రాలు సేకరించి, ప్రజలకు తెలియచేసే హక్కును కూడా గుర్తుచేశారు. అయినా, అంతిమంగా న్యాయమూర్తికి కావాల్సిన ఆ నాలుగుమాటలూ అన్నందుకు అసాంజేమీద విమర్శలు రావచ్చు కూడా.

అమెరికా రక్షణ వ్యూహాలను, రహస్యాలను, యుద్ధనేరాలను, కుట్రలను, విదేశీప్రముఖుల రహస్య హత్యలను ప్రపంచానికి బహిరంగపరిచి, హీరోలాగా వెలుగుతున్నవాడు, ఎందరికో స్ఫూర్తినిచ్చినవాడు ఇలా అడ్డుతోవలో బయటకు రావడం చాలామంది మెచ్చకపోవచ్చు కూడా. కానీ, అన్ని హక్కులకూ, స్వేచ్ఛలకూ నిలయమని చెప్పుకొనే అమెరికా, దాని మిత్రదేశాలు అసాంజేను తీవ్రంగా వేధించాయి. చివరకు అత్యాచారం కేసులు పెట్టడానికి కూడా వెనుకాడలేదు. హిల్లరీ క్లింటన్ ఈమెయిల్స్ వ్యవహారాన్ని వికీలీక్స్ బయటపెట్టడంతో రాజకీయంగా ఆ వ్యవహారాన్ని వాడుకొని గెలిచిన డోనాల్డ్ ట్రంప్ తన పదవీకాలమంతా అసాంజే వెంటపడ్డారు.

భవిష్యత్తులో పాత్రికేయులు, ప్రజావేగులెవరూ ఇటువంటి సాహసాలకు పూనుకోకుండా భయోత్పాతంలో ముంచాలన్నది లక్ష్యం. ప్రభుత్వాలు దేశరహస్యాలని వేటిని అంటాయో, తమ అకృత్యాలను ప్రజలకు తెలియనివ్వకుండా ఎలా దాస్తాయో వికీలీక్స్ బయటపెట్టింది. అందుకు శిక్షగా పద్నాలుగేళ్ళు కోల్పోయిన అసాంజే ఇప్పుడు స్వేచ్ఛాజీవి అయినందుకు సంతోషించాలి.

నేరం మీది కాదు, నిన్నటిదీ మొన్నటిదీ!!

ఏ కాలంలో ఆ కాలపు విషయాలుంటాయని అనుకుంటాం. కానీ, ఇది అకాలం లాగా, అతీత కాలంగా ఉంది. గత పదేళ్లకాలంలో పేరుకు నరేంద్రమోదీ ప్రధానమంత్రి అయినా, నెహ్రూగారే పాలిస్తున్నారేమో, అన్ని పాపాలకూ ఆయనే భైరవుడు అన్నట్టుగా గడచిపోయింది. ఇప్పుడు నెహ్రూ నుంచి ఇందిరకు నాలుగడుగులు చరిత్రలో ముందడుగు వేశాం. ఇది మూడో విడత మోదీ పాలన కాదు, తాజాగా మనం ఇందిరాగాంధీ నియంతృత్వపు పీడకలను స్మరించడం మొదలుపెట్టాం. కళ్లెదురుగా కనిపిస్తున్న వర్తమానాన్ని మూర్ఛపుచ్చి, కాలయంత్రంలో గతంలోకి నడిపించుకువెళ్లడం సామాన్యమైన విద్య కాదు. ఆ అమోఘమైన విద్యను సాధన చేస్తున్నవారిని అభినందించవలసిందే. ఫ్లాష్ బ్యాక్ కాలాన్ని జీవించే, పునర్జీవించే భారతీయులు అదృష్టవంతులు.



ఆ నాటి ఎమర్జెన్సీ తక్కువదేమీ కాదు. అది స్వతంత్ర భారతం మీద చేసిన స్వదేశీ గాయం చిన్నది కాదు. స్వేచ్ఛకు, పోరాటశీలతకు కత్తులబోనులు మొలిచి, నెత్తురు పారిన కాలం అది. కానీ, ఆ పీడకల నుంచి భారతదేశం తేరుకున్నది. ఎమర్జెన్సీ అనుభవాల నుంచి దేశంలో పౌర హక్కుల ఉద్యమాలు, పాత్రికేయ పరిశోధనోద్యమాలు, న్యాయవ్యవస్థ క్రియాశీలత మొదలైనవన్నీ ఉధృతమయ్యాయి. చరిత్రలో ఆ ఘట్టం ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఏ దేశం చరిత్రలో అయినా అనేక ఉద్రిక్త, విషాద, దుర్మార్గ పర్వాలుంటాయి. కొన్ని జ్ఞాపకాలుగా మారిపోయి, మచ్చలుగానే గుర్తుంటాయి. ఏ న్యాయమూ జరగనప్పుడు మాత్రం ఇంకా సలుపుతూ ఉంటాయి. 1984 సిక్కుల ఊచకోత, అదే ఏడాది భోపాల్ విషవాయు హత్యలు, 1992 బాబ్రీమసీదు కూల్చివేత, ముంబై హింసాకాండ, పేలుళ్లు, 2002 గుజరాత్ ఊచకోత వంటివి, తగిన నిష్కృతి దొరకక, ఇంకా సజీవ వ్రణాలుగానే మిగిలాయి. వాటి ప్రభావాలు, ప్రతిధ్వనులను భరించడంతో పాటు, కొత్తగా తమ ముందుకు వచ్చే అనేక జీవన్మరణ అంశాల మీద కూడా ప్రజలు ఆవేదన చెందుతూ, పరిష్కారాలు వెదుక్కోవలసి ఉంటుంది. దురదృష్టవశాత్తూ, దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకూ గతంలో మూలాలున్నాయి, ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్న జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నిటికీ ఆయా కాలాల్లో వాటితో ప్రమేయం ఉన్నది. ఎవరూ ఇందులో పూర్తి నిర్దోషులు కారు. ఎవరి చేతులూ పవిత్రంగా లేవు. ఆ పార్టీలతోనే ప్రజలు ప్రయోగాలు చేయాలి. గెలిపించాలి. ఓడించాలి.

రాజ్యాంగానికి ప్రమాదం ఉన్నదని, దాన్ని కాపాడుకోవాలని ప్రతిపక్ష కూటమి గత ఎన్నికలలో ప్రచారం చేసింది. మూడోసారి దేశ సారథ్యాన్ని చేపట్టిన నరేంద్రమోదీ నుంచి ఆ ప్రమాదం ఇంకా కొనసాగుతున్నదని కూడా భావిస్తోంది. దాన్ని ఎదుర్కొనడానికి, తామెంతటి రాజ్యాంగ నిబద్ధులమో చెప్పుకోవలసింది పోయి, యాభై ఏళ్ల కింద కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి ద్రోహం చేసిందని బీజేపీ ఎదురుదాడి చేయడంలో ఆత్మరక్షణ వ్యూహం ఉన్నదా, అతిశయించిన మేధ ఉన్నదా తెలియదు. గత రెండు ప్రభుత్వాలలోని అన్ని అంశాలను కొనసాగించే వ్యూహంలో ఇది భాగమా, లేక, కొత్త ఎత్తుగడలు వేయలేని భావదారిద్ర్యమా అర్థం కావడం లేదు.

ఏ కొత్త ప్రభుత్వమైనా పాత ప్రభుత్వాల వైఫల్యాల నుంచి, దుష్పరిపాలనల నుంచే ప్రజల తీర్పును పొందుతుంది. ఓడించడమే పాత ప్రభుత్వానికి పెద్ద శిక్ష. కొన్ని సమయాల్లో, గత ప్రభుత్వాలు ప్రజల విషయంలో, ప్రత్యర్థుల విషయంలో అతి దుర్మార్గంగా వ్యవహరించినప్పుడు, కొంతకాలంపాటు, పాత కాలపు స్మరణ, దోషుల అభిశంసన కొనసాగుతూ ఉంటాయి. అరుదైన సందర్భాలలో, గత పాలకులు నేరస్థులుగా నిర్ధారణ జరిగి, శిక్షలు అనుభవిస్తారు. ఎమర్జెన్సీ కాలంలో, ఇందిరాగాంధీ ప్రభుత్వం అకృత్యాలకు పాల్పడడమే కాక, వాటి సమాచారం వ్యాప్తి చెందకుండా సెన్సార్‌షిప్ కూడా విధించింది. అందువల్ల, ఎమర్జెన్సీ అంతమై, జనతాప్రభుత్వం వచ్చిన తరువాత, ఆ కాలపు అకృత్యాలన్నీ ఒక్కొక్కటిగా వెలికిరావడం, తెలియనివారు దిగ్భ్రాంతి చెందడం దీర్ఘకాలం పాటు జరిగింది. కథలు కథలుగా వాటిని తెలుసుకున్న ప్రజలు, ఆ కోపంలో చాలాకాలం పాటు జనతాప్రభుత్వాన్ని అధికారంలో కొనసాగించి ఉండేవారు. కానీ, రాజకీయ అంతఃకలహాలు, పాలనలో వాటి ప్రతిఫలనాలు వారిలో విరక్తి కలిగించాయి. ఎమర్జెన్సీ ప్రతికూలత మీద అమితంగా ఆధారపడడం ఒక వైపు, కమిషన్ల విచారణలు ఇందిరను వేధించడానికే సాగుతున్నాయన్న అభిప్రాయం కలిగించడం మరోవైపు, 1980లో ప్రజలు తిరిగి ఇందిరకు పట్టం కట్టడానికి కారణం అయ్యాయి. గతం నుంచి, గత ప్రభుత్వాల నుంచి రాజకీయ లాభం కొంత పొందవచ్చు. కానీ, గతాన్నభుక్కులు కావడాన్ని ప్రజలు ఇష్టపడరు.



■ కె. శ్రీనివాస్

సందర్భం

నరేంద్రమోదీ ప్రభుత్వం 2014లో మొదటి దఫా గెలిచినప్పుడు, గత ప్రభుత్వంలోని అవినీతి, పాలనా వైకల్యాల నుంచి బాగానే ప్రయోజనం పొందింది. తరువాత దాన్ని దీర్ఘకాలికం చేసుకోవడానికో, తన విస్తృతమైన ఎజెండాను అమలు చేయడంలో భాగంగా ఆధునిక భారత చరిత్రను కొత్తగా వ్యాఖ్యానించడానికో, గాంధీతో మొదలుపెట్టి, నెహ్రూ కుటుంబం దాకా బోనులో నిలబెట్టింది. గత ప్రభుత్వం స్థానంలో, ఆ ప్రభుత్వం రాజకీయచరిత్రే దోషిగా మారిందన్న మాట. జరిగిందంతా తప్పే, 2014 నుంచి మాత్రమే దిద్దుబాటు మొదలయిందన్న ప్రచారాన్ని భారతీయ సమాజం పూర్తిగా అంగీకరించలేదు. 2024లో ఆ ప్రాజెక్టుకు పెద్ద ఆటంకం ఏర్పడింది. అయినా, ఏమీ జరగనట్టు, ఇంతకాలం అనుసరించిన విధానమే మరింత తీవ్రంగా కొనసాగించడమే కర్తవ్యమన్నట్టు, మోదీ ప్రమాణస్వీకారాల రోజు నుంచే యాభై ఏళ్ల కిందటి చరిత్రను రక్షణకవచంగా ధరించింది. వర్తమానంలో బలమైన ప్రత్యర్థి కాకపోయినా, ఊహలో, గతంలో బలశాలిగా ఉన్న కాంగ్రెస్‌తో మోదీ యుద్ధంచేస్తూ వచ్చారు. గత్యంతరం లేదు, ప్రమాదకరమైన ప్రత్యర్థి లేకపోతే తీవ్ర జాతీయవాదం లేదు.

ఎమర్జెన్సీ జ్ఞాపకాన్ని కవచంగా ధరించడంలో నరేంద్ర మోదీ సరళి అందరికీ పనికివచ్చేది కాదు. 2019 దాకా ఆ పద్ధతి సైద్ధాంతికమైన చట్రం కోసం మాత్రమే ఉద్దేశించింది. కానీ, అది ఇటీవల ఎన్నికలలో పగుళ్లు బారింది. ఇప్పుడు కూడా ఇండియాకూటమి రాజకీయనైతికతను దెబ్బతీయడానికి మాత్రమే ఎమర్జెన్సీను రంగంలోకి దించారు. సైద్ధాంతిక కారణాలు కాక, కేవలం రాజకీయ ఆధిక్యం కోసం కొత్త ప్రభుత్వాలు పాతప్రభుత్వాల నేరాలమీద అమితంగా ఆధారపడడం కూడా అనేక సందర్భాలలో చూడవచ్చు. తెలంగాణలో రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూడా, గత ప్రభుత్వాల రాజకీయ, పాలనా అనైతికత మీద అమితంగా ఆధారపడడంలో ఉన్న ప్రమాదాన్ని గుర్తించాలి. మునుపటి ప్రభుత్వాలు పాల్పడిన రాజకీయ అకృత్యాలయినా, పాలనాపరమైన అక్రమాలైనా, వాటిని బట్టబయలు చేసి, సరైన విచారణకు, న్యాయప్రక్రియలకు నివేదించడం తప్పనిసరి. ఆ క్రమాన్ని ప్రజలు కోరుకుంటారు. అంతేకాదు, అది ప్రజలకు అవసరమైనది కూడా. ప్రభుత్వాలలో ఉన్నవారు ఎంతటి అవినీతికి, అఘాయిత్యాలకు పాల్పడగలరో ప్రజలకు తెలిసి, వారు మున్ముందు అప్రమత్తంగా ఉంటారు. ఇదంతా కూడా పరిపాలనను మెరుగుపరచడానికి జరిగే ప్రక్రియలాగానే ఉండాలి కానీ, రాజకీయ కక్ష సాధింపుగా ప్రజలు భావించే ఆస్కారం ఇవ్వకూడదు. న్యాయంగా కనిపించే నేరవిచారణ, ఏ కీలక దశలో ప్రజలకు అన్యాయంగా అనిపిస్తుందో గ్రహించే వివేచన నాయకులకు ఉండాలి.

> సైద్ధాంతిక కారణాలు కాక, కేవలం రాజకీయ ఆధిక్యం కోసం కొత్తప్రభుత్వాలు పాతప్రభుత్వాల నేరాల మీద అమితంగా ఆధారపడడం కూడా అనేక సందర్భాలలో చూడవచ్చు. తెలంగాణలో రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూడా, గత ప్రభుత్వాల రాజకీయ, పాలనా అనైతికత మీద అమితంగా ఆధార పడడంలో ఉన్న ప్రమాదాన్ని గుర్తించాలి. మునుపటి ప్రభుత్వాలు పాల్పడిన రాజకీయ అకృత్యాలయినా, పాలనా పరమైన అక్రమాలైనా, వాటిని బట్టబయలు చేసి, సరైన విచారణకు, న్యాయప్రక్రియ లకు నివేదించడం తప్పనిసరి. ఆ క్రమాన్ని ప్రజలు కోరుకుంటారు. అంతేకాదు, అది ప్రజలకు అవసరమైనది కూడా.

చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఇంకా నెలరోజులు కూడా కాలేదు. ఒకరి ఘోరపరాజయం, ఒకరి అతి ఘన విజయం అన్న జంటపరిణామాలు సహజంగానే సంచలనం కలిగించాయి. రాజకీయంగాను, ప్రభుత్వపరంగానూ కొన్ని ఉద్రిక్త స్పందనలు కనిపించాయి. ఓటు ద్వారా ఓడించినా, ప్రజల నుంచి కొంత ఆగ్రహప్రకటన కూడా జరిగింది. కానీ, చంద్రబాబు బృందం వెంటనే పనిలోకి దిగింది. ప్రధానమైన వాగ్దానాలపై నిర్ణయం తీసుకుంది. గత పాలన దోషాలను నిగ్గుతీయవలసిందే కానీ, కేవలం గతాన్ని నిందిస్తూ కూర్చుంటే ఉపయోగం లేదన్న గ్రహింపు అందులో ఉంది. కానీ, తెలంగాణలో మాత్రం కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా, పరిస్థితి భిన్నంగా ఉన్నది.

పోయిన డిసెంబర్‌లో తెలంగాణ విజయం, కష్టకాలంలో కాంగ్రెస్‌కు లభించిన రెండో గెలుపు. కాకపోతే, కర్ణాటకలో లాగా ఘనవిజయం లభించలేదు. ఆరు భారీ గ్యారంటీల మీద, ప్రజాస్వామిక పాలన వాగ్దానం మీద ఆధారపడి ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రీత్యా, హామీలన్నీ ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. ఆర్టీసీ ఉచిత ప్రయాణం వెంటనే ప్రారంభించగలిగారు. ఎంతో వ్యవధి లేకుండానే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. అదనంగా 2 లక్షల రుణమాఫీ వాగ్దానం. ఆ వాగ్దానం లేకపోతే, కాంగ్రెస్‌కు ఎనిమిది స్థానాలు కూడా దక్కేవి కాదన్న అభిప్రాయం ఉంది. అసెంబ్లీ ఎన్నికలనాటి వాగ్దానాల విషయంలో గట్టి ముందంజపడి ఉంటే, కాంగ్రెస్ మీద విశ్వాసం మరింత బలంగా ఉండేది. కేసీఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తప్పుడు నిర్ణయాలు, కరెంటు కొనుగోళ్లలో జరిగిన అధికవ్యయాలు, ఇంకా అవినీతులు, అక్రమాలు, ఈ ఆరునెలల కాలంలో చర్చలోకి వచ్చాయి. ప్రభుత్వం సంక్షేమాన్ని అమలుచేయడానికి తగిన ధనవసతి లేకపోవడానికి గత ప్రభుత్వమే కారణమన్న అభిప్రాయమైతే కలిగింది. కానీ, కొత్తప్రభుత్వం చాకచక్యంగా పరిస్థితిని చక్కబరచాలని కూడా ప్రజలు భావిస్తారు.


> దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకూ గతంలో మూలాలున్నాయి, ఇప్పుడు దేశాన్ని పాలిస్తున్న జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నిటికీ ఆయా కాలాల్లో వాటితో ప్రమేయం ఉన్నది. ఎవరూ ఇందులో పూర్తి నిర్దోషులు కారు.

చంద్రబాబుతో పోటీపడి రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేయాలని రేవంత్ రెడ్డి అనుకోవడం బాగుంది. కానీ, ఇంతకాలానికి కూడా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఇంకా స్థిమిత పడలేదని, సమర్థులైన అధికారులు, వ్యవహర్తలైన సలహాదారులు అధినేతకు సమకూరలేదని ఒక అభిప్రాయమైతే వ్యాప్తిలో ఉంది. ఎక్కడో ఫామ్‌హౌస్‌లో ఉండి, అత్యవసర వ్యవహారాలను కూడా పెండింగ్‌లో పెట్టేవారని గత ముఖ్యమంత్రిపై విమర్శలు ఉండేవి. కొత్త ముఖ్యమంత్రి రాజధానిలోనే, విరామం లేకుండా జనం మధ్యలోనో, అధికారులతోనో ఉంటారు. కానీ, అనేక ప్రక్రియలు నత్తనడక నడుస్తున్నాయి. ఈ పరిస్థితికి గత ప్రభుత్వం నుంచి సంక్రమించిన అయోమయం కొంత కారణం. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యేకమైన కొన్ని పరిస్థితులు మరో కారణం. ప్రాంతీయపార్టీకి ఉండే స్వేచ్ఛ, నిర్ణయవేగం రాష్ట్ర కాంగ్రెస్‌లో సాధ్యపడదు. కానీ, పరిపాలన నాణ్యత ప్రజలకే బాగా తెలుస్తుంది. అందులో కలిగే లోపాన్ని గత ప్రభుత్వం మీద అభియోగాలు, ఆరోపణలు భర్తీ చేయలేవు. పైగా, సానుభూతి కలిగిస్తాయి. ప్రతికూల ప్రచారం నుంచి కాక, సానుకూల పాలన నుంచే బలాన్ని పెంచుకోవడానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నించాలి.

ఈ పరిస్థితుల్లో ఫ్రెండ్లీ పోలీసింగ్ సాధ్యమేనా?

విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో పోలీసులు విపరీతమైన విమర్శలు ఎదుర్కొన్నారు. తెలంగాణాలో శాఖ సంస్థాగతంగా ఎప్పటి మాదిరే ఉండటం చేత మార్పు అంతగా బహిర్గతం కాలేదు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం విభజన తర్వాత పోలీసుల పనితీరులో మార్పులు కొట్టొచ్చినట్లు కనపడ్డాయి. దీన్ని వాస్తవ దృక్పథంతో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఎన్డీఏ కూటమి 2024 ఎన్నికల్లో ఏపీలో అధికారంలోకి రావటంతో సంస్థాగతంగా పోలీసు శాఖను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. పోలీసులు తప్పొప్పుల పట్టిక తయారు చేసుకొని, నిర్మాణాత్మకంగా శాఖను సరిదిద్దుకోక తప్పదు.

బ్రిటిష్ వారి హయాంలో పోలీసుల పాత్ర కాగితాలపై నిర్వచించకపోయినా ప్రభుత్వ వ్యతిరేక పనులను నిర్దాక్షిణ్యంగా అణచివేసే ధోరణిని ఒక నిబంధనగా పాటించారు. కానీ కొన్ని పరిమితులు వారి పాలనపై విధించుకున్నారు. స్వాతంత్రోద్యమ నాయకులను సమయోచిత చర్యల ద్వారా నియంత్రించే వారు. విపక్షాలను సమూలంగా నయానో భయానో అణిచివేస్తామనే ఈనాటి పాలకుల విపరీత ధోరణులను, విశృంఖలతను అప్పటి బ్రిటిష్ పాలకులు ప్రదర్శించలేదు.



> అధికారంలోంచి అయిదేళ్ళకొకసారి మారిపోయే రాజకీయ పార్టీలు పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేసే విధానాన్ని అమలుపర్చటానికి సిద్ధంగా లేవు. పోలీసులే సంఘటితంగా రాజ్యాంగం తమకిచ్చిన విధులను, బాధ్యతలను గ్రహించాలి. చట్టానికి మాత్రమే మేము బాధ్యులం అన్న మౌలిక సిద్ధాంతాన్ని విధులలో అమలుపర్చటం మొదలుపెట్టాలి.

ఆల్ ఇండియా సర్వీసుల ఆవిర్భావంతో వలస పాలనలో కష్టాలు అనుభవించిన ప్రజలు మన స్వంత పాలనలో స్వేచ్ఛా గాలులకు పరిమితులు వుండవని, హక్కులను ఎవరూ కాలదన్నరని, రాజ్యాంగాన్ని విధిగా పాటిస్తారని భావించారు. ముఖ్యంగా అధికార యంత్రాంగం ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధులకు సరియైన అవగాహన కల్పిస్తారని, అవసరమైతే విభేదించైనా చట్టపరమైన పాలనకు ఒప్పించి ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలనను అందిస్తారని ఎంతగానో ఆశించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కొన్నేళ్ళు శాసనకర్తలు, పరిపాలనా యంత్రాంగం, న్యాయ వ్యవస్థ, ఆవిధంగానే నడిచాయి. ప్రభుత్వాలలో ఏ పార్టీలు ఉన్నా ప్రజలకు మేలు చేకూర్చే విధంగా, రాజ్యాంగాన్ని అతిక్రమించకుండా విధులు నిర్వర్తించారు. అటు తర్వాత క్రమేపీ పాలనలో రాజకీయం జొరబడింది.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ పార్టీ వారు పాలనా యంత్రాంగాన్ని ప్రజలకు కాకుండా తమకు బాసటగా నిలిచే విధంగా మలుచుకో సాగారు. మొదట్లో మేధావులు, ప్రజా సంఘాలు, తదితర సంఘటిత సంస్థలు ఆ విధానం తప్పుపట్టినప్పుడు వెనక్కు తగ్గారు కానీ అది పైపైనే. క్రమంగా ప్రభుత్వానికీ – అధికారంలో ఉన్న పార్టీకి మధ్య ఉన్న తేడాను గుర్తుచేసే గీత చెరిగిపోయింది. దీనివల్ల ప్రజల రక్షణ కోసం రాజ్యాంగపరంగా ఏర్పడ్డ పోలీసు వ్యవస్థ అధికారంలో ఉన్న పార్టీ వ్యవస్థలో అంతర్భాగమైంది! చట్టాలను అమలు పర్చాల్సిన పోలీసు వ్యవస్థ పాలక వర్గానికి చుట్టమైంది.

సీబీఐ, ఈడీ లాంటి ప్రత్యేక ప్రతిపత్తిగల వ్యవస్థలను కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ వాడుకుంటున్నా, కొన్ని పరిమితుల వల్ల, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు లేకపోవటం వల్ల, ఆవిధమైన మార్పు పూర్తిగా బహిర్గతమవలేదు. కానీ ప్రభుత్వానికి ప్రతినిధి రోడ్డు మీద కనపడే పోలీసు అవటం వల్ల పోలీసులంటే ఇదివరకు వున్న గౌరవం, భయం పోయింది. ప్రజలు పోలీసులను ఎదిరించే వైఖరిని అన్నిచోట్ల కనపరుస్తున్నారు. "ఫ్రెండ్లీ పోలీసు కాదు, మాకు ఎనిమీ పోలీసు" అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. అందువల్ల పోలీసు వ్యవస్థ మౌలికంగా మారకపోతే, చట్టానికి జవాబుదారీగా మనసా వాచా వ్యవహరించకపోతే పరిపాలనా యంత్రాంగంలో ఒక అంగం పూర్తిగా సమాజానికి పనికిరాని స్థితిలోకి వెళ్ళిపోయే ప్రమాదం ఉంది.

అధికారం లోంచి అయిదేళ్ళ కొకసారి మారిపోయే రాజకీయ పార్టీలు పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేసే విధానాన్ని అమలుపర్చటానికి సిద్ధంగా లేవు. పోలీసులే సంఘటితంగా రాజ్యాంగం తమకిచ్చిన విధులను, బాధ్యతలను గ్రహించాలి. చట్టానికి మాత్రమే మేము బాధ్యులం అన్న మౌలిక సిద్ధాంతాన్ని విధులలో అమలుపర్చటం మొదలుపెట్టాలి. అప్పుడే పరిస్థితులు చక్కబడతాయి.


పోలీసు వ్యవస్థకు ప్రస్తుతం సమర్థుడైన నాయకుడి అవసరం ఏర్పడింది. డీజీపీ మాత్రమే ప్రత్యక్షంగా ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలి. పోలీసు వ్యవస్థ మొత్తం డీజీపీ చెప్పుచేతల్లో ఉండాలి. అయితే డీజీపీ పోలీసులను చట్టాలకు బాధ్యులుగా చేసినప్పుడే వ్యవస్థ రాణింపుకు కారణమవుతాడు. ట్రయినింగ్, ట్రాన్స్‌ఫర్స్ క్రమశిక్షణ, తప్పుచేసిన వారిని శిక్షించే చర్యల బాధ్యత అంతా పోలీసు శాఖ అధినేతదే. అరెస్టు, బెయిల్ లాంటి చర్యల పర్యవేక్షణకు క్రిందిస్థాయి ఉన్నతాధికారులు బాధ్యత వహించాలి. ప్రజల విన్నపాలను వినేందుకు ప్రత్యేక వ్యవస్థ జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ఉండాలి. రిక్రూట్‌మెంట్‌లో శాఖాపరమైన ఎంపిక బాధ్యత నిర్వర్తించాలి.

స్థూలంగా ఈ విషయాలకు ప్రాముఖ్యత ఇచ్చి విధులు నిర్వర్తించగలిగితే పోలీసు వ్యవస్థ గాడిలో పడుతుంది. ఒకే ఒక సూత్రం పోలీసుల పనితీరుకు, ప్రజల మేలుకు దోహదపడుతుంది. అది పోలీసులు చట్టానికి బాధ్యులుగా ఉండే విధంగా తీర్చిదిద్దుకోవటమే! పోలీసుల పనితీరులో, దర్యాప్తులో, చట్టాల అములులో పారదర్శకత క్రమేపీ విధానపరంగా ఆవిష్కరించబడుతే 'ఫ్రెండ్లీ పోలీసు' అవతరిస్తాడు. ఆ దృక్పథాన్ని, వ్యవహారశైలిని పోలీసు అమలుపర్చేందుకు పాలకులు కూడా వీలు కల్పించినప్పుడే 'ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థ' సాధ్యమవుతుంది. అప్పుడే పోలీసును 'రక్షక భటుడు' అనవచ్చు!

○ రావులపాటి సీతారాంరావు

పోలవరం పాలిట సైంధవుడు జగన్!

ఆంధ్రప్రదేశ్‌కు సాగునీరు, తాగునీరు, విద్యుత్తు వంటి బహుళ ప్రయోజనాలు చేకూర్చే బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరాన్ని బలిపీఠం పైకి నెట్టి, అయిదు కోట్ల ఆంధ్రుల ఉసురు పోసుకొన్నారు జగన్మోహన్ రెడ్డి. ప్రతిపక్ష నాయకుడుగా పోలవరం పూర్తికాక పోతే రాష్ట్రం ఇబ్బందుల్లో పడుతుందని గుండెలు బాదుకొంటూ సుద్దులు చెప్పిన పెద్ద మనిషి, అధికారంలోకి వచ్చాక పోలవరం పాలిట సైంధవుడు అయ్యారు. మూర్ఖత్వం, మొండితనంతో రాష్ట్ర ప్రగతికి ప్రాణప్రదమైన ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ వ్యతిరేకించినా అవినీతి జరిగిందంటూ రివర్స్ టెండర్స్ పేరుతో జగన్ రెడ్డి ఆడిన నాటకం అప్పటివరకు పరుగులు తీసిన పోలవరం పాలిట శాపం అయింది. కాంట్రాక్టరును మార్చకుండా అదే స్పీడ్‌లో ప్రాజెక్టు పనులు కొనసాగించి ఉంటే ఈ రోజు పోలవరానికి ఈ పరిస్థితి దాపురించేది కాదు. కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్టరును మార్చవద్దని హెచ్చరించినా వినిపించుకోలేదు. 2018లో పూర్తయిన డయాఫ్రం వాల్‌పై 2020 నాటికి ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మించాలన్న విషయాన్నీ పట్టించుకోలేదు. కాఫర్ డ్యాం గ్యాప్‌లు పూడ్చకపోవడంతో 2020, 2021, 2022ల్లో వచ్చిన వరదనీరు డయాఫ్రం వాల్‌పై పడి దెబ్బతిన్నది. పోలవరం ప్రాజెక్టులో ప్రధానమైన



ఆనకట్ట స్పిల్‌వేకి ఎంతటి ప్రాధాన్యత ఉంటుందో, డయాఫ్రం వాల్ కూడా అంతే కీలకమైనది. 50 లక్షల వరద వచ్చినా బయటికి పంపేందుకు స్పిల్‌వే ఉపకరిస్తే, డయాఫ్రం వాల్ నదీ గర్భంలో ఊట కిందకు రాకుండా నిలువరిస్తుంది. ఎగువ కాఫర్ డ్యాం లోని ఖాళీలను సకాలంలో పూడ్చని కారణంగానే డయాఫ్రం వాల్ దెబ్బతిన్నదని హైదరాబాద్ ఐఐటి నిపుణుల బృందం స్పష్టం చేసింది. దిగువ కాఫర్ డ్యాం పనుల్లో ఆలస్యం మూలంగా ప్రధాన ఆనకట్ట వరకు వరద ముంచెత్తిందని, కేంద్ర సంస్థల హెచ్చరికలను పెడచెవిన పెట్టారని, పోలవరం ప్రాజెక్టు అథారిటీ కూడా చివాట్లు పెట్టింది. జగన్ చేతకానితనానికి ప్రాజెక్టులో అత్యంత కీలకమైన స్పిల్ వేకు రక్షణగా రూ.81 కోట్లతో నిర్మించిన గైడ్‌బండ్ కుంగిపోయింది. అట్లాగే పని చేతకానివారికి ప్రగల్భాలు ఎక్కువని పోలవరం ప్రాజెక్టు కలను 2021 జూన్ నాటికి నిజం చేస్తామని గొప్పలు చెప్పారు. తర్వాత 2022 ఖరీఫ్ నాటికి పోలవరం నీళ్లు పారిస్తామని ప్రగల్భాలు పలికారు. తర్వాత ఎన్ని అడ్డంకులు ఎదురైనా అధిగమించి 2023 ఖరీఫ్ నాటికి పోలవరాన్ని పూర్తి చేస్తామని జగన్ రెడ్డి శాసనసభలో ప్రకటించారు. ఈ విధంగా పోలవరంపై మొదటి నుండి ప్రజలను మాయ చేసారు.

పోలవరం ప్రస్తుత పరిస్థితిని చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ఆవేదన చెందారు. ప్రాజెక్టును, డయాఫ్రం వాల్ దెబ్బతిన్న ప్రాంతాన్ని సందర్శించి అయిదేళ్ల తన కష్టాన్ని జగన్ ప్రభుత్వం బూడిదలో పోసిందంటూ ఆవేదన చెందారు. 2014–19 మధ్య 72 శాతం మేర పనులు పూర్తయినాయి, గతంలో నేను సీఎంగా మొత్తం 30 సార్లు ప్రాజెక్టును సందర్శించాను. పోలవరం పూర్తయితే 7.2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సృష్టించడం, 23.5 లక్షల ఎకరాలను స్థిరీకరించడం, 28.5 లక్షల మందికి దాహార్తిని తీర్చడంతో పాటు 960 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అయ్యేదని చెప్పారు. పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానం చేసుకోగలిగితే రాష్ట్రానికి కరువు లేకుండా చేయొచ్చని, 45.72 మీటర్ల ఎత్తుతో 194 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా ప్రాజెక్టును డిజైన్ చేశాం అని చెప్పారు. 194 టీఎంసీల నీళ్ల ప్రాజెక్టులో నిల్వ ఉంచుకుంటే వరద నీటితో కలిపి 320 టీఎంసీల నీటిని వాడుకోవడానికి అవకాశం ఉండేదని అన్నారు.

డయాఫ్రం వాల్‌పై తెలుగుదేశం ప్రభుత్వం ఖర్చు చేసింది రూ.446 కోట్లు కాగా, జగన్ నిర్వాకం వల్ల ప్రస్తుతం దానిని రిపేరు చేయడానికి రూ.447 కోట్లు కానున్నది. అయినా పూర్తి స్థాయిలో బాగవుతుందనే నమ్మకం లేదు. సమాంతరంగా కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలి అంటే రూ.990 కోట్లు ఖర్చు కానున్నది. ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యామ్ రూ.550 కోట్లతో నిర్మాణం జరిగింది. ఇవన్నీ చక్కదిద్దాలంటే ఎన్ని వేల కోట్లు కావాలో! ఏది ఏమైనా పోలవరాన్ని పొట్టనపెట్టుకొన్న జగన్ అయిదు కోట్ల ఆంధ్రులకు తీరని ద్రోహం చేశారు.

• నీరుకొండ ప్రసాద్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

కూటమి ముందు కఠినమైన సవాళ్లు

ప్రజాభీష్టం మేరకు ఏర్పడిన తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమి 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించి ఏపీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రదర్శించి కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారు. అనేక ఆశలు, ఆశయాలు, ఉద్వేగాల మధ్య జూన్ 21న కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు శాసనసభలో అడుగుపెట్టారు. ఒకపక్క నేను మళ్ళీ ముఖ్యమంత్రిగానే ఈ సభలో అడుగుపెడతాను అని శపథం చేసిన చంద్రబాబు, మరోపక్క అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వం అనేటువంటి అనేక రకమైన అవమానాలు ఎదుర్కొన్న పవన్ కళ్యాణ్.. ఈ ఇరువురూ వైసీపీ నాయకుల అహంభావాన్ని అథఃపాతాళానికి తొక్కి ప్రజాస్వామ్యంలో అధికారం ఎల్లవేళలా ఒకరి సొత్తు కాదని నిరూపిస్తూ సగర్వంగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కి రెండోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచి ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ అసెంబ్లీలో అడుగుపెట్టిన దృశ్యాన్ని కోట్లాది మంది ప్రజలు సంతోషంతో చూశారు. "నిజం గెలిచింది, ప్రజాస్వామ్యం గెలిచింది" అంటూ సభ్యుల హర్షధ్వానాల మధ్య శాసనసభ కొలువు తీరింది.



ఇక ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముందు అనేక సవాళ్లతో కూడిన బాధ్యతలు ఉన్నాయి. ప్రజలకు మేలు చేస్తున్నట్లు భ్రమింపజేసే అభివృద్ధిలేని తాత్కాలిక సంక్షేమ పథకాలు ఎక్కువకాలం కొనసాగలేవని, చివరికి అవి పేదరికాన్నే కొనసాగిస్తాయని, సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా అవసరమనే చాలా స్పష్టమైన హెచ్చరికలతో గత ప్రభుత్వానికి ప్రజలు గట్టి గుణపాఠం చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అప్పుల ఊబిలో కూర్చేసిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడం ప్రస్తుత కూటమి ముందున్న అతిపెద్ద సవాల్. ఎన్నికల సమయంలో కూటమి కూడా ప్రజలకు అనేక హామీలు ఇచ్చింది. ప్రజలపై కొత్త భారాలు వేయకుండా అవన్నీ నెరవేర్చాలంటే ఒకింత కష్టసాధ్యమే. ఒకపక్క బడుగు బలహీన వర్గాలకు సంక్షేమం అందిస్తూనే, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడం, మరోవైపు ఆదాయాలు పెంచి, సంపద సృష్టించి రాష్ట్రాన్ని ఆర్థికంగా నిలబెట్టడం కూటమి ముందున్న ప్రధాన లక్ష్యం.

> గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ లేకుండా అప్పుల ఊబిలోకి నెట్టిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టడం ప్రస్తుత కూటమి ముందున్న అతిపెద్ద సవాల్. చంద్రబాబు అనుభవం, పవన్ కళ్యాణ్ నిబద్ధత, ప్రధాని మోదీ విశ్వసనీయతల ఆధారంగా వారు రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టగలరని ప్రజలు నమ్ముతున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత కూటమి ప్రభుత్వం ముందు ఉంది.

గత ఐదేళ్లుగా ప్రజలు నానారకాలుగా ఇబ్బందులు పడ్డారు. అన్ని రంగాలు కుదేలైపోయాయి. అవినీతి పెచ్చరిల్లిపోయింది. కల్తీ మద్యం ఏరులై పారింది. ఇసుక, మట్టి, గనులు, ఎర్రచందనం లాంటి ప్రకృతి వనరులు అన్నీ దోచుకోబడ్డాయి. కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు కూడా ఇతర రాష్ట్రాలకు పారిపోయే పరిస్థితి ఏర్పడింది. ఉపాధి అవకాశాలు లేక యువత వలస బాట పట్టారు. నిరుద్యోగుల పరిస్థితి అగమ్య గోచరం. రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. ఉద్యోగులు తమ హక్కులు సాధించకోలేకపోగా అనేక అవమానాలు భరించారు. మహిళలు అభద్రతా భావంలో బతుకుతున్నారు. కాంట్రాక్టర్లకు కన్నీళ్లే మిగిలాయి. చట్టబద్ధ పాలన అనేదే లేకుండా పోయింది. పంచాయితీ, రెవెన్యూ వ్యవస్థల మధ్య చిచ్చు పెట్టారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. నీటిపారుదల వ్యవస్థ చిన్నాభిన్నం అయింది. ప్రాజెక్టులన్నీ నిర్వీర్యమైపోయాయి. మాతృభాష మృతభాషగా మారింది. విద్యా, వైద్య రంగాలు కుదేలయ్యాయి. ఇక రాజధాని అమరావతి పరిస్థితి అయితే మరింత దారుణంగా తయారైంది. అక్కడి రైతుల త్యాగానికి విలువ లేకుండా పోయింది. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒక్క విభజన హామీ కూడా సాధించలేని దుస్థితి నెలకొంది. ఇలా అన్ని రకాలుగా చిన్నాభిన్నం చేసి రాష్ట్రాన్ని కూటమి చేతిలో పెట్టింది గత వైసీపీ ప్రభుత్వం. ఇప్పుడు ప్రతీ వ్యవస్థనూ నిర్మించుకోవాలి. చంద్రబాబు అనుభవం, పవన్ కళ్యాణ్ నిబద్ధత, ప్రధాని మోదీ విశ్వసనీయతల ఆధారంగా వారు రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టగలరని ప్రజలు నమ్ముతున్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత కూటమి ప్రభుత్వం ముందు ఉంది.

సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సమతూకం సాధించాలి. రాష్ట్రంలో ఉన్న అపారమైన వనరుల్ని సద్వినియోగం చేసుకోవడం, ఉపాధి అవకాశాలు పెంచడం, మౌలిక సదుపాయాలని మెరుగు పరచడం, చట్టబద్ధ పాలన అందించడం, విద్యా వైద్య ప్రమాణాల్ని పెంచడం, శాంతిభద్రతలు నెలకొల్పడం, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడం, పెట్టుబడిదారుల్లో కోల్పోయిన విశ్వాసాన్ని మళ్ళీ తిరిగి పెంచడం, వాలంటీర్ల వ్యవస్థను ప్రక్షాళన చేయడం, విభజన హామీల సాధనపై దృష్టి సారించడం, కేంద్రంతో ఉన్న సత్సంబంధాలను సద్వినియోగం చేసుకోవడం కూటమి ప్రభుత్వం ముందున్న లక్ష్యాలు.

ఆర్థిక పరిస్థితితో పాటు అన్ని రంగాలలో నేడు నెలకొన్న వాస్తవ పరిస్థితులపై శ్వేతపత్రాలు విడుదల చేయాలి. ప్రజలకు వాస్తవాలు వివరించాలి. మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్నవారు వాడే భాషలో, ప్రవర్తనలో హుందాతనంతో వ్యవహరించాలి. ప్రజలకు తాము సేవకులమే కాని, యజమానులం కాదనే ప్రజాస్వామ్య స్ఫూర్తితో మెలగాలి. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు మరీ శృతిమించి స్వామిభక్తి చూపిస్తూ వ్యవస్థల విధ్వంసానికి కారకులయ్యారు. అటువంటి వారిని గుర్తించి ముఖ్య బాధ్యతల నుంచి దూరంపెట్టాలి. రాష్ట్రంలో అద్భుతమైన పనితీరు కనబరచగలిగే అధికారులు ఎందరో ఉన్నారు. వారి ప్రతిభాపాటవాలను సరైన దిశగా ఉపయోగించుకోవాలి. ఇక ప్రతిపక్షం అంటే ప్రజలు, ప్రజాసంఘాలు, మేధావులు, మీడియా అని గుర్తెరిగి ప్రవర్తించాలి. అధ్యయనం, అడిగి తెలుసుకోవడం, అధికారులతో సమీక్షించడం, అమలు చేయడం... ఈ నాలుగు పాలనలో నూతన మార్పులకు శ్రీకారం చుడతాయని గ్రహించాలి.

• కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి

శిరస్త్రాణం తప్పనిసరి...

ద్విచక్ర వాహనదారులకు ఇక హెల్మెట్ ధారణ

- ఆదేశాలిచ్చిన హైకోర్టు
- ప్రస్తుతం రోజుకు 260 నో హెల్మెట్ కేసులు
- రోడ్డు ప్రమాదాల్లో మరణాలకు హెల్మెట్ లేకపోవడమే కారణం



ఇప్పటి వరకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు తలపై హెల్మెట్ ఉన్నా లేకపోయినా చూసీచూడనట్టు వ్యవహరించిన పోలీసులు ఇక నుంచి కఠినంగా వ్యవహరించనున్నారు. తనిఖీలు చేస్తున్న సమయంలో పట్టుబడిన వారికి జరిమానాలు విధించిన పోలీసులు హెల్మెట్ ధరించని ప్రతి వాహనందారుడికి జరిమానా విధించబోతున్నారు. రాష్ట్రంలో ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని హైకోర్టు బుధవారం ఆదేశాలు ఇచ్చింది. దీంతో విజయవాడ నగరంలో ఈ ఆదేశాలు త్వరలో అమలు కాబోతున్నాయి.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించినప్పుడు పోలీసులు, రవాణా శాఖ అధికారులు ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వారిలో చైతన్యం తీసుకురావడానికి గులాబీలను వాహనదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల వల్ల కొంతమంది వాహనదారుల్లో చైతన్యం వచ్చింది. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించడానికి హెల్మెట్ ధారణను తప్పనిసరి చేయాలని ఐక్యరాజ్యసమితి 2010లోనే నిర్ణయించింది. హెల్మెట్ నిబంధనను ఉల్లంఘించిన వారికి కఠిన జరిమానాలు విధించాలని ప్రణాళిక రూపొందించింది. పోలీసులు అమలు చేయడానికి సిద్ధపడినా ప్రభుత్వాల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో హెల్మెట్ నిబంధనను కఠినంగా అమలు చేయలేకపోయారు. హైదరాబాద్‌లో హెచ్‌ట్రిమ్స్ (హైదరాబాద్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం)ను అమలు చేసిన తర్వాత హెల్మెట్ ధారణతోపాటు సిగ్నల్స్ వద్ద నిబంధనలను పాటించడంపై అవగాహన పెరిగింది. ఈ మాదిరిగానే విజయవాడలో ఈ రెండు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని భావించారు. ఇందులో భాగంగా నగరంలో పోలీసులు పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేవారు. హెల్మెట్ ధరించని వాహనాలను ఆపి జరిమానాలు విధించేవారు. దీనిపై పలువురు వాహనదారుల నుంచి తిరుగుబాటు రావడంతో చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

ఉమ్మడి కృష్ణాలో 8 లక్షల వాహనాలు

ప్రస్తుతం విజయవాడలో 13 మంది ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఒక్కొక్కరు రోజుకు సుమారుగా 20 నో హెల్మెట్ కేసులను నమోదు చేస్తున్నారు. రోజుకు మొత్తం 260 కేసులను నమోదు చేస్తున్నారు. దేశంలో ఇతర నగరాలతో పోల్చుకుంటే తక్కువ జరిమానాను విజయవాడలో విధిస్తున్నారు. నో హెల్మెట్‌కు హైదరాబాద్‌లో రూ.200, ఢిల్లీలో రూ.1000, ముంబయి రూ.1000, గోవా రూ.500 జరిమానా విధిస్తున్నారు. ఇక్కడ మాత్రం రూ.100 జరిమానా విధిస్తున్నారు. దీంతో వాహనదారులు నో హెల్మెట్‌పై భయం లేకుండా పోతోంది. పోలీసులు ఆపి చలానా చేతిలో పెట్టినా రూ.100 చెల్లించేస్తున్నారు. ఇలా ఎన్నిసార్లు అయినా చలానాలు చెల్లిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 8 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. వాటిలో సగానికి పైగా వాహనాలు విజయవాడ లోనే ఉన్నాయి. ఇందులో హెల్మెట్ ధరిస్తున్న వారి సంఖ్య చాలా స్వల్పంగా ఉంటోంది. ప్రతి ఒక్కరి తలపైనా హెల్మెట్ ఉండేలా చేయాలని భావిస్తున్న పోలీసులకు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఊతం ఇవ్వబోతున్నాయి.



కలిసి పనిచేద్దాం

- జిల్లాను అగ్రపథాన నిలిపేందుకు కలిసి అడుగులు వేద్దాం
- కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సృజన
- తక్షణం ప్రజారోగ్యంపై దృష్టి
- జిల్లా అధికారులతో మర్యాదపూర్వక భేటీ

4లో..

'మత్తు' వదిలిద్దాం!



అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ వినియోగ వ్యతిరేక దినం సందర్భంగా నగరంలో బుధవారం ర్యాలీ జరిగింది. పటమట సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మారిస్ స్టెల్లా కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, ఎన్జీవోలు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో స్టెల్లా కళాశాల నుంచి బెంజిసర్కిల్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

కార్పొరేషన్ స్థలం కబ్జా!

విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాలు చాలా వాటిని వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు కబ్జా చేశారు. మాజీ మంత్రి జోగి రమేశ్ ఏకంగా అగ్రిగోల్డ్ ఆస్తులకే టెండర్ పెట్టిన విషయం విదితమే. తాజాగా వైసీపీకి చెందిన మరో నేత బాగోతం బట్టబయలైంది. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే వీఎంసీ స్థలాన్ని ఆ నేత కబ్జా చేసి, దుకాణాలు నిర్మించి వాటిని దర్జాగా అద్దెకు ఇచ్చేశాడు. ఇంత జరుగుతున్నా కార్పొరేషన్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.



ఆక్రమణ స్థలంలో వెలసిన దుకాణాలు

రూ.10 కోట్ల స్థలం వైసీపీ నాయకుడి హస్తగతం

చోద్యంచూస్తున్న వీఎంసీ అధికారులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : విజయవాడ నగర నడిబొడ్డులో బీఆర్‌టీఎస్ రోడ్డులో ఉన్న ఫుడ్ జంక్షన్ వద్ద ఉన్న సుమారు 500 గజాల ఖాళీ స్థలాన్ని సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకుడు కబ్జా చేశారు. వాస్తవానికి బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణ సమయంలో పాత రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ఈ స్థలాన్ని కార్పొరేషన్‌కు అప్పగించారు. కార్పొరేషన్ అధికారులు జేఎన్ఎన్‌యుఆర్ఎం పథకంలో ఈ స్థలాన్ని తీసుకుని బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణం చేశారు. మాచవరం పడవల రేవు వద్ద నుంచి సీతన్నపేట గేటు వరకు రోడ్డు వేశారు. ఈ స్థలంలో అప్పట్లో చిన్నచిన్న పాకలు ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక నాయకుల కన్ను దానిపై పడింది. స్థలాన్ని ఆక్రమించి పాకలు వేసుకున్నారంటూ వారిని బెదిరించి పాకలను తొలగించేశారు.

● ఆక్రమించి.. షాపులకు అద్దెకిచ్చి..

ఆ ప్రదేశంలో దుకాణాలను ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కనుసన్నల్లో స్థానిక వైసీపీ నాయకుడి స్వాధీనంలో ఈ స్థలం ఉంది. వీఎంసీ స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకోవడమే కాకుండా స్థలాన్ని ఆక్రమించుకుని హద్దులు ఏర్పాటు చేసుకున్నాడు. ఐదు షాపులను ఏర్పాటు చేసుకుని అద్దెకు ఇచ్చారు. ఒక షాపులో టిఫిన్ స్టాల్ ఏర్పాటు చేసుకుని, ఇక్కడే రాత్రి వేళల్లో మందు విందు చేసుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం ఇక్కడ గొడవ పడి కొట్టుకున్నారు. ఈ గొడవ సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌లో పంచాయితీకి వెళితే పోలీసులు హెచ్చరించి వదిలేసినట్టు చెబుతున్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కనే ఉన్న ఈ స్థలానికి మూడు వైపులా అపార్ట్‌మెంట్లు వెలిశాయి. ఇక్కడ చదరపు గజం సుమారు రెండు లక్షల రూపాయలపైనే ఉంటుంది. ఈ స్థలం కార్పొరేషన్‌ది అని తెలిసినా కార్పొరేషన్ అధికారులు కనీసం అటుగా కన్నెత్తి చూడటం లేదు.

పోస్టులపై కసరత్తు



ఉమ్మడి జిల్లాలో 1213 టీచర్ పోస్టుల భర్తీకి అవకాశం

నాలుగు రోజుల్లో డీఎస్సీ 2024 షెడ్యూలు విడుదల

- జిల్లాలో ఎస్జీటీ పోస్టులు 580
- షెడ్యూల్ విడుదలైతే రోస్టర్ పాయింట్ల ప్రకారం పోస్టుల కేటాయింపు
- 117 జీవోను రద్దు చేస్తే యూపీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల నియామకానికి మార్గం సుగమం

ఎన్నికల హామీల్లో భాగంగా డీఎస్సీ షెడ్యూల్‌ను కూటమి ప్రభుత్వం మరో నాలుగు రోజుల్లో విడుదల చేయనుంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు డీఎస్సీ షెడ్యూలును ప్రకటిస్తే, అందుకు అనుగుణంగా జిల్లా విద్యాశాఖ అధికారులు టీచర్ పోస్టుల ఖాళీలు, రోస్టర్ పాయింట్ల కేటాయింపు తదితర అంశాలపై లెక్కలను సరిచూసేందుకు సమాయత్తమవుతున్నారు. డీఎస్సీ 2024లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1213 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 580 ఉన్నాయి. సబ్జెక్టు టీచర్ల పోస్టుల భర్తీపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క టీచరు పోస్టును కూడా భర్తీ చేయలేదు. దీంతో బీఈడీ, డీఈడీ చదివిన విద్యార్థులు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ పలుమార్లు రోడ్డెక్కి ఉద్యమాలు చేశారు. అయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

వైసీపీ పాలనలో గాడి తప్పిన విద్యా వ్యవస్థ

నూతన విద్యావిధానం అమలుతోపాటు, జీవో నెంబరు 117ను విడుదల చేసి విద్యా వ్యవస్థలో వింత ప్రయోగాలు చేసింది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సబ్జెక్టు టీచర్లను ఉన్నత పాఠశాలలకు బదిలీ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కేవలం 209 పోస్టులను భర్తీ చేయనున్నట్టు నోటిఫికేషన్‌లో చూపింది. అందులో ఎస్జీటీ పోస్టులను 102గా చూపింది. ఎన్నికలకు ముందు విడుదల చేసిన ఈ నోటిఫికేషన్ నిలిచిపోయింది.

ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలి

వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సబ్జెక్టు టీచర్లను ఉన్నత పాఠశాలలకు బదిలీచేస్తూ వచ్చింది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లతోపాటు 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లుగా ఉండి కాంట్రాక్టు పద్ధతిపై పనిచేసే ఒక టీచరును నియమించి చేతులు దులుపుకుంది. విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. ఫలితంగా యూపీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కొత్తగా నియామకం చేసే స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అధిక శాతం యూపీ పాఠశాలల్లో భర్తీ చేయాలనే డిమాండ్ ఉపాధ్యాయ సంఘాల నుంచి వస్తోంది. దీంతో పాటు ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలకు వేర్వేరుగా సబ్జెక్టు టీచర్లు ఉంటే టీచరు పోస్టుల సంఖ్య పెరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

60 వేల మంది వరకు పోటీ

నూతన ప్రభుత్వం డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులను భర్తీ చేయనుండటంతో ఈ పోస్టుల కోసం ఈసారి పోటీ అధికంగా ఉండే అవకాశం ఉంది. జిల్లాలో బీఈడీ, డీఈడీ చదివినవారు 60 వేల మందికిపైగా టీచర్ పోస్టుల కోసం పోటీ పడనున్నారు. ఇప్పటికే టెట్ పరీక్ష రాసిన వారితోపాటు, ఈ ఏడాది బీఈడీ, డీఈడీ పూర్తి చేసినవారు డీఎస్సీ పరీక్ష రాసేందుకు, మళ్లీ టెట్ పరీక్ష నిర్వహించేందుకు అవకాశం ఇవ్వడంతో టీచర్ పోస్టుల కోసం పోటీ పడేవారి సంఖ్య మరింతగా పెరగనుంది. డీఎస్సీ షెడ్యూలు విడుదలైతే రోస్టర్ పాయింట్ల ప్రకారం రిజర్వేషన్ల ఆధారంగా ఎవరికి ఎన్ని పోస్టులు కేటాయించాలి? ఏయే పాఠశాలల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఎన్ని ఖాళీలున్నాయి? తదితర లెక్కలను సరిచూసి ప్రభుత్వానికి పంపుతామని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

షేక్ మహ్మద్ పేట!

డయేరియా లక్షణాలతో వణికిపోయిన గ్రామం

- నిధుల్లేక పడకేసిన పారిశుధ్య నిర్వహణ
- 10వేల జనాభాకు ఇద్దరే పారిశుధ్య కార్మికులు
- మంచినీటి పథక నిర్వహణ అస్తవ్యస్తం
- బావి నీరే దిక్కు.. శుద్ధి చేయకుండా సరఫరా
- ఐదేళ్ల వైసీపీ పాలనలో రూపాయి కూడా గ్రాంటు ఇవ్వని దైన్యం

జగ్గయ్యపేటకు సమీపంలో 10 వేలకుపైగా జనాభా కలిగిన షేర్‌మహ్మద్‌పేట గ్రామం డయేరియా లక్షణాలతో షేక్ అయిపోతోంది. రోజురోజుకూ కేసులు పెరుగుతుండటంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పాలన పూర్తిగా గాడి తప్పడం.. ప్రత్యేక అధికారి పాలన సాగడం, ఒక్క రూపాయి కూడా గ్రాంటు రాకపోవడం, పారిశుధ్య నిర్వహణ పూర్తిగా పడకేయడం.. తాగునీటి శుద్ధి లేకపోవడం.. సిబ్బంది కొరత వేధిస్తుండటం లాంటి సమస్యలతో పంచాయతీ కునారిల్లింది. డయేరియా ప్రబలడానికి ఇవన్నీ కారణాలు కనిపిస్తున్నాయి.



షేర్‌మహ్మద్‌పేట ప్రజలకు సరఫరా అవుతున్న బావిలో నీరు ఇదే..

జగ్గయ్యపేట : పట్టణాలకు శివారు ప్రాంతాల విలీనంతో జగ్గయ్యపేట పురపాలక సంఘంలో షేర్‌మహ్మద్‌పేట గ్రామ పరిధిలో ఉన్న జగ్గయ్యపేట ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఆటోనగర్‌లను విలీనం చేయటంతో పంచాయతీ ఎన్నికలు జరగలేదు. ప్రభుత్వం పంచాయతీకి స్పెషలాఫీసర్‌గా పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావును నియమించింది. షేర్‌మహ్మద్‌పేట గ్రామం జాతీయ రహదారి ఆనుకోని ఇటు జగ్గయ్యపేట వైపు, అటు గండ్రాయి రోడ్డుకు ఇటు హైవే వైపునకు విస్తరించింది.

పంచాయతీకి ఆదాయం శూన్యం

పంచాయతీ ఇంటి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం మినహా ఏ ఇతర ఆదాయం లేదు. రూ.12 లక్షల డిమాండ్‌కుగాను రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలు మాత్రమే పన్నులు వసూలవుతున్నాయి. ఆ నిధులతో పంచాయతీ వీధిదీపాలు, మంచినీటి పథకం, పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాల్సి వస్తోంది.

తీరని సిబ్బంది కొరత

పారిశుధ్య విభాగానికి ఏడుగురు, మంచినీటి పథకానికి ముగ్గురు, కార్యాలయం సిబ్బంది మరో ముగ్గురికి జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. 7-8 నెలలుగా జీతాలు ఇవ్వకపోవటంతో ప్రస్తుతం పారిశుధ్య కార్మికుల్లో ఇద్దరే పనిచేస్తున్నారు. వారితోనే అంత పెద్ద పంచాయతీలో కాల్వలు శుభ్రం చేయటం, పూడిక ఎత్తేయటం పనులు చేయాల్సి వస్తోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ వ్యవస్థ నిర్వీర్యమైంది. మోడల్ కాలనీలో సరైన డ్రైనేజీ లేకపోవటంతో ఇళ్ల ముందు గుంతలు తీసుకుని వాటిలోకి మళ్లిస్తున్నారు.

నీళ్లు తాగాలంటే భయమేస్తోంది...

పంచాయతీ నీళ్లు తాగాలంటే భయమేస్తోందని, వాటర్ క్యాన్ల నీళ్లు కొని తాగుతున్నామని గ్రామానికి చెందిన కాకనబోయిన ముక్కంటి తెలిపారు. డయేరియా వచ్చాక హడావుడిగా డ్రెయిన్లు తీశారని, మంచినీటి బావి వద్ద బాగు చేశారని, అంత ముందు జుగుప్సాకరంగా ఉండేదని గ్రామానికి చెందిన లింగయ్య తెలిపారు.

డయేరియా ప్రబలిన తరువాత ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పంచాయతీ స్పెషలాఫీసర్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

నీటి కలుషితానికి కారణాలివే..

- బావుల్లో నుంచి నీటిని తోడి ట్యాంకులకు ఎక్కించి, పైపులైన్ల ద్వారా గ్రామానికి తాగునీటిని పంచాయతీ సరఫరా చేస్తోంది.
- బావులకు కనీసం మూతలు లేవు.
- గ్రామానికి సమీపంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చిన రసాయనాలు చేరి భూగర్భజలాలు కలుషితమయ్యాయి.
- కనీసం క్లోరినేషన్ కూడా చేయడం లేదు.
- శాస్త్రీయంగా నీటి శుద్ధి జరపకుండానే నీటి సరఫరా చేస్తున్నారు.
- ఏ దశలోనూ నీటి శాంపిల్స్ తీయడం లేదు. పరీక్షలు నిర్వహించడం లేదు.
- గ్రామానికి నీటి సరఫరా చేసే బావిలో నీళ్లు పచ్చగా కనిపిస్తున్నాయి. బావి గోడలు పాచితో అశుభ్రంగా ఉన్నాయి.
- ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నీటి శాంపిల్స్ బాగున్నాయని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి.
- బావి పరిసరాలు మురుగు కనిపించకుండా కంకర డస్ట్‌తో కవర్ చేశారు.
- మోడల్ కాలనీలో బావి వద్ద పిచ్చి చెట్లు పెరిగి అశుభ్రంగా ఉంది. అక్కడ డ్రైనేజీలో నీరు చేరకుండా తాత్కాలికంగా కచ్చా డ్రైన్ తీయించారు.

గ్రాంటు లేక అవస్థలు పడుతున్నాం

ప్రస్తుతం గ్రామంలో ఇద్దరే పంచాయతీ పారిశుధ్య కార్మికులు విధులకు వస్తున్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన కార్మికులను పెట్టి పనిచేయిస్తున్నాం. పంచాయతీ గ్రాంటు లేకపోవటంతో నిర్వహణ కూడా చేయలేకపోతున్నాం.

- నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

11 కొత్త కేసులు

జగ్గయ్యపేటలో బుధవారం కొత్తగా 11 డయేరియా కేసులు నమోదైయ్యాయి. పెనుగంచిప్రోలు మండలంలో కొణకంచి గ్రామంలో డయేరియా లక్షణాలతో గెంటేల ప్రమీల (65) ఆసుపత్రిలో చేరింది. తొర్రగుంటపాలెకు చెందిన బి.రామకృష్ణ (47), విజ్ఞాన్ నగర్‌కు చెందిన శీతల శ్రీనివాస రావు (52), డాంగేనగర్‌కు చెందిన కే.దుర్గా (39), దుర్గాపురానికి చెందిన ఎస్.జగదీష్ (20), సీతా రాంపురానికి చెందిన వై.తిరుపతమ్మ (26), బంగారుపేటకు చెందిన ఎం.ప్రశాంత్ (26), చెరుబజార్‌కు చెందిన తురకా రాములమ్మ (44), వత్సవాయి మండలం మంగోల్లుకు చెందిన డి.వెంకటేశ్వర్లు (56), నూర్ బీ (26), జగ్గయ్యపేట మండలం ధర్మవరప్పాడు తండాకు చెందిన పూరమణి (45) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారినిలో నలుగురిని విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. 18 మంది కోలుకోని డిశ్చార్జ్ అయినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని తెలిపారు.



శాకంబరీ ఉత్సవాల నిర్వహణపై అధికారులు, అర్చకులతో ఈవో సమీక్ష

జూలై 19 నుంచి శాకంబరీ ఉత్సవాలు

- విస్తృత ఏర్పాట్లపై ఈవో సమీక్ష

వన్‌టౌన్, జూన్ 26 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో వచ్చేనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న శాకంబరీ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఈవో రామారావు సంబంధిత అధికారులు, అర్చకులకు సూచించారు. ఉత్సవాల నిర్వహణపై బుధవారం మహామండపంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాకంబరీ ఉత్సవాల నిర్వహణలో గతంలో ఎదురైన ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మరింత మెరుగ్గా ఏర్పాట్లు చేసి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించాలని ఆయన సూచించారు. వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. రైతులు, వ్యాపారులు, ప్రజలు తమకు తోచిన విధంగా కూరగాయలు పండ్లు, ఆకుకూరలు అమ్మవారికి సమర్పించాలన్నారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు భక్తులు సహకరించాలన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో రాష్ట్రం, రైతులు సుభిక్షంగా ఉండాలని సంకల్పిస్తూ శాకంబరీ ఉత్సవాలను అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించనున్నట్టు తెలిపారు. జూలై 6 నుంచి ఆగస్టు 5 వతేదీ వరకు ఆషాఢమాసం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున కనకదుర్గమ్మవారికి పవిత్ర సారె సమర్పించనున్నందున అందుకు దేవస్థానం తగు ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. జులై 14వ తేదీన హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనం సమర్పించనున్నారని తెలిపారు. సమావేశంలో స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి, ఈఈలు కోటేశ్వరరావు, రమాదేవి డీఈఈలు ఏఈఈలు ఏఈవోలు పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ స్పీకర్‌కు కేశినేని చిన్ని శుభాకాంక్షలు



వన్‌టౌన్ : లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కేశినేని చిన్ని స్పీకర్ చాంబర్‌కు వెళ్లి కరచాలనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. లోక్ సభ సంప్రదాయాలను కొనసాగించడంలో విజయం సాధించాలని అభినందించారు.

పీఐసీలను నియమించండి

- నూతన ప్రభుత్వానికి రైతుల వినతి
- సొసైటీల్లో త్రీమెన్ కమిటీల పెత్తనం
- గడువు ముగిసినా వైదొలగని సభ్యులు



కంచికచర్ల : గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)కు తక్షణం పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ)లను నియమించాల్సిందిగా రైతులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు వారాలు గడుస్తున్నప్పటికీ పీఐసీలను నియమించటంలో అధికారులు తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత పలు సొసైటీల్లో త్రీమెన్ కమిటీ సభ్యులు రాజీనామా చేయగా, కొన్ని సొసైటీల్లో కమిటీ సభ్యులు ఇంకా పెత్తనం చెలాయిస్తుండటం పట్ల రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా, త్రిమెన్ కమిటీ పేరుతో ఛైర్మన్, ఇద్దరు సభ్యులుగా నియమించింది. ఆరు నెలలకొకసారి త్రీమెన్ కమిటీలను పొడిగిస్తూ వచ్చారు. త్రీమెన్ కమిటీ సభ్యుల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనున్నది. ఈలోగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పరిస్థితులు తారుమారయ్యాయి. సొసైటీల కార్యదర్శు కార్యదర్శులు త్రీమెన్ కమిటీ సభ్యుల నుంచి రాజీనామా పత్రాలు తీసుకుని సహకారశాఖ అధికారులకు పంపారు. అయితే కొన్ని సొసైటీల్లో త్రీమెన్ కమిటీ సభ్యులు రాజీనామా చేసేందుకు నిరాకరించారు. వీరిని అధికారికంగా తొలగించాల్సి ఉండగా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో సొసైటీల్లో పాలనకు ఇబ్బందులు లేకుండా పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవటంతో సొసైటీలకు తక్షణమే పీఐసీలను నియమించాలని కోరుతున్నారు. సొసైటీలకు సహకారశాఖ అధికారులను, కేడీసీసీ బ్యాంకు ఉద్యోగులను పీఐసీలుగా నియమించేందుకు కసరత్తు జరుగుతున్నదని జిల్లా ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ఈమేరకు ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడుతాయన్నారు.

మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- వీధులు శుభ్రం చేసిన మంత్రి రవీంద్ర, బండి రామకృష్ణ
- అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రాం విగ్రహాలకు నివాళులు

మచిలీపట్నం టౌన్, జూన్ 26 : నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిద్దామని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం మచిలీపట్నం 31వ డివిజన్ ఆదర్శనగర్‌లోని వీధుల్లో రవీంద్ర, జనసేన నేత బండి రామకృష్ణ, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు వీధులు ఊడ్చారు. అనంతరం బాబాసాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభం అవుతున్న దృష్ట్యా జిల్లాలో డ్రెయిన్లు పూడికతీతకు రూ.13 కోట్లు మంజూరు చేసారని, మచిలీపట్నం నియోజక వర్గానికి రూ.2 లక్షలు విడుదల అయ్యాయన్నారు. ఈ సందర్భంగా ఆదర్శనగర్ వాసులు సామాజిక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో మోటమర్రి బాబా ప్రసాద్, ఎండీ ఇలియాస్ బాషా, పిప్పళ్ల కాంతారావు, గోపు సత్యనారాయణ, గొర్రెపాటి గోపీచంద్, ననకా నాగులు, టీడీపీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆగని వైసీపీ ఆగడాలు

- టాక్సీ యూనియన్ నేత బరితెగింపు
- స్టాండ్ ఎన్నికల్లో ఓటు వేయలేదని సీసాలు, రాడ్లతో దాడి

విజయవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకుల ఆగడాలకు హద్దే లేకుండా పోతోంది. టాక్సీ యూనియన్ ఎన్నికల్లో మద్దతు తెలపలేదని వైసీపీ నాయకునిగా ఉన్న డ్రైవర్ సాటి ఇద్దరు డ్రైవర్లపై బుధవారం రాత్రి విచక్షణా రహితంగా దాడి చేశాడు. రామవరప్పాడు రింగ్ పై వంతెన వద్ద టాక్సీ స్టాండు ఉంది. దీనికి వైసీపీ నేత కురేళ్ల రామాంజనేయులు అధ్యక్షునిగా ఉండేవాడు. పార్టీకి అనుకూలంగా లేని వారి కార్లను అక్కడ పెట్టకుండా వేధించేవాడు. బుధవారం జరిగిన ఎన్నికల్లో డ్రైవర్లు సతీష్ అనే వ్యక్తిని అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. డ్రైవర్లు బొల్లు దుర్గప్రసాద్, బాల బాలాజీలు సతీష్‌కు మద్దతు తెలిపారు. ఇది మనసులో పెట్టుకున్న రామాంజనేయులు తన మద్దతుదారులు పోలిశెట్టి వెంకటేశ్వరరావు, మరో ఇద్దరితో కలిసి రాత్రి తనకు సహకరించని ఇద్దరూ ఇంటికి వెళుతుండగా గాజు సీసాలు, రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో దుర్గాప్రసాద్, బాలాజీలకు తీవ్ర గాయాలు కావడంతో స్పృహతప్పి పడిపోయారు. స్థానికులు వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదుపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు..

మచిలీపట్నం : రామోజీరావు సంస్మరణ కార్యక్రమం తాడిగడప 100 అడుగుల రోడ్డులోని అనుమోలు గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం హాజరవుతున్న తరుణంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బుధవారం ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలను మధ్యాహ్నం రెండు గంటల నుంచీ రాత్రి 9 గంటల వరకు కంకిపాడు వద్ద నిలిపివేస్తామన్నారు. విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలను పెనమలూరు నుంచి కృష్ణాకరకట్ట మీదుగా ప్రక్కా బ్రిడ్జి వరకు మళ్లిస్తామన్నారు. విజయవాడ వైపు నుంచి మచిలీపట్నం వెళ్లే వాహనాలను ప్రక్కా బ్రిడ్జి నుంచి విజయవాడ - అవనిగడ్డ కరకట్ట మీదుగా మళ్లించటం జరుగుతుందన్నారు. తాడిగడప 100 అడుగుల రోడ్డును గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి పూర్తిగా మూసివేస్తామన్నారు. దానికి బదులుగా నిడమానూరు-పోరంకి రోడ్డును వినియోగించుకోవాలన్నారు. ఏలూరు హైవే నుంచీ మచిలీపట్నం వైపు వెళ్లే సాధారణ ట్రాఫిక్‌ను ఎనికేపాడు ఎస్ కటింగ్ నుంచి నారాయణపురం కాలనీ మీదుగా పోరంకి వద్ద మచిలీపట్నం హైవే మీదుగా మళ్లించటం జరిగిందన్నారు. ప్రయాణికులు సహకరించాలని ఎస్పీ కోరారు.



సృజనాత్మకంగా.. కలిసి పనిచేద్దాం

ఎన్టీఆర్ జిల్లాను అగ్రపథాన నిలిపేందుకు కలిసి అడుగులు వేద్దాం

- కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.సృజన
- తక్షణం ప్రజారోగ్యంపై దృష్టి
- సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు
- జిల్లా అధికారులతో మర్యాదపూర్వక భేటీ
- కలెక్టర్‌ను కలిసిన ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

'ప్రతిష్ఠాత్మకమైన ఎన్టీఆర్ జిల్లాకు తిరిగి రావడం ఆనందంగా ఉంది. సబ్ కలెక్టర్‌గా పనిచేసిన అనుభవం నాకిక్కడ ఉంది. ఎన్టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లో అగ్ర పథాన నిలిపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా' అని ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం కలెక్టర్‌గా తన ఛాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. సృజనకు దుర్గగుడి వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

2015-16 సంవత్సరంలో విజయవాడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన విషయాన్ని నూతన కలెక్టర్ సృజన గుర్తు చేసుకున్నారు. మళ్లీ ఇక్కడే కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్టీఆర్ జిల్లాను అందరి సహకారంతో నిర్దేశించుకున్న ప్రణాళికలు, లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు అడుగులు వేయటం జరుగుతుందన్నారు. జిల్లా యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ లక్ష్యాలను సాధిస్తామన్నారు. ఎన్టీఆర్ జిల్లాను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు వీటి బారిన పడకుండా ఉండటానికి చర్యలు తీసుకోవటం తక్షణ కర్తవ్యమన్నారు. డయేరియా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా పనిచేస్తామన్నారు. తాగునీటి పరీక్షలు విస్తృతంగా నిర్వహిస్తామని, రక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించే చర్యలను చేపట్టనున్నట్టు చెప్పారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా జేసీ పి.సంపత్ కుమార్, విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో భవానీ శంకర్‌లు నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టరేట్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కొత్త కలెక్టర్ సృజన

● కలెక్టరేట్ సెక్షన్ పరిశీలన..

కలెక్టరేట్ సెక్షన్‌ను నూతన కలెక్టర్ సృజన పరిశీలించారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలన్నింటినీ పరిశీలించారు. అడ్మినిస్ట్రేషన్, ల్యాండ్ కో-ఆర్డినేషన్, మెజిస్టీరియల్, లీగల్ సెల్, ఎన్నికల విభాగం తదితర సెక్షన్ల కార్యకలాపాలను పరిశీలించారు. కలెక్టరేట్‌లోని పలు విభాగాల శాఖాధికారులతో ఆమె మాట్లాడారు. జిల్లాస్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, జిల్లాకు మంచి పేరు తీసుకు వచ్చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

● జిల్లా యంత్రాంగం అభినందనలు

నూతన కలెక్టర్‌ను జిల్లా అధికార యంత్రాంగం కలిసి అభినందించటం జరిగింది. జిల్లా పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఐపీఆర్వో యు.సురేంద్రనాద్, డీపీఆర్వో ఎస్వీ మోహనరావు, అడిషనల్ పీఆర్వో కె.రవి, ఏవీ సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీసీఓ ఎస్.శ్రీనివాసరెడ్డి, యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, ఉద్యానశాఖ అధికారి పి.బాలాజీ, హౌసింగ్ పీడీ రజనీకుమారి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త జె.సుమన్, వీఎంసీ అడిషనల్ కమిషనర్ కేవీ సత్యవతి, కలెక్టరేట్ ఏవో సీహెచ్ నాగలక్ష్మి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

● కలెక్టర్‌ను కలిసిన బొప్పరాజు

నూతన కలెక్టర్ సృజనను ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీజేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో ఎన్టీఆర్



కలెక్టర్‌ను సత్కరిస్తున్న ఏపీ జేఏసీ అమరావతి నేతలు

జిల్లా కీలక భాగస్వామ్యం వహిస్తుందని, ఈ జిల్లా ఉద్యోగులు యంత్రాంగానికి చక్కటి సహకారం అందిస్తారని కలెక్టర్‌కు బొప్పరాజు చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర నాయకులు రామిశెట్టి వెంకట రాజేష్, పి.జాహ్నవి, జిల్లా నాయకులు ఎస్వీ రవీంద్రనాద్, ఎస్.అనుష్‌కుమార్, కలెక్టరేట్ యూనిట్ నాయకులు కె.నాగభూషణం, ఎ.రాజేష్, వీరేష్, విజయవాడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అప్పారావు, యలమంచిలి రవి, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర నాయకులు సంసాని శ్రీనివాస్, వి.అరలయ్య, టి.బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

సమష్టి కృషితో మాదకద్రవ్యాలకు చెక్..

కృష్ణలంక : సమన్వయం, సమష్టి కృషితో మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కృషి చేయాలని, మత్తు పదార్థాల వినియోగం, దుష్ప్రరిణామాలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సృజన సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా యువజన సర్వీసులశాఖ అధ్వర్యంలో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, సంయుక్త ఫౌండేషన్ భాగస్వామ్యంతో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సృజన, జేసీ పి.సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు దూరంగా వుండాలని, బంగారు భవిష్యత్తు దిశగా అడుగులేయాలని తెలిపారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ అధ్వర్యంలో నగరంలోని నలంద కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రరిణామాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాచవరం స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శంకరరావు, నలంద కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

రామోజీ సంస్మరణ సభ ఏర్పాట్లు పూర్తి

- కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

పెనమలూరు, జూన్ 26 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఈనాడు సంస్థల ఛైర్మన్, స్వర్గీయ రామోజీరావు సంస్మరణ సభ ఏర్పాట్లు పూర్తయినట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. వందడుగుల రోడ్డులోని అనుమోలు గ్రౌండ్సులో గురువారం జరగనున్న కార్యక్రమానికి రామోజీరావు కుటుంబసభ్యులు, ప్రముఖ సినీతారలు, రాజకీయ ప్రముఖులు, ప్రముఖ పాత్రికేయులు హాజరై ఆయనకు ఘన నివాళులర్పించనున్నారని కలెక్టర్ తెలిపారు. అనుమోలు ప్రాంగణం సమీపంలో బుధవారం అధికారులతో అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ లైజనింగ్(ఏఎస్ఎల్) సమావేశం నిర్వహించి సభ ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రామోజీరావు సంస్మరణసభకు ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారని తెలిపారు. రామోజీరావు కుటుంబసభ్యులు, సమీప బంధువులు, మంత్రులు, వీవీఐపీలు ఏ-1 గ్యాలరీ వేదిక పైన ఆశీనులవుతారని, వీరికి ప్రక్కనే ఉన్న ఏ-1 పార్కింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులకు ఎం-1గ్యాలరీ, వీరికి శ్రీచైతన్య కళాశాలలో ఎం-1 పార్కింగ్ సదుపాయం కల్పించినట్టు తెలిపారు. వినోదం, ఈనాడు గ్రూపు సంస్థల ప్రతినిధులు, జాతీయ మీడియాకు బీ-1 గ్యాలరీ, వీరికి అదే రోడ్డులోని కృష్ణవేణి కళాశాల ఆవరణలో బీ-1 పార్కింగ్ పేరుతో పార్కింగ్ సదుపాయం కల్పించామని, అధికారుల వాహనాలు, జనరల్ పబ్లిక్‌కు సంబంధించిన బస్సులు, ఇతరులు వాహనాలకు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో పార్కింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. పాసులు లేని వారు తమ వాహనాలను వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో పార్కు చేయాలని కోరారు.



ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లను చర్చిస్తున్న ఉన్నతాధికారులు

సమావేశానికి ముందు సీఆర్డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఇరువురు కలెక్టర్లు, కృష్ణా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనరు స్వప్నిల్ దినకర్, కృష్ణా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, వివిధ శాఖల అధికారులు సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

వేదికను పరిశీలించిన రాష్ట్ర మంత్రులు

బుధవారం సాయంత్రం వందడుగుల రోడ్డులోని సభా ప్రాంగణాన్ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ, పేదల ఆర్థిక పరిస్థితులు వారి అవసరాలకు అనుగుణంగా మెరుగుపరిచిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు.

పంట కాలువల నిర్వహణకు రూ. 2 కోట్లు

- పట్టిసీమ వద్ద నీరు అందుబాటులోకి రాగానే డెల్టాకు నీరు
- పేర్ని నాని అక్రమాలన్నింటిపై విచారణ చేయిస్తాం : రవీంద్ర

మచిలీపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా డెల్టాకు ఖరీఫ్ సీజన్‌లో సాగు, తాగునీరు సక్రమంగా అందించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్టు రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభం నాటికే పంట కాలువలు, డ్రెయిన్‌లలో పూడిక తీయాల్సి ఉన్నా, వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. నిధుల విడుదల, పనులకు అనుమతులు ఇవ్వకుండా జాప్యం చేసిందన్నారు. దీంతో కాలువల్లో పూడికతీత పనులు ఈ వేసవిలో చేయడానికి అవకాశం లేకుండా పోయిందన్నారు. పంట కాలువలు, డ్రెయిన్‌లలో తూడు, గుర్రపుడెక్క, నాచులను తొలగించేందుకు జిల్లాలో రూ.13 కోట్లతో అంచనాలు రూపొందించినా, గత ప్రభుత్వం ఆమోదం తెలపలేదన్నారు. దీంతో కాలువల్లో పూడిక తీయడానికి అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో పంట కాలువలు, డ్రెయిన్‌లలో యుద్ధప్రాతిపదిక పూడిక తీయించేందుకు మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలో రెండు కోట్ల రూపాయలు మంజూరు చేయించినట్టు తెలిపారు. ఈ నిధులతో త్వరితగతిన కాలువల్లో పూడికతీత పనులు చేస్తామన్నారు.


సాగునీటి నిల్వ విషయంలో ముందుచూపేది?

కృష్ణాడెల్టాకు జూన్‌లోనే సాగునీటిని విడుదల చేయాలంటే పులిచింతల ప్రాజెక్టులో 30 టీఎంసీల నీరు అందుబాటులో ఉండాలన్నారు. ముందుచూపులేని వైసీపీ పాలకులు పులిచింతల ప్రాజెక్టులో నీటిని నిల్వ ఉంచకుండా సముద్రంలోకి వృథాగా వదిలేశారన్నారు. దీంతో ప్రస్తుతం పులిచింతల ప్రాజెక్టులో ఒక టీఎంసీ నీరు కూడా అందుబాటులో లేదని అన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నీటిని నిల్వ ఉంచేందుకు అవకాశం లేదని, దీంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు నీటిని విడుదల చేసేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. గోదావరి నదిలో పట్టిసీమ ప్రాజెక్టు వద్ద నీటిని పంపింగ్ చేసేంతగా నీరు అందుబాటులోకి రాలేదని, అక్కడ నీరు అందుబాటులోకి రాగానే నీటిని మోటార్ల ద్వారా పంపింగ్‌చేసి కృష్ణాడెల్టాకు సాగు, తాగునీటి అవసరాలకు నీటిని అందుబాటులోకి తెస్తామన్నారు. సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులోని నీరు మరో 15 రోజులపాటు మాత్రమే వస్తుందని, తాగునీరు అందుబాటులోకి వచ్చేవరకు మచిలీపట్నం ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

చంద్రబాబు సీఎం కావాలని మొక్కుతీర్చుకుని వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో టీడీపీ మహిళా నేత దుర్మరణం
- షిర్డీ సాయిని దర్శించి వస్తుండగా ఘోర ప్రమాదం

ఉంగుటూరు, జూన్ 26 : షిర్డీ సాయినాథుని దర్శనం చేసుకుని తిరిగి వస్తూ రోడ్డుప్రమాదానికి గురై టీడీపీ ఉంగుటూరు మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ(33) మృతిచెందారు. స్థానిక టీడీపీ, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉంగుటూరు మండలం పెదఅవుటపల్లి గ్రామానికి చెందిన రమ్యకృష్ణ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించి, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే షిర్డీ వస్తానని మొక్కుకున్న ఆమె మొక్కును తీర్చుకునేందుకు తోటి నాయకులతో కలిసి నూజివీడుకు చెందిన కారులో ఆదివారం ఉదయం షిర్డీ బయలుదేరి వెళ్లింది. మంగళవారం సాయినాథుని దర్శనం చేసుకుని తిరిగి వచ్చే క్రమంలో షిర్డీ-కొల్హాపూర్ మధ్యలో వీరు ప్రయాణిస్తున్న కారు ఆగివున్న లారీని వెనుకనుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముందుసీట్లో కూర్చున్న రమ్యకృష్ణతో పాటు కారుడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన వారి వివరాలు తెలియాల్సి వుంది. ప్రమాద వార్త తెలుసుకున్న రమ్యకృష్ణ సోదరుడు హైదరాబాద్ నుంచి సంఘటనాస్థలానికి హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. రమ్యకృష్ణ గొప్ప పోరాటపటిమ కలిగిన మహిళానేత, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, క్రియాశీలక రాజకీయాల్లో తనదైన ముద్రతో పార్టీ అగ్రనాయకుల మన్ననలు పొందారు. గన్నవరంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆఫీస్ ధ్వంసం కేసులో వైసీపీ ప్రభుత్వం రమ్యకృష్ణపై అక్రమకేసు పెట్టడంతో తన ఇద్దరు పిల్లల్ని విడిచి రెండునెలలపాటు ఆమె అజ్ఞాతంలో గడిపారు. వైసీపీ ప్రభుత్వం అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా అధైర్యపడకుండా చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితే చాలు ఎన్నికష్టాలైనా భరిస్తాను అని చెప్పేవారు. ఈమెకు భర్త, ఇద్దరు పిల్లలు వున్నారు. భర్తకు ఏడాది క్రితం గుండె ఆపరేషన్ జరిగింది. రమ్యకృష్ణ మరణవార్తను బంధువులు ఆయనకు తెలియనీయలేదు.



లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు.. ఇన్‌సెట్‌లో రమ్యకృష్ణ

గన్నవరం మహిళా నేత మృతి బాధాకరం : చంద్రబాబు

అమరావతి : గన్నవరం నియోజకవర్గ టీడీపీ మహిళా నేత మండవ రమ్యకృష్ణ మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపాన్ని తెలిపారు. ఆమె మృతి బాధాకరమని ఓ ప్రకటనలో తెలిపారు. రమ్యకృష్ణ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.



క్యాపిటల్ ఆసుపత్రిలో కిడ్నీ అమరుస్తున్న వైద్యులు

తానులేకున్నా.. ఇద్దరికి ప్రాణం

- బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవాలు మరో ఇద్దరికి అమర్చిన వైద్యులు

పెనమలూరు, జూన్26 : రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలను అతడి కుటుంబసభ్యుల అంగీకారంతో జీవన్‌దాన్ ప్రక్రియద్వారా మరో ఇద్దరు రోగులకు అమర్చిన సంఘటన పోరంకి క్యాపిటల్ ఆసుపత్రిలో జరిగింది. మంగళవారం పోరంకిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కంకిపాడుకు చెందిన జోగి కరుణప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని క్యాపిటల్ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. కుటుంబసభ్యుల అంగీకారంతో అతడి అవయవాలను సేకరించడానికి జీవన్‌దాన్ సంస్థకు సమాచారం ఇచ్చారు. ఒక కిడ్నీ, కాలేయాన్ని మణిపాల్ ఆసుపత్రికి, మరో కిడ్నీని క్యాపిటల్ ఆసుపత్రిలోనే మరో రోగికి అమర్చారు. క్యాపిటల్ ఆసుపత్రి నుండి మణిపాల్ ఆసుపత్రికి తరలించడానికి గ్రీన్‌కారిడార్‌ను రూపొందించి సహకరించారు. అవయవదానం చాలా మంది ప్రాణాలను కాపాడుతుందని క్యాపిటల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు.

వివాహితపై లైంగిక దాడి.. కేసు నమోదు

పెడన, జూన్ 26 : వివాహితపై లైంగిక దాడికి పాల్పడటమే కాకుండా భర్తకు చెబితే చంపుతానంటూ బెదిరింపులకు దిగిన వ్యక్తిపై పెడన పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో నివాసం ఉంటున్న వివాహిత మంగళవారం ఇంట్లో స్నానం చేస్తున్న సమయంలో గుడిసె పూర్ణచంద్రరావు ఇంట్లోకి ప్రవేశించి లైంగిక దాడికి పాల్పడ్డాడని, ఈ విషయాన్ని భర్తకు చెబితే చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేయగా, సీఐ నాగేంద్రప్రసాద్ విచారణ ప్రారంభించారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి



గంపలగూడెం, జూన్ 26 : సుబాబుల్ కర్ర లోడుతో వస్తున్న లారీ విద్యుదాఘాతానికి గురై డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం కాగజ్‌నగర్ సిర్పూర్‌లో న్యూ కాలనీకి చెందిన అబ్దుల్ బీస్ అహమ్మద్ (63) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎర్రుపాలెం మండలం గుంటుపల్లి గోపవరం నుంచి వచ్చి సుబాబుల్ కర్ర లోడు లారీతో బుధవారం బయలుదేరాడు. పెనుగొలను గ్రామంలో ఆర్సీఎం చర్చి వద్దకు లారీ రాగానే విద్యుత్ స్తంభం వైరుకి లారీ పట్టుకుంది. చెప్పులు లేకుండానే డ్రైవర్ కిందకు దిగి సుబాబుల్ కర్రను ముట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పాయకాపురం, జూన్ 26 : స్థానిక రాధానగర్, ప్రకాష్‌నగర్లలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే జరిగాయి. ఐసీడీఎస్‌ఐ సూపర్‌వైజర్ వి. నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, చిన్నారుల అభివృద్ధిపై తల్లిదండ్రులకు వివరించారు. చిన్నారులకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సర్టిఫికెట్లను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభావతి, శివనాగలక్ష్మీ, హెల్పర్స్ ఫాతిమా, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్థాయీ సంఘం సమావేశం వాయిదా వేయాలి

● కార్పొరేటర్ బోయి సత్యబాబు



చిట్టినగర్, జూన్ 26: స్థాయీ సంఘం ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసి, స్థాయీ సంఘం సమావేశం నిర్వహించేందుకు చూడటం మున్సిపల్ చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధమని, సమావేశం వాయిదా వేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు అన్నారు. సమావేశం వాయిదా వేయాలని బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ మహేష్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో బుధవారం సమావేశం నిర్వహించ డం సరికాదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేకు సంబంధించి రెండు ప్రతిపాదనలు పెట్టడం దారుణమన్నారు. పశ్చిమలో ఓటమి పాలైన ఎమ్మెల్యే రెండు ప్రతిపాదనలు ఏమిటని ప్రశ్నించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అజిత్‌సింగ్‌నగర్, జూన్ 26 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాల ప్రకారం లెనిన్ సెంటర్ ప్రాంతానికి చెందిన చింతగుంట ఆనంద్ ప్రకాష్(40) మంగళవారం రాత్రి అజిత్‌సింగ్‌నగర్ పీ అండ్ టీ కాలనీలోని బంధువుల ఇంటికి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. తిరిగి పాత టీడీపీ కార్యాలయం వద్దకు రాగా ఆర్టీసీ బస్సు ఆనంద్ ప్రకాష్ వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని 108లో ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆనంద్ ప్రకాష్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న అజిత్ సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ రహిత ఏపీ కోసం కృషి చేయాలి

వెస్ట్ డీసీపీ హరికృష్ణ ● అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీలు



వెస్ట్ డివిజన్ పోలీసులు, కేబీఎన్ విద్యార్థుల ర్యాలీ

వన్‌టౌన్, జూన్ 26: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ (ఏపీ) కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయవాడ వెస్ట్ డీసీపీ టీ హరికృష్ణ అన్నారు. వెస్ట్ డివిజన్ పోలీసులు, కేబీఎన్ కళాశాలలు సంయుక్తంగా డ్రగ్స్ రహిత ఏపీని తీర్చి దిద్దాలని ప్రజలను కోరుతూ బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. యువత గంజాయికి అలవాటు పడడం వల్ల వారి విలువైన జీవితం నాశనమవుతోందన్నారు. మత్తు పదార్థాలను సేవించినా, వాటిని కలిగి ఉన్నా కూడా శిక్షార్హులేనన్నారు. కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు ఇటువంటి అవగాహన కార్యక్రమాలతో విద్యార్థుల ద్వారా సమాజాన్ని చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ఎన్‌సీసీ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు, వెస్ట్ జోన్ ఏసీపీ పి. మురళీకృష్ణారెడ్డి, కొత్తపేట సీఐ టి. గణేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి. పవన్ కుమార్, ఎస్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

● పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో బుధవారం మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, దుర్వినియోగ వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా పండిట్ నెహ్రూ బస్టేషన్‌లో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బషీర్ అహ్మద్ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థానాలకు ఎదగాల్సిన యువత మాదక ద్రవ్యాల వినియోగంతో నిర్వీర్యమవుతున్నారని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా అందరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా ఆర్టీసీ పర్సనల్ అధికారి అలివేలు మంగ, స్టేషన్ సూపర్‌వైజర్లు ఉద్యోగులు కార్మికులు, నీ తోడు మానసిక వికాస కేంద్రం విజయవాడ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

లబ్బీపేట: విద్యార్థి దశలోనే యువకులు సమాజంలో బాధ్యతాయుతంగా ఉండాలని మాచవరం ఎస్సై శంకర్‌రావు అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మి పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా డ్రగ్స్ వల్ల మానవశరీరంలో జరిగే మార్పులు- వాటివల్ల సంభవించే అనర్థాలను వివరించారు. స్టెప్ క్రిషి మేనేజర్ డి.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక్కసారి తప్పుదోవ పడితే మళ్లీ వారి జీవితాలను సంస్కరించుకోవడం చాలా కష్టమన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ శాఖాధికారి వై.శ్రీలక్ష్మి, వి.వెంకటేశ్వరరావు, కె.సుధాకర్, పి.వి.రాఘవశర్మ, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

భారతీనగర్: ఆంధ్ర లయోలా కళాశాలలో బుధవారం కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ జి.కిరణ్‌కుమార్, ఎస్‌జె.నౌకాదళ విభాగం కేర్‌టేకర్ డాక్టర్ వై.సుబ్బారెడ్డి, ఆర్అండ్‌వీ రెజిమెంట్ ఎన్‌సీసీ కేర్‌టేకర్ డి.ఎలీషా, జేసీవో సుందర్ సింగ్, ఎయిర్ వింగ్ అధికారి సూరజ్, పీఐ సిబ్బంది, కళాశాల ఎన్‌సీసీ వింగ్స్ కెడెట్లు, రెవ.ఫాదర్. జి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు, ఎన్‌సీసీ సిబ్బందితో కలిసి కళాశాల ప్రాంగణం నుంచి మెయిన్ రోడ్డు మీదగా ర్యాలీ నిర్వహించారు.

మత్తుతో జీవితాలు చిత్తు

అజిత్‌సింగ్‌నగర్: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్‌లు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన జరిగింది. నేతలు పైడి శ్రీను, బత్తుల కొండ పాల్గొన్నారు.

పటమట: పటమట సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మారిస్ స్టెల్లా కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, ఎన్జీవోలు, పటమట పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ ర్యాలీ స్టెల్లా కళాశాల నుంచి బెంజిసర్కిల్ వరకు నిర్వహించారు. సెంట్రల్ ఏసీపీ భాస్కర్, గుణదల సీఐ వసిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోలీసులు భారీ మానవ హారాన్ని నిర్వహించారు.



మాట్లాడుతున్న మాచవరం ఎస్సై శంకర్‌రావు, లయోల విద్యార్థుల ర్యాలీ, మారిస్ స్టెల్లా విద్యార్థుల ర్యాలీ, మాట్లాడుతున్న నవనీతం సాంబశివరావు

కలెక్టర్ సృజనకు పలువురి అభినందనలు

పటమట, జూన్ 26 : జిల్లా కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన సృజనను కలెక్టరేట్‌లో యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగా జోషి, ఫోరం ఫర్ రైట్స్ కో-ఆర్డినేటర్ ఆరవ రమేష్, యునైటెడ్ ముస్లిం మైనార్టీ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ సుభానీ, సగ్గుర్తి వంశీలు ఆమెను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు.



పతకాలు పొందిన విద్యార్థులతో సిద్ధార్థ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య తదితరులు

ఒలింపియాడ్‌లో వీపీ సిద్ధార్థ విద్యార్థులకు పతకాలు

విజయవాడ కల్చరల్, జూన్ 26 : ఇటీవల ఫిబ్రవరిలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ సెకండ్ లెవెల ఒలంపియాడ్ (ఎస్ఓఎఫ్) పరీక్షల్లో తమదైన ప్రతిభను కనబరిచిన వీరమాచినేని పద్దయ్య సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు 9వ తరగతికి చెందిన జి.శ్రీనిధి-అంతర్జాతీయ ఆంగ్ల విభాగంలో (ఎస్ఓఎఫ్) బంగారు పతకం, రూ.5 వేల బహుమతి, ధ్రువపత్రం అందుకొంది. వై.ఇషిత జాతీయ సైన్సు విభాగంలో (ఎస్ఓఎఫ్) జోనల్ బహుమతి రూ.500 బహుమతి, ధృవపత్రం పొందింది. ఈ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ కుప్ప రోజ్ మేరీలు అభినందించారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించండి

● సీపీఐ నేతల డిమాండ్



అజిత్‌సింగ్‌నగర్, జూన్ 26 : అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంచినీటి విభాగం ఏఈ అరుణ్‌కుమార్‌కు ఆయన కార్యాలయంలో సీపీఐ నేతలు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కేవీ భాస్కరరావు మాట్లాడుతూ గత నెల రోజులుగా సింగ్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో మురుగు నీరు సరఫరా అవుతోందని స్థానికులు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్య పరిష్కరించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కలుషిత నీటి వలన ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని లేని పక్షంలో స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. నేతలు లింగాబత్తిన శివకుమార్, కంది ఆదినారాయణ, గురవయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



భారతీనగర్, జూన్ 26: తూర్పు నియోజక వర్గంలో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. మూడవ డివిజన్ నాగార్జుననగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ వాసులతో మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యేగా అఖండ విజయం అందించిన ప్రజల రుణం తీర్చుకుంటానని, ప్రభుత్వపరంగా ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో తూర్పు నియోజకవర్గాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసుకొని, సుందర నగరంగా విజయవాడను తీర్చిదిద్దుకుందామని అన్నారు. కాలనీలో డ్రెయినేజీలు, రోడ్లనిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తానన్నారు. గుత్తికొండ కృష్ణమోహన్, యలమంచిలి రాజేంద్రప్రసాద్(పండు), గద్దె రమేష్, దాడి సుబ్బారావు, వీరమాచినేని పూర్ణచంద్రరావు, గొల్లపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

గ్రీనరీని పెంచండి : కమిషనర్



బెంజిసర్కిల్ వద్ద గ్రీనరీని పరిశీలిస్తున్న నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్

లబ్బీపేట, జూన్ 26: నగరంలో ప్రధానమైన జంక్షన్ బెంజ్‌సర్కిల్‌లో కాలుష్యాన్ని తగ్గించే దిశగా గ్రీనరీని పెంచి, సుందరంగా తీర్చిదిద్దాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన వర్షం వలన రోడ్లు నిండి ప్రజలు ఇబ్బంది పడకుండా సైడ్ డ్రెయిన్లలో సిల్ట్ తీయడంతో పాటు నీరు పారేందుకు అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రీనరీ నిర్వహణ సరిగా లేదని గమనించిన ఆయన ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనిలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్)కె.సత్యవతి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, జోనల్ కమిషనర్-3 శివరామకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(పార్క్స్) ఏఎస్ఎన్ ప్రసాద్, ఈఈ-3 సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ రాయుళ్ల ఆట కట్టించాలి

● డీజీపీ ద్వారకా తిరుమలరావుకు జనసేన నాయకుల వినతి



ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న జనసేన నాయకులు

వన్‌టౌన్, జూన్ 26 : గంజాయి డ్రగ్స్, బెట్టింగ్ రాయుళ్ల ఆటకట్టించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన సెంట్రల్ ఆంధ్రా జోన్ కన్వీనర్ బాడిత శంకర్ బుధవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే గంజాయి, డ్రగ్స్ బెట్టింగులు, స్పా ముసుగులో వ్యభిచారాలు, గుట్కాల విక్రయాలు, అక్రమ మద్యం యదేచ్ఛగా సాగాయని, వీటి మూలాలన్నీ విజయవాడలోనే ఉన్నాయని, వాటివలన యువత చెడుదారి పడుతోందని వివరించారు. అటువంటి వారిపై ఉక్కుపాదం మోపాలని కోరారు. జనసేన లీగల్ సెల్ గంజి పవన్ పాల్గొన్నారు.

భవానీపురం సీఐగా ఉమామహేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

విద్యాధరపురం, జూన్ 26: భవానీపురం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా ఉమామహేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన సీసీఎస్‌లో సీఐగా పనిచేశారు. ఇటీవల ఆయనను భవానీపురం సీఐగా నియమించారు. ఈయనకు స్టేషన్ పోలీసు సిబ్బంది సాదర స్వాగతం పలికారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

● పోలేరమ్మగుడి వద్ద రోడ్డు అధ్వానం

● నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు

భవానీపురం, జూన్ 26 : 43వ డివిజన్ భవానీపురం, ఊర్మిళానగర్- గొల్లపూడి పంచాయతీ పరిధిలో ఉన్న పోలేరమ్మగుడి సమీపంలో రోడ్డు ఛిద్రమై ప్రమాదాలు జరుగుతున్నా వీఎంసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మూడు నెలలు క్రితం నుంచి రోడ్డు బ్లాకులుగా కుంగిపోవడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్, అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు నుంచి నిత్యం భారీ వాహనాలు ఇటువైపుగా రాకపోకలు సాగిస్తూ చనుమోలు ఫ్లై ఓవర్ మీదుగా వివిధ ప్రాంతాలకు వెళుతుంటాయి. దీంతో పరిమితి మించి లోడు లారీల వలన రోడ్డు మూడొంతుల భాగం బ్లాకులుగా విడిపోయి ఛిద్రమై రాత్రి వేళల్లో వాహనదారులు నానాతంటాలు పడుతున్నారు. ఇక్కడే పైప్‌లైన్ దెబ్బతిని నీరంతా ఉదయం, సాయంత్రం వేళల్లో బ్లాకుల్లోకి చేరడంతో రోడ్డు కూడా పూర్తిగా నీళ్లలోనే నానుతోంది. గోతుల్లోని నీరు రాకపోకలు సాగించే వారిపై పడుతోంది. రోజూ నీటి వృథా జరుగుతున్నా అటు మంచినీటి సరఫరా విభాగం అధికారులు, ఇటు రోడ్డు బాగు చేయాలన్న శ్రద్ధ ఇంజనీరింగ్ అధికారులకు లేకపోవడంతో రోడ్డు నామరూపాల్లేకుండా పోతోంది. ఇప్పటికైనా వీఎంసీ కమిషనర్ శాఖలను సమన్వయం చేసి పరిసరాలను యుద్ధప్రాతిపదికన బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న ఊర్మిళానగర్ రోడ్డు



పైప్‌లైన్ లీకేజీతో రోడ్డుపై నిలిచిన నీరు

చాలా కాలంగా రోడ్డుతో ఇబ్బంది పడుతున్నాం



పోలేరమ్మగుడి సమీపంలో రోడ్డంతా గోతులమయం కావడం వలన ఇటువైపుగా మూడు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై వెళ్లిన ఇద్దరు యువకులు పడిపోయి గాయపడ్డారు. చిన్నపాటి గొయ్యి పడినప్పటి నుంచి అధికారులకు చెబుతున్న పట్టించుకోవడం లేదు. లోడు లారీలు బోల్తా కొట్టే పరిస్థితులు ఇక్కడ గోచరిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

మాగం ఆత్మారామ్, స్థానికుడు

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
గురువారం • 27 జూన్ 2024
cinema@andhrajyothy.com

మారేడుమిల్లిలో మొదలైంది



నిఖిల్ యోధుడి పాత్రను పోషిస్తున్న 'స్వయంభూ' చిత్రం తాజా షెడ్యూల్ మారేడుమిల్లిలో మొదలైంది. అక్కడున్న దట్టమైన అడవుల్లో నిఖిల్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు దర్శకుడు భరత్ కృష్ణమాచార్య. ఇది నిఖిల్‌కు 20వ సినిమా. ఆయన కెరీర్‌లో ఓ మైల్‌స్టోన్‌లా నిలిచే విధంగా సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇందులో నిఖిల్ వారియర్‌గా నటిస్తుండడంతో ఇందుకోసం ప్రత్యేకమైన శిక్షణ తీసుకున్నారు. ఈ పీరియాడిక్ ఫిల్మ్‌లో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సెంథిల్ కుమార్, సంగీతం: రవి బస్రూర్, సహ నిర్మాతలు విజయ్ కామిశెట్టి, జీటీ ఆనంద్, నిర్మాతలు: భువన్, శ్రీకర్, సమర్పణ: ఠాగూర్ మధు.

35 రోజులు.. రూ 15 కోట్లు!



వరుణ్‌తేజ్ తాజాగా నటిస్తున్న చిత్రం 'మట్కా'. ప్రస్తుతం మూడో షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది. 35 రోజుల పాటు ఏకధాటిగా జరిగే ఈ షెడ్యూల్ కోసం రూ. 15 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. వైజాగ్ నేపథ్యంలో జరిగే కథ కనుక రామోజీ ఫిల్మ్ సిటీలో వింటేజ్ వైజాగ్ సెట్ వేశారు. ప్రేక్షకులకు అథెంటిసిటీ, గ్రాండియర్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించే లక్ష్యంతో టీమ్ వర్క్ చేస్తోంది. వరుణ్‌తేజ్ కెరీర్‌లో మరో మరుపురాని పాత్రలో నిలిచిపోయేందుకు దర్శకుడు కరుణకుమార్ కృషి చేస్తున్నారు. దేశాన్ని కదిలించిన యథార్థ సంఘటనల ఆధారంగా దర్శకుడు ఈ చిత్రం స్క్రిప్ట్ రూపొందించారు. ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతి కలిగించే విధంగా తయారవుతున్న ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. బాలీవుడ్ నటి నోరా ఫతేహి కీలక పాత్ర పోషిస్తోంది. డాక్టర్ విజయేందర్ రెడ్డి, రజనీ తాళ్లూరి ఈ చిత్రానికి నిర్మాతలు.

కమల్ చిత్రంలో రోహిత్



విశిష్ట నటుడు కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం చాలా కాలం తర్వాత మళ్లీ కలసి పనిచేస్తున్న 'థగ్ లైఫ్' చిత్రంలో బాలీవుడ్ నటుడు రోహిత్ సరాఫ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. అటు కమల్‌ను, ఇటు మణిరత్నంను అభిమానించే రోహిత్‌ను వెదుక్కుంటూ ఈ అవకాశం రావడంతో మరో మాట మాట్లాడకుండా ఒప్పేసుకున్నారు. ప్రస్తుతం అతనిపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. 'ఈ సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ఆగస్టుకు సినిమాను పూర్తి చేయాలనే సంకల్పంతో మణిరత్నం పని చేస్తున్నారు. డిసెంబర్‌లో సినిమా విడుదలవుతుంది' అని యూనిట్ వర్గాలు చెప్పాయి. కమల్‌హాసన్, శింబు, త్రిష, నాజర్, జోజు జార్జ్, రోహిత్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

39 ఏళ్ల తర్వాత ఒకే ఫ్రేమ్‌లో



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పటి నుంచే ఎన్నో ఆసక్తికర అంశాలతో భారతీయ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. దశాబ్దాల తర్వాత బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ కలయికకు ఈ చిత్రం వేదిక అవ్వడం ఓ విశేషం. 1985లో వచ్చిన 'గిరఫ్తార్' చిత్రంలో అమితాబ్, కమల్ అన్నదమ్ములుగా నటించారు. మళ్లీ ఇన్నాళ్లకు 'కల్కి' చిత్రంతో వీరి కాంబినేషన్ సెట్టయింది. ఇందులో కమల్‌హాసన్ సుప్రీం యాస్కిన్ పాత్రను పోషించగా, అమితాబ్ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. వీరి కలయికతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. వీరిద్దరినీ ఒకే ఫ్రేమ్‌లో చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మించారు.

టెడ్డీ బేర్ యాక్షన్ ఎంటర్‌టైనర్



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బడ్డీ'. గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోన్ దర్శకత్వంలో జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం జులై 26న విడుదల కానుంది. మంగళవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మాత జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ 'గీతా ఆర్ట్స్, స్టూడియో గ్రీన్ సంస్థలు 'ప్రేమ కథాచిత్రమ్'ను తమిళంలోకి రీమేక్ చేశాం. జీవీ ప్రకాశ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి శామ్ ఆంటోన్ దర్శకత్వం వహించారు. ఇప్పుడు ఆయన దర్శకత్వంలోనే 'బడ్డీ' తీస్తున్నాం. నేను కథ కంటే శామ్‌నే ఎక్కువగా నమ్మాను. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ ఇచ్చిన సంగీతం చిత్రానికి ప్రాణం. అల్లు శిరీష్ మా కుటుంబ సభ్యుడు. 'బడ్డీ'లో ఆయన నటన అందరినీ ఆకట్టుకుంటుంది. జులై 26న సినిమాను విడుదల చేస్తున్నాం' అని చెప్పారు. 'మధుర' శ్రీధర్ మాట్లాడుతూ 'నా స్నేహితుడు జ్ఞానవేల్ రాజా ఎన్నో తమిళ చిత్రాలు తెలుగులోకి తీసుకువచ్చి విజయం సాధించారు. 'బడ్డీ'తో ఆయన తెలుగులో స్ట్రయిట్ చిత్రం చేయడం ఆనందంగా ఉంది. టీమ్‌కు ఆల్ ది బెస్ట్' అన్నారు. 'నేను రాజమౌళిగారి అభిమానిని. ఆయన తీసిన 'ఈగ' చిత్రం ఈ 'బడ్డీ'కి ప్రేరణ. సీజీ వర్క్ చేస్తున్నప్పుడు 'ఈగ' మూవీతో పోల్చి సజెషన్స్ ఇచ్చేవాడిని. నా మీద నమ్మకంతో సినిమా ఇచ్చిన నిర్మాత జ్ఞాన్‌వేల్ రాజాకు కృతజ్ఞతలు' అన్నారు దర్శకుడు శామ్.

హీరో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'టెడ్డీ బేర్‌తో అడ్వెంచర్ యాక్షన్ సినిమాను ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారా అని మొదట కొంత డౌట్ ఉండేది. కానీ ట్రైలర్ చూశాక నాకు కాన్ఫిడెన్స్ వచ్చింది. ఇది కొత్త తరహా సినిమా ఇందులో హీరో నేను కాదు.. టెడ్డీ బేర్. ఆ క్యారెక్టర్‌కు ఇంప్రెస్ అయి ఈ సినిమా ఒప్పుకొన్నా. మా నాన్న కూడా నా మీద ఇంత ఖర్చు పెట్టి సినిమా తీయలేదు. భారీ ఖర్చుతో నాతో యాక్షన్ అడ్వెంచర్ తీసిన జ్ఞానవేల్ రాజాగారికి కృతజ్ఞతలు' అని చెప్పారు.

చక్కనమ్మకు నవ్వు తెచ్చిన చిక్కు



అందం, అభినయంతో పాటు చక్కని చిరునవ్వుతో ప్రేక్షకులకు కనువిందు చేసి అగ్రకథానాయిక కొనసాగుతున్నారు అనుష్కశెట్టి. అయితే ఆ అందమైన చిరునవ్వే తనకు కొన్ని సమస్యలు తెచ్చిపెట్టిందంటున్నారు అనుష్క. ఆమె ఓ అరుదైన సమస్యతో బాధపడుతున్నారు. అనుష్క నవ్వడం మొదలుపెడితే, 15 నుంచి 20 నిమిషాల పాటు ఏకబిగిన నవ్వుతూనే ఉంటారట. కొన్నాళ్ల క్రితం ఓ ఇంటర్వ్యూలో అనుష్క ఈ విషయాన్ని చెప్పారు. దీనివల్ల పలు సందర్భాల్లో సినిమా షూటింగ్స్‌కు బ్రేక్ పడిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. సెట్‌లో, నలుగురిలోకి వెళ్లినప్పుడు ఇలా నవ్వడం వల్ల తీవ్ర అసౌకర్యానికి గురయినట్లు ఆమె చెప్పారు. ఇలా అకస్మాత్తుగా వచ్చే నవ్వును అదుపుచేసుకోలేని పరిస్థితిని వైద్య పరిభాషలో పీబీఏ (సూడోబల్బార్ ఎఫెక్ట్) అంటారు.

అభిమానితో నాగ్ సెల్ఫీ



ఇటీవలే ముంబై ఎయిర్‌పోర్ట్‌లో ఓ అభిమాని నాగార్జునను కలిసేందుకు ప్రయత్నించగా, సెక్యూరిటీ సిబ్బంది అతన్ని పక్కకు నెట్టేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. విమర్శలు రావడంతో ఆ సంఘటనపై నాగార్జున విచారం వ్యక్తం చేశారు. ఆ అభిమానికి ఎక్స్ వేదికగా క్షమాపణలు చెప్పారు. బుధవారం నాగార్జున ఎయిర్‌పోర్ట్‌లో ఆ అభిమానిని కలిశారు. సెక్యూరిటీ సిబ్బంది పక్కకు నెట్టివేసిన సంఘటన ఆ రోజు తనకు తెలియదని అతనితో చెప్పారు. ఆ అభిమానిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. అతనితో కొంత సమయం గడిపి, ఫొటోలు దిగారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జరిగిన సంఘటన పట్ల మీ ప్రవర్తన హుందాగా ఉంది, 'మీరు రియల్ హీరో సార్' అంటూ నెటిజన్లు నాగార్జునను అభినందిస్తున్నారు.



ఇస్మార్ట్ సాంగ్

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రానికి ఇది సీక్వెల్. సంజయ్‌దత్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతోంది. టైటిల్ సాంగ్‌ను ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా రామ్ పోతినేని స్పెషల్ పోస్టర్‌ను బుధవారం మేకర్స్ విడుదల చేశారు. ఈ గీతాన్ని మణిశర్మ స్వర పరచగా, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. రామ్‌కు జోడీగా కావ్య థాపర్ నటిస్తున్నారు. పూరి జగన్నాథ్, ఛార్మీకౌర్ నిర్మిస్తున్నారు.



అరుదైన గౌరవం



'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రంతో ఆస్కార్ వేదికపై తెలుగు సినిమా సత్తా చాటారు దర్శక ధీరుడు రాజమౌళి. అంతే కాదు ఆ సినిమాతో ప్రపంచమంతా తన ప్రతిభకు తగిన గుర్తింపు పొందడంతో పాటు 'నాటు నాటు' పాటకు ఆస్కార్ సాధించారు. తాజాగా ఆస్కార్ అకాడెమీలో చేరేందుకు ఆహ్వానం అందుకొని అరుదైన గౌరవం పొందారు. 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి కాస్ట్యూమ్స్ డిజైనర్‌గా పని చేసిన రమా రాజమౌళి కూడా ఈ గౌరవంలో భాగమయ్యారు. ఈ ఏడాది 57 దేశాల నుంచి మొత్తం 487 మంది కొత్త సభ్యులకు ఆస్కార్ అకాడెమీ ఆహ్వానం పంపింది. వీరిలో రాజమౌళి, రమతో పాటు భారతీయ చిత్ర పరిశ్రమ నుంచి షబానా అజ్మీ, రితేశ్ సిద్వానీ, రవి వర్మన్, రీమా దాస్, ఆనంద్‌కుమార్ టక్కర్ , నిషా పహుజా, హేమల్ త్రివేది, గితేష్ పాండ్యా ఉన్నారు. ఒరిజినల్ సాంగ్ విభాగంలో 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ అవార్డ్ సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం టీమ్‌లో జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, కీరవాణి, చంద్రబోస్, సెంథిల్‌కుమార్, సాబు శిరిల్‌కు ఆస్కార్ అకాడెమీ కొత్త సభ్యులుగా గత ఏడాది ఆహ్వానం అందింది.


ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది

• ట్రోలర్స్‌పై మండిపడ్డ రేణూదేశాయ్



తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని మీమ్స్‌తో ట్రోల్ చేస్తున్నవారిపై నటుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాజీ భార్య, నటి రేణూదేశాయ్ మండిపడ్డారు. ఏపీ ఎన్నికల్లో ఘన విజయం తర్వాత జనసేనాని పవన్ కల్యాణ్ తన శ్రీమతి అన్నా లెజినేవా, తనయుడు అకీరానందన్, కూతురు ఆద్యలతో దిగిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఫొటోను వాడుకొని కొందరు రేణూదేశాయ్ వ్యక్తిత్వాన్ని తక్కువ చేస్తూ రకరకాల మీమ్స్ రూపొందించారు. పవన్ కల్యాణ్‌తో విడాకులు తీసుకొని పొరపాటు చేశారనీ, అదృష్టాన్ని కాలదన్నుకున్నారనీ రకరకాల వ్యాఖ్యలతో మీమ్స్ పెడుతున్నారు. అవి తమను ఎంతగానో బాధపెడుతున్నాయని రేణూదేశాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. 'మనుషులు ఇంత దారుణంగా దిగజారడం సిగ్గు చేటు. నాపై వస్తున్న విమర్శలు, నన్నుఎగతాళి చేస్తున్న తీరు చూసి నా కూతురు ఆద్య కన్నీరు పెట్టుకుంది. మీమ్స్ చేసేవాళ్లంతా గుర్తుంచుకోండి, మీకూ ఓ కుటుంబం ఉంటుంది, తల్లులూ, అక్కచెల్లెళ్లు ఉన్నారు. మాపైన జోక్స్ చేస్తున్నవాళ్లకు ఈ తల్లి శాపం తగిలి తీరుతుంది. నా బిడ్డ కార్చిన కన్నీరు, ఊరకే పోదు. ఈ తల్లి శాపం తగిలితీరుతుంది. దీన్ని పోస్ట్ చేసేముందు వంద సార్లు ఆలోచించాల్సి వచ్చింది. కానీ తప్పలేదు' అని రేణూదేశాయ్ తన ఇన్‌స్టా పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఆరేళ్ల బంధం ముగిసింది



మొత్తానికి పెళ్లి వరకూ వెళ్లకుండానే అర్జున్‌కపూర్, మలైకా అరోరా విడిపోయారు. ఆరేళ్ల క్రితం ఓ ఫ్యాషన్ షోలో తొలిసారిగా కలసిన వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. మలైకా 45వ పుట్టిన రోజున కానీ ఈ విషయం బయటపడలేదు. ఇక అప్పటినుంచీ ఎక్కడకు వెళ్లినా ఇద్దరూ కలసే వెళ్లేవారు. ఫ్యామిలీ ఫంక్షన్స్‌లో కూడా అర్జున్ పక్కన మలైకా ఉండాల్సిందే. 'కాఫీ విత్ కరణ్' ప్రోగ్రామ్‌లో తమ అనుబంధం గురించి అర్జున్ వెల్లడించడంతో త్వరలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకుంటారని అందరూ అనుకున్నారు. ఆరేళ్ల పాటు ఎంతో అన్యోన్యంగా కలసి తిరిగిన వీరిద్దరూ మొన్న మే 31న విడిపోయిన విషయం చాలామందికి తెలీదు. తమ బ్రేకప్ విషయం ఇద్దరూ సీక్రెట్‌గా ఉంచారు. ఏ విషయంలో వీరిద్దరికీ చెడిందో ఏమో కానీ ఇప్పుడు అర్జున్ కెరీర్ మీద దృష్టి పెట్టాడు. బుధవారం అతని పుట్టినరోజు కావడంతో తామిద్దరూ కలసి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది మలైకా.



"మేము ఏ దేశానికీ ప్రతినిధులం కాదు. మాకు జాతులు, మతాలు లేవు. మాదంతా ఒకే కుటుంబం. అది క్రీడా కుటుంబం" అంటారు మసోమా అలీ జాదా. శరణార్థిగా ఎన్ని దేశాలు తిరిగినా... క్రీడాకారిణిగా పేరు తెచ్చుకోవాలనే ఆశయాన్ని ఆమె ఎన్నడూ విడువపోలేదు. తాలిబన్ల వేధింపులు భరించలేక... ఫ్రాన్స్ ఆశ్రయం కోరిన కుటుంబం ఆమెది. అక్కడ క్రీడల్లో తన ప్రతిభ చూపి, టోక్యో ఒలింపిక్స్‌లో శరణార్థుల తరపున పోటీపడ్డారు. రాబోయే పారిస్ ఒలింపిక్స్‌లో తలపడుతున్న శరణార్థుల ఒలింపిక్స్ బృందానికి 'ఛెఫ్ డి మిషన్'గా నాయకత్వం వహిస్తున్నారు.

శరణార్థుల టార్చ్‌బేరర్

"నేను అఫ్ఘనిస్తాన్‌లో... యుద్ధసమయంలో పుట్టాను. మా దేశంలో పరిస్థితులు విషమించడంతో... నాకు ఊహ తెలియని వయసులోనే ఇరాన్‌కు వెళ్లి తలదాచుకోవాల్సి వచ్చింది. కొన్నేళ్ళకు అఫ్ఘనిస్తాన్‌కు తిరిగి వచ్చేశాం. మళ్ళీ చదువు కొనసాగించాను. తొమ్మిదేళ్ళ వయసులో నాకు సైక్లింగ్‌పై ఆసక్తి కలిగింది. కానీ వీధుల్లోకి సైకిల్ తీసుకొని వస్తే... వేధింపులు ఎదురయ్యేవి. అయినా... సైక్లింగ్‌లో అంతర్జాతీయంగా పేరు తెచ్చుకోవాలనే నా కలను చంపుకోలేకపోయాను. నన్ను జనం ఎగతాళి చేసేవారు, రాళ్ళతో కొట్టేవారు. గాయాలతో ఆసుపత్రిపాలయ్యాను. అన్నిటినీ భరించాను. అఫ్ఘన్ ఉమెన్స్ నేషనల్ సైక్లింగ్ టీమ్‌లో సభ్యురాలిగా పలు పోటీల్లో పాల్గొన్నాను. నా లక్ష్యానికి చేరువవుతున్న సమయం(2016)లో... తాలిబన్ల నుంచి బెదిరింపులు ఎక్కువయ్యాయి. నా కుటుంబాన్ని చంపేస్తామంటూ హెచ్చరికలు చేశారు. దాడులు చేశారు. ఇక భరించలేక.. నా తల్లితండ్రులు, ముగ్గురు సోదరులు, ఒక సోదరి ఫ్రాన్స్‌ను ఆశ్రయం కోరాం. కొన్నాళ్ళకు హ్యూమానిటేరియన్ వీసాను ఆ దేశం మంజూరు చేసింది. అక్కడ అడుగు పెట్టిన తరువాత... నా దేశం, నా జాతి కారణంగా ఎన్నో వివక్షలను ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఆ నిరీక్షణ సుదీర్ఘమైన హింస...

శరణార్థుల్లో ప్రతి ఒక్కరికీ సమస్యలు ఉంటాయి. వాళ్ళకి ఆశ్రయం ఇచ్చిన దేశం మీద ఆధారపడి.. ఈ సమస్యలు ఒక వ్యక్తికీ, మరో వ్యక్తికీ మధ్య భిన్నంగా ఉంటాయి. సాధారణంగా పేపర్ వర్క్ ఎక్కువగా ఉండడం వల్ల ఎక్కువ ఇబ్బందులు, సవాళ్ళు ఎదురవుతాయి. మేము కొత్త దేశానికి వచ్చాక.. అక్కడి అధికారులు జారీ చేసే పత్రాల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. దానికి చాలా కాలం పడుతుంది. అవి వచ్చేదాకా.. మేము ఏదీ చేయడానికి వీలుండదు. అక్కడి భాష నేర్చుకోలేం. విద్య మాకు అందుబాటులో ఉండదు.. ఆ నిరీక్షణ సుదీర్ఘమైన హింసలా ఉంటుంది.

పత్రాలు వచ్చాక కూడా...
చదువుకోవాలనుకొనేవారు శరణార్థులను అనుమతించే యూనివర్సిటీలో చోటు సంపాదించడం, బతుకుతెరువుకోసం ఉపాధి వెతుక్కోవడం చాలా కష్టం. అదే సమయంలో... స్వదేశంలో ఉన్న కుటుంబాల గురించి ఆలోచనలు వెన్నాడుతూ ఉంటాయి. కొత్త దేశంలో మాకు సాయం చేసేవారెవరూ ఉండరు. ఆ దశలో స్థైర్యంగా కొనసాగడానికి శరణార్థులకు ఉండే ఏకైక అవకాశం... క్రీడలు. చాలామంది శరణార్థులు ఏదో సమయం గడపడానికీ, ఆరోగ్యానికీ, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడానికీ క్రీడలను ఆశ్రయిస్తారు. నాకు అంతకుముందే క్రీడలపై ఉన్న ఆసక్తి...



నాలాంటి వారిని మరింత దగ్గర చేసింది. శరణార్థులకు సహాయం చేసే ఒక ఫ్రెంచ్ కమ్యూనిటీ మాకు పరిచయం కావడం, పత్రాలు చేతికి అందడంతో... కష్టాలు కొంతవరకూ తీరాయి. నా క్రీడా నేపథ్యం వల్ల 'ఇంటర్నేషనల్ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నుంచి 'రెఫ్యూజీ అథ్లెట్ స్కాలర్‌షిప్' దొరికింది. కఠోర సాధన చేశాను. 2020లో టోక్యోలో జరిగిన ఒలింపిక్స్‌లో.. ఐఓసీ రెఫ్యూజీ ఒలింపిక్ జట్టు తరఫున.. సైక్లింగ్ ఈవెంట్‌లో పోటీ పడ్డాను. 2022లో ఐఓసీ అథ్లెట్స్ కమిషన్ సభ్యురాలినయ్యాను. ఆ పదవిని అందుకున్న మొదటి రెఫ్యూజీని నేనే. ఈ ఏడాది ప్యారిస్ ఒలింపిక్స్‌లో... పోటీ పడుతున్న శరణార్థుల ఒలింపిక్ బృందానికి 'ఛెఫ్ డి మిషన్'గా నన్ను నియమించారు. ఇది నేను ఏమాత్రం ఊహించని విషయం. గొప్ప గౌరవం. మాకు ప్రతిభ, సామర్థ్యం ఉన్నాయని లోకానికి చాటిచెప్పే అవకాశం మాకు దొరికింది. తద్వారా ప్రపంచం మమ్మల్ని చూసే దృక్పథాన్ని మార్చగలమని భావిస్తున్నాను. నేను ప్రాతినిధ్యం వహిస్తున్నది... మా టీమ్‌లోని అథ్లెట్లకు మాత్రమే కాదు... ప్రపంచవ్యాప్తంగా దాదాపు నిర్వాసితులైన



పన్నెండు కోట్ల మందికి పైగా శరణార్థులకు. మా విజయాలతో వారిలో స్ఫూర్తి నింపడం, గతం చేసిన గాయాల నుంచి ఊరటనివ్వడం మా లక్ష్యం.

వివక్ష, హింస పోవాలి...

నిర్వాసితులైన కోట్లాది కాందిశీకుల సంక్షోభిత జీవితాలపై ఆందోళన చెందిన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2015లో... 'రెఫ్యూజీ ఒలింపిక్ టీమ్'ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. 2016 రియో ఒలింపిక్స్‌లో పదిమంది అథ్లెట్లు ఈ టీమ్ తరఫున పాల్గొన్నారు. 2020లో టోక్యో ఒలింపిక్స్‌లో... నాతో సహా ఇరవై తొమ్మిది మంది పాల్గొన్నారు. తాజాగా ప్యారిస్‌లో పోటీ పడబోయే మా బృందంలో 36 మంది క్రీడాకారులున్నారు. వీరు దేశాలు... అఫ్ఘనిస్తాన్, కామెరూన్, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఎరిత్రియా, ఇరాన్, ఇరాక్, దక్షిణ సూడాన్, సూడాన్, సిరియా, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, వెనిజులాలకు చెందినవారు. పన్నెండు క్రీడలలో... అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, కానోయింగ్, సైక్లింగ్, జూడో, కరాటే, తైక్వాండో, షూటింగ్, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్‌లలో పోటీ పడుతున్నారు. వీరు పదిహేను దేశాల్లో ఆశ్రయం పొందుతున్న కాందిశీకులు. వాళ్ళందరూ వివిధ మతాలకు, జాతులకు చెందినవారు. ఏ దేశానికీ ప్రాతినిధ్యం వహించడం లేదు. ఎందుకంటే నాలాంటి వాళ్ళకు ఇప్పుడు స్వదేశమనేది లేనే లేదు. అందరూ హింసకు గురైనవాళ్ళు. ప్రాణాలను అరచేత పెట్టుకొని... వేరే చోటికి వచ్చి తలదాచుకుంటున్నవారు. పుట్టిన చోటు నుంచి వేరుపడి, తమ గుర్తింపును, బంధాలను వదిలేసుకొని... పరాయి సీమల్లో బతుకులు ఈడుస్తున్నవాళ్ళు అయినప్పటికీ... వారందరికీ ఒక కల ఉంది...ఒలింపిక్స్‌లో పోటీ చేయడం. అది ఇప్పుడు నెరవేరుతోంది. ప్రస్తుతం దాదాపు డెబ్బై మంది అథ్లెట్లు... 'రెఫ్యూజీ అథ్లెట్ స్కాలర్‌షిప్' ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. భవిష్యత్తులో మరెందరో మంచి శిక్షణ పొంది, పోటీల్లో రాణిస్తారనడంలో సందేహం లేదు. మేమందరం ఎన్నో సవాళ్ళు ఎదుర్కొన్నాం. ఇప్పుడు కొత్త తరంలో ప్రేరణ కలిగించే అవకాశం వచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకుంటామనే నమ్మకం ఉంది. నా వ్యక్తిగత విషయాలకు వస్తే... నా వయసు ఇరవయ్యేనిమిదేళ్ళు. ఇంజనీరింగ్ చదువుతున్నాను. మళ్ళీ మా దేశానికి వెళ్ళాలని మా కుటుంబం కోరిక. కానీ మహిళలకు ఇప్పటికీ అది అనుకూలం కాదు. మా దేశంలో మార్పు రావాలనీ, వివక్ష, హింస పోయి అందరికీ సమాన అవకాశాలు రావాలనీ కోరుకుంటున్నాను."



కౌన్సెలింగ్

పిల్లల దంతారోగ్యం

డాక్టర్! మా అబ్బాయి వయసు ఆరేళ్లు. పిల్లల దంతాలు ఆరోగ్యంగా ఉండడం కోసం ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి? ఎత్తు పళ్లు రాకుండా ఉండాలంటే ఏం చేయాలి?

- ఓ సోదరి, హైదరాబాద్.

- పిల్లలు నోట్లో వేలు పెట్టుకునే అలవాటు వల్ల దంతాలు, దవడల నిర్మాణంలో పొరపాట్లు చోటుచేసుకుంటాయి. కాబట్టి ఆ అలవాటును మాన్పించాలి.
- కొంతమంది పిల్లలకు నాలుకతో దంతాలను నెట్టే అలవాటు ఉంటుంది. ఈ అలవాటును కూడా మాన్పించాలి.
- పాల దంతాలు సమయానికి ఊడకపోవడం వల్ల, ఆ ప్రదేశంలో వచ్చే శాశ్వత దంతాలు వంకరగా పెరుగుతాయి. ఇలా జరగకుండా ఉండాలంటే పాల దంతాలు సరైన సమయంలో ఊడిపోయేలా చూసుకోవాలి. ఇందుకోసం పిల్లలను దంత వైద్యుల చేత పరీక్ష చేయిస్తూ ఉండాలి.
- వంకర పళ్లను సరిచేయించుకోకపోతే, భవిష్యత్తులో వాటిలో ప్లేక్ పేరుకుని పుచ్చిపోవడం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి.

ఓరల్ హెల్త్ ఇలా క్షేమం

- పిల్లలకు చిన్నప్పటి నుంచే పండ్లు, కూరగాయలు తినడం అలవాటు చేయాలి. యాపిల్ లాంటి పండ్లతో దంతాలు, చిగుళ్లు శుభ్రపడతాయి.
- క్యాల్షియం సప్లిమెంట్లతో దంతాలు దృఢంగా ఉంటాయి.
- తీపి పదార్థాలను తగ్గించాలి. తిన్న వెంటనే దంతాలు శుభ్రం చేసుకోవాలి.
- శీతల పానీయాలకు దూరంగా ఉండాలి.
- రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలి.
- మెత్తని బ్రిసిల్స్ బ్రష్‌నే దంత ధావనానికి ఉపయోగించాలి.
- ప్రతి మూడు నెలలకోసారి టూత్‌బ్రష్‌ను మారుస్తూ ఉండాలి.
- ప్రతి ఆరు నెలలకోసారి దంత వైద్యుల చేత దంతాల ఆరోగ్యాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి.

డాక్టర్ కడియాల రాజేంద్ర,
ఓరల్ అండ్ మ్యాక్సిలోఫేసియల్ సర్జన్,
హైదరాబాద్.



మొటిమలు తగ్గటం ఎలా?

చాలా మందికి ముఖంపై చిన్న మొటిమలు వస్తూ ఉంటాయి. అయితే చాలా సార్లు వీటికి కారణం తెలియదు. కారణం తెలియకుండా వీటి నివారణకు ప్రయత్నించటం కూడా సరికాదు. అందువల్ల ఈ మొటిమలు రావటానికి కారణాలేమిటో తెలుసుకుందాం.

రెండు రకాలు..

ముఖంపై వచ్చే మొటిమలు చర్మంపై ఉన్న రంధ్రాలు పూడుకుపోవటం వల్ల రావచ్చు. లేకపోతే హార్మోన్ల సమతౌల్యం దెబ్బతినటం వల్ల కూడా రావచ్చు. చాలా సందర్భాలలో అమ్మాయిలలో రుతుస్రావం ప్రారంభమయిన సమయంలో హార్మోన్లలో వచ్చే తేడా వల్ల ఈ మొటిమలు వస్తాయి. అయితే హార్మోన్ల సమతౌల్యం దెబ్బతిన్నప్పుడు- ఆడ, మగ అనే తేడా లేకుండా ఈ పొక్కులు వచ్చే అవకాశముందంటున్నారు వైద్య నిపుణులు. ఈస్ట్రోజెన్, ప్రొజిస్టిరాయిన్, యాండ్రోజిన్ వంటి హార్మోన్లలో తేడా వచ్చినప్పుడు- శరీరంలో శీబం అనే రసాయన ఉత్పత్తి పెరుగుతుంది. దీని వల్ల చర్మంపై ఉన్న రంధ్రాలు పూడుకుపోతాయి. దీని వల్ల మొటిమలు ఏర్పడతాయి.



తేడా ఏమిటి?

చర్మ సంబంధ సమస్యల వల్ల వచ్చే మొటిమలు వెంటనే తగ్గిపోతాయి. ఇవి శరీరంలో ఏ ప్రాంతంలోనైనా రావచ్చు. ఆసాధారణంగా వీటి పై భాగంపై తెల్లని లేదా నల్లని బొడిపలు ఉంటాయి. కానీ హార్మోన్ల వల్ల వచ్చే మొటిమలు- ముఖం కింది భాగంలోను, గెడ్డం మీద, మెడ మీద ఏర్పడతాయి. వీటిని గోకితే మంట ఏర్పడుతుంది. ఇవి మామూలు క్రీముల వల్ల తగ్గిపోవు. వైద్యులు వీటి కోసం ప్రత్యేకమైన క్రీములను నిర్దేశిస్తారు.

చికిత్సలేమిటి?

టీ ట్రీ ఆయిల్:
టీ ట్రీ ఆయిల్ వల్ల మొటిమలు తగ్గుతాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా వారం రోజులు రాసుకుంటే కొంత ఫలితం కనిపిస్తుంది.

అలోవీరా:
అలోవీరా వల్ల చర్మంపై ఉన్న దద్దుర్లు తగ్గుతాయి. చర్మం మెరుస్తుంది.

గ్రీన్ టీ:
గ్రీన్‌టీ డికాక్షన్‌ను రాయటం వల్ల చర్మంపై ఎరుపు తగ్గుతుంది.

చంద్రిక గెరా దీక్షిత్... ఈ పేరు చెబితే 'ఈమె ఎవరు' అనే సందేహం రావచ్చు. కానీ 'వడాపావ్ గర్ల్' అనగానే ఆమె రూపం కళ్ల ముందు ప్రత్యక్షమవుతుంది. ఢిల్లీ వీధుల్లో తోపుడు బండిపై వడాపావ్ విక్రయించే ఈ అమ్మాయి... ఓ ఫుడ్ వ్లోగర్ వీడియోతో రాత్రికి రాత్రి స్టార్ అయిపోయింది. లక్షల్లో ఆదాయం... విలాసవంతమైన జీవితం... దేశమంతా ప్రాచుర్యం పొందిన చంద్రిక... ఇప్పుడు 'బిగ్ బాస్ ఓటీటీ-3' హౌస్‌లోకి అడుగు పెడుతోంది.

వైరల్



వడాపావ్ టు బిగ్‌బాస్ హౌస్

దేశ రాజధాని ఢిల్లీ... సైనిక్ విహార్... 'కేశవ్ మహా విద్యాలయ' గేటు ముందు జనం కిటకిటలాడుతుంటారు. వేడి వేడి వడాపావ్ కోసం ఆర్డర్లు ఇచ్చి... ఎదురు చూస్తుంటారు. అలాగని అదేదో బడా ఛాట్ భండార్ కాదు. రోడ్డు పక్కన ఓ చిన్న ఫుడ్ కార్ట్. వీధికి రెండు మూడు వడాపావ్‌లు విక్రయించే స్టాల్స్ ఉన్నా... అక్కడే ఎందుకంత డిమాండ్ అంటారా..! అదంతా ఆ ఫుడ్ కార్ట్ యజమాని చంద్రిక దీక్షిత్ మహిమ. ఆమె చేత్తో చేసిన వడాపావ్‌కు ఢిల్లీవాసులు ఫిదా అవుతున్నారు.

బతుకుతెరువు కోసం ఢిల్లీకి...

మధ్యప్రదేశ్ ఇండోర్‌కు చెందిన చంద్రిక తల్లితండ్రులు ఆమె చిన్నప్పుడే చనిపోయారు. ఆ తరువాత కొంత కాలానికి బతుకుతెరువు కోసం ఆమె తన నివాసాన్ని ఢిల్లీకి మార్చింది. తొలుత హల్దీరామ్స్‌లో పని చేసింది. 'అదే సమయంలో మా అబ్బాయి రుద్రకు డెంగీ సోకింది. దాంతో ఇంటి దగ్గర ఉండి వాడిని చూసుకోవడానికి ఉద్యోగం వదిలేశాను. వాడు కోలుకున్నాక సొంతంగా ఏదైనా చేయాలని... సైనిక్ విహార్‌లో వడాపావ్ బండి ప్రారంభించాను' అంటున్న చంద్రిక ఫుడ్ కార్ట్‌కు కొద్ది కాలంలోనే స్థానికంగా మంచి పేరు వచ్చింది. 'ముంబయిస్ మోస్ట్ లవ్‌డ్ వడాపావ్' అంటూ తన స్టాల్‌పై రాసుకున్న ఆమెకు... మొదటి నుంచీ వంటలపై ఆసక్తి. అందుకే ఫుడ్ కోర్టు ఆలోచన రాగానే, క్షణం ఆలోచించకుండా అమల్లో పెట్టేసింది.

రోజుకు నలభై వేలు..!

బిజినెస్ బానే సాగుతోంది. చుట్టూ వడాపావ్ స్టాల్స్ ఉన్నా... చంద్రిక ఫుడ్ కార్ట్‌కు మాత్రమే వచ్చేవారు రోజు రోజుకూ పెరుగుతూవచ్చారు. ఫుడ్ వ్లోగర్ అమిత్ భండారీ... ఆమె స్టాల్ గురించి గొప్పగా వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. దాంతో ఆ ప్రాంతానికే పరిమితమైన చంద్రిక పేరు ఒక్కసారిగా దేశమంతా మారుమోగింది. 'వడాపావ్ గర్ల్'గా అందరికీ పరిచయమైంది. ఆ వీడియోలో ఆమె విభిన్నమైన యాస వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అది మొదలు చంద్రిక జీవితం ఊహించని మలుపు తిరిగింది. అదే సమయంలో 'ఎక్స్‌ప్లోర్ విత్ చంద్రిక' పేరుతో ప్రారంభించిన యూట్యూబ్ చానల్‌కూ సబ్‌స్క్రైబర్స్ భారీగా పెరిగిపోయారు. ఒక్క వీడియోతో హఠాత్తుగా స్టార్ అయిపోయిన చంద్రిక.. తనలోని నటనాభిరుచిని కూడా బయటకు తీసింది. తన చానల్‌లో ఫుడ్ రెసిపీలే కాకుండా విభిన్న వేషాల్లో సరదా వీడియోలు చేస్తూ అలరిస్తోంది. ప్రస్తుతం యూట్యూబ్‌లో ఆమెకు దాదాపు రెండున్నర లక్షలమంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నాలుగున్నర లక్షలమంది ఫాలో అవుతున్నారు. వడాపావ్ వ్యాపారానికే పరిమితం కాకుండా... కంటెంట్ క్రియేటర్‌గా కూడా తనదైన ముద్ర వేసింది చంద్రిక. ఫుడ్ కార్ట్ ద్వారా రోజుకు నలభై వేల రూపాయల ఆదాయం లభిస్తుందని ఇటీవల ఓ వీడియోలో చెప్పుకొచ్చింది ఈ భామ. 'ఇది నమ్మశక్యంగా లేదం'టూ కొందరు కామెంట్ చేశారు. చంద్రిక భర్త యష్ దీక్షిత్ కూడా వీధి వ్యాపారే.



సెలబ్రిటీల ఫేవరెట్...

చంద్రిక వడాపావ్‌కు సినీ తారలు కూడా అభిమానులే. తరచూ స్టాల్‌కు వచ్చి రుచి చూస్తుంటారు. మరో విశేషమేమంటే... సాయంత్రం పూట ఒకరికి నాలుగుకు మించి వడా పావ్‌లు విక్రయించదు. అంత డిమాండ్ అక్కడ. స్వశక్తితో ఎదిగిన మహిళ కావడంతో 'బిగ్‌బాస్ 17' ఫేమ్ సన్నీ ఆర్య, పునీత్ సూపర్‌స్టార్, 'డాలీ చాయ్‌వాలా'గా పాపులర్ అయిన సునీల్ పాటి తదితరులు చంద్రికకు మద్దతుగా నిలిచారు. తమ సామాజిక మాధ్యమాల ద్వారా ఆమెను ప్రోత్సహించారు. దీంతో 'వడాపావ్ గర్ల్' ఇమేజ్ మరింత పెరిగింది. ఇప్పుడు ఆమె కొన్ని బ్రాండ్లకు ఇన్‌స్టాలో ప్రచారం కూడా చేస్తున్నారు.

వివాదాలు ఉన్నాయి...

సెలబ్రిటీ హోదాతో పాటు అదే స్థాయిలో చంద్రికను వివాదాలు, సమస్యలు చుట్టుముట్టాయి. వీధిలో బండి పెట్టడంవల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందంటూ 'ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్' (ఎంసీడీ) ఆమెకు నోటీసులు ఇచ్చారు. అది పెద్ద వివాదంగా మారి దుమారం రేపింది. నెట్టింట కొందరు మద్దతుగా నిలిస్తే.. మరికొందరు ప్రజలకు ఇబ్బంది కలిగించడాన్ని తప్పు పట్టారు. అయితే తాను 35 వేల రూపాయలు ఎంసీడీ అధికారులకు ఇచ్చానంటూ చంద్రిక చేసిన ఆరోపణ అగ్నికి ఆద్యం పోసింది. దాంతోపాటు పోటీ వ్యాపారులు కూడా తమ అమ్మకాలు దెబ్బతింటున్నాయంటూ ఆమెతో గొడవకు దిగారు. అయితే వీటన్నిటినీ తట్టుకొని ఆమె నిలబడింది.

బిగ్ బాస్ ఓటీటీలో...

ఇవన్నీ ఒక ఎత్తయితే... ఇటీవల 'ఫోర్డ్ ముస్తాంగ్' కారుతో పోజులిచ్చి అందర్నీ ఆశ్చర్యపరిచింది. 'ఇది నా కొత్త కారు' అంటూ ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టింది. ఆ ఫొటోలు చూసిన అభిమానుల నోట మాట రాలేదు. కారణం... ఆ కారు ఖరీదు 76 లక్షల పైమాటే. ఏదిఏమైనా... వీధిలో వడాపావ్ అమ్మే ఒక అమ్మాయి... ఫోర్డ్ ముస్తాంగ్ డ్రైవ్ చేసే స్థాయికి ఎదిగిన క్రమం తమకు ప్రేరణ కలిగిస్తుందంటూ నెటిజనులు చంద్రికను అభినందనలతో ముంచెత్తుతున్నారు. 'ఎవరు ఏమనుకున్నా, ఎంతగా విమర్శించినా నా ఈ ప్రయాణం నా కుటుంబం కోసం. మా అబ్బాయి బంగారు భవిత కోసం' అంటున్న ఈ 'వడాపావ్ గర్ల్'... బిగ్‌బాస్ ఓటీటీ3కి ఎంపికైన మొదటి కంటెస్టెంట్.

వైసీపీ ఎమ్మెల్సీ రఘురాజుకు ఊరట!

- మండలి స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేయొద్దు
- కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ రఘురాజుకు హైకోర్టులో ఒకింత ఊరట లభించింది. ఆయనపై అనర్హత వేటు నేపథ్యంలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేస్తూ నోటిఫికేషన్ జారీ చేయవద్దని కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)ని కోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని శాసన వ్యవహారాల కార్యదర్శి, ట్రిబ్యునల్ ఛైర్మన్ హోదాలో శాసనమండలి ఛైర్మన్, విప్ పి.విక్రాంత్‌లకు నోటీసులు జారీ చేసింది. విచారణను జూలై 10కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి బుధవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని శాసన మండలిలో నాటి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ ఫిర్యాదు ఆధారంగా తనపై అనర్హత వేటు వేస్తూ మండలి ఛైర్మన్ ఈ నెల 3న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రఘురాజు పిటిషన్ దాఖలు చేశారు. ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరారు. స్థానిక సంస్థల కోటా కింద తన స్థానం ఖాళీ అయినట్లు పేర్కొంటూ ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా.. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపించారు. రఘురాజు సతీమణి టీడీపీలో చేరారనే కారణంతో ఆయనపై అనర్హత వేటు వేయాలని వైసీపీ ఫిర్యాదు చేసిందన్నారు. భార్య చర్యలకు రఘురాజును బాధ్యుడిని చేయడం సరికాదన్నారు.

మల్టీప్లెక్స్‌లలో పార్కింగ్ ఫీజుపై హైకోర్టు విచారణ

- కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి ఆదేశం

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మల్టీప్లెక్స్‌లు, వాణిజ్య సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో వినియోగదారుల నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేసుకొనేందుకు వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిల్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేసింది. విజయవాడకు చెందిన చందన మోహన్‌రావు ఈ పిల్‌ను దాఖలు చేశారు. పార్కింగ్ ఫీజు వసూలు చేసుకొనేందుకు వెసులుబాటు కల్పిస్తూ 2021లో ప్రభుత్వం ఇచ్చిన జీవో 35ను చట్ట విరుద్ధమైనదిగా ప్రకటించాలని కోరారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వివేకానంద విరూపాక్ష వాదనలు వినిపిస్తూ.. మల్టీప్లెక్స్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో పార్కింగ్ ఫీజు వసూలు చేయడం హైకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. అడ్వకేట్ జనరల్ తరఫున ప్రభుత్వ న్యాయవాది ఎస్.ప్రణతి స్పందిస్తూ.. జీవో 35 స్థానంలో ప్రభుత్వం జీవో 13ను తీసుకొచ్చిందన్నారు. జీవో ప్రతిని కోర్టు ముందుంచారు. దీనిని పరిశీలించిన ధర్మాసనం. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

నూతన క్రిమినల్ చట్టాలపై న్యాయవాదుల నిరసన

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1 నుంచి అమల్లోకి రానున్న నూతన క్రిమినల్ చట్టాలను వ్యతిరేకిస్తూ హైకోర్టు వద్ద న్యాయవాద సంఘాలు నిరసన చేపట్టాయి. అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు), ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్(ఐఏపీఎల్), ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించారు. న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, నల్లూరి మాధవరావు, పొత్తూరి సురేశ్‌కుమార్, పాటిబండ్ల ప్రభాకరరావు, పి.శ్రీనివాసరావు నూతన చట్టాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు.



హైకోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నష్టాల బాధ్యతెవరిది?

- అయోమయంలో పోలవరం ప్రాజెక్టు
- నెలాఖరుకు రానున్న అమెరికా, కెనడా నిపుణులు
- వారి సూచనలే కీలకం
- తాజా పరిస్థితిపై రేపు శ్వేతపత్రం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలవరం ప్రాజెక్టు భవితవ్యం కేంద్ర జలశక్తి శాఖ నియమించిన అంతర్జాతీయ నిపుణుల చేతుల్లోకి వెళ్లిపోయింది. అమెరికా, కెనడాలకు చెందిన నిపుణులు అధ్యయనం చేసి నివేదికలు ఇస్తే తప్ప వరదకు దెబ్బతిన్న డయాఫ్రం వాల్ మరమ్మతు, సమాంతరంగా కొత్త వాల్ నిర్మాణం, సీపేజీకి గురైన ఎగువ కాఫర్ డ్యాం పరిస్థితి స్పష్టం కాదు. జగన్ ప్రభుత్వం పోలవరం పనులు యథాతథంగా కొనసాగించి ఉంటే ప్రాజెక్టు పూర్తయిపోయి రెండున్నరేళ్లు అయ్యేదని సాగునీటి రంగ నిపుణులు అంటున్నారు. రైతులకు సాగునీరు, వందల గ్రామాలకూ, విశాఖ నగరానికి. ఆ కాలువ వెంబడి మున్సిపాలిటీలకూ తాగునీరు దక్కేది. కానీ రివర్స్ నిర్ణయాలతో నాశనం చేశారని మండిపడుతున్నారు. పోలవరం విధ్వంసానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రస్తుతం చర్చ సాగుతోంది. కేంద్రం వద్దన్నా రివర్స్ టెండర్లకు వెళ్లిన జగన్ బాధ్యత వహిస్తారా.. కేంద్రం దీనిని తీవ్రంగా పరిగణిస్తుందా అని ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టు ప్రధాన కట్టడాల్లో కీలకమైన డయాఫ్రం వాల్ దెబ్బతింది. గైడ్‌బండ్ కుంగిపోయింది. ఎగువ కాఫర్ డ్యాం సీపేజీకి గురైంది. ఇదీ ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి. క్షేత్ర స్థాయిలో ప్రాజెక్టు నిర్జీవంగా దర్శనమిస్తోంది. అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఎప్పుడు వస్తుందో.. ఏమని నివేదిక ఇస్తుందో.. కేంద్రం దానిని ఎప్పుడు ఆమోదించి.. ఎలాంటి సాంకేతిక సలహాలు ఇస్తుందో.. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని అయోమయం నెలకొంది. సదరు నిపుణులు ఈ నెలాఖరుకు నాటికి ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుంటారని అంటున్నారు. వారు ప్రాథమిక పరిశీలన జరిపి.. ప్రాజెక్టుపై ఏవిధంగా ముందుకు వెళ్లాలో స్పష్టత ఇస్తారని చెబుతున్నారు. అప్పటిదాకా పనులు ముందుకు జరగని పరిస్థితి. ఇంకోవైపు.. ప్రాజెక్టు స్థితిగతులపై జలవనరుల శాఖ శుక్రవారం(28న) శ్వేతపత్రం విడుదల చేయనుంది. ఈ నష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారు.. విచారణ జరిపి బాధ్యులను గుర్తిస్తారా వంటివి పొందుపరుస్తుందో లేదో చూడాల్సి ఉంది.



1,548 కోట్లు ఎక్కడ..
21,000 కోట్లు ఎక్కడ?

సీఎంగా జగన్ బాధ్యతలు తీసుకునేనాటికి పోలవరం హెడ్‌వర్క్స్‌లో ఇంకా రూ.1,771 కోట్ల విలువైన పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రివర్స్ టెండరింగ్‌లో వాటిని రూ.1,548.13 కోట్లకు పూర్తి చేసేందుకు మేఘా ఇంజనీరింగ్ సంస్థ ముందుకొచ్చింది. ఆ పనులను 2021 నవంబరుకల్లా పూర్తిచేయాలి. కానీ, చేయకపోవడంతో పనుల అంచనా వ్యయం 21,000 కోట్లకు చేరినట్లు జలవనరుల శాఖ అంచనా వేసింది. ఇందులో హెడ్‌వర్క్స్ పనుల విలువను రూ.9179.67 కోట్లుగా పేర్కొంది. అంటే వాటి అంచనా వ్యయం రూ.7631.54 కోట్లు పెరిగింది. ఈ అంచనాలపై నిపుణులు విస్తుబోతున్నారు. ఎక్కడ రూ.1,548 కోట్లు.. ఎక్కడ 21 వేల కోట్లు? ఏడు రెట్లకుపైగా పెరగడంపై ఆశ్చర్యపోతున్నారు.

22.25 మీటర్లకు చేరిక

పోలవరం, జూన్ 26: పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలో బుధవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం పెరిగింది. సోమవారం సీలేరు నుంచి జల వనరులశాఖ అధికారులు 2 వేల క్యూసెక్కుల జలాలను నదిలోకి విడుదల చేసిన నేపథ్యంలో నీటిమట్టం పెరిగింది. దీంతో స్పిల్‌వే నీటి మట్టం 22.25 మీటర్లకు చేరుకుందని ఈఈ పి.వెంకటరమణ తెలిపారు. ఎగువ కాఫర్ డ్యాం వద్ద, గండిపోచమ్మ ఆలయం వద్ద బ్యాక్ వాటర్ ప్రభావంతో నాలుగు అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. అది క్రస్ట్ లెవల్‌కు దిగువన ఉండడం వల్ల స్పిల్‌వే స్లూయిజ్‌ల ద్వారానే నీటి విడుదల చేస్తున్నారు. దీంతో పోలవరం, పట్టిసీమ నీటిమట్టాలు 13 మీటర్లకు మాత్రమే పరిమితయ్యాయి. ప్రాజెక్టు దిగువన గోదావరి నీటిమట్టం సాధారణ స్థితిలోనే ఉంది.

చీకట్లు తొలగి.. మళ్లీ ప్రగతి!

- సర్కారు మార్పుతో పారిశ్రామికవర్గాల్లో నూతనోత్సాహం
- జగన్ పాలనలో చిన్న పరిశ్రమలు కుదేలు
- లక్షలాది కార్మికులు రోడ్డుపాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో పారిశ్రామికవర్గాల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. జగన్ పాలనలో గత ఐదేళ్లుగా కమ్ముకున్న చీకట్లు తొలగిపోయి, రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి మళ్లీ పరుగులు తీస్తుందని భావిస్తున్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధితో సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తుందని పారిశ్రామికవేత్తలు ఆశిస్తున్నారు. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విజయవాడలో ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు చిన్న పరిశ్రమల యజమానులు సమాయత్తమయ్యారు. ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఎంఎస్ఎంఈ అసోసియేషన్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలకు రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పారిశ్రామిక ప్రముఖులు హాజరుకానున్నారు. గత ఐదేళ్లు జగన్ ప్రభుత్వం పరిశ్రమలకు కనీస ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. అంతేగాక విద్యుత్ చార్జీల బాదుడుతో చుక్కలు చూపించింది. పారిశ్రామికవేత్తలకు ఫోన్‌కాల్ దూరంలో ఉంటామని, పెట్టుబడులు పెట్టేందుకు వచ్చేవారికి సింగిల్ విండో విధానం ద్వారా రోజుల వ్యవధిలో అన్ని అనుమతులు ఇచ్చి వారిని చేయిపట్టి నడిపిస్తామని గతంలో సీఎం హోదాలో చెప్పిన జగన్ ఆచరణలో ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించారు. ఆయన హయాంలో కొత్త పరిశ్రమలు రాకపోగా, ప్రభుత్వ విధానాలతో విసిగిపోయి ఉన్న పరిశ్రమలు కూడా పొరుగు రాష్ట్రాల బాట పట్టాయి. రాష్ట్రంలో కొవిడ్ వల్ల దెబ్బతిన్న ఎంఎస్ఎంఈలు పరిశ్రమలను నడపలేక, బ్యాంకు వాయిదాలు చెల్లించలేక ఎన్‌పీఏలు మారిపోయాయి. లక్షలాది కార్మికులు, ఉద్యోగులు రోడ్డునపడ్డారు. గత మూడేళ్లలో వచ్చిన క్లెయిమ్‌లకు సంబంధించి దాదాపు రూ.4 వేల కోట్లకు పైగా బకాయిలు ఉండిపోయాయి. కాగా, తమ డిమాండ్లను ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈల అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను మంజూరు చేయాలని, చార్జీల భారం విధించరాదని విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్రంలో అందరికీ న్యాయం చేయాలన్నారు.

ఆఫీసు తరలింపులో లక్షలు నొక్కేశారు!

- ఏపీవీవీపీలో ఇంజనీర్ అండ్‌కో చేతివాటం
- ప్రభుత్వం 70 లక్షలకు అనుమతిస్తే.. రూ.1.80 కోట్ల లెక్క
- ఆరోగ్యశాఖలో అవినీతి బాగోతం
- అధికారుల సూచనలతో సెలవుపై వెళ్లిపోయిన ఇంజనీర్

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన్ పరిషత్ (ఏపీవీవీపీ) కార్యాలయం తరలింపులో అవినీతి కంపు గుప్పుమంటోంది! ప్రభుత్వం రూ.70 లక్షలకు అనుమతిస్తే ఏపీవీవీపీ అధికారులు దాదాపు రూ.1.80 కోట్లు ఖర్చు చూపి అందులో సగం నొక్కేసినట్లు సమాచారం!. ఏపీవీవీపీలో ఒక బయో మెడికల్ ఇంజనీర్ కనుసన్నల్లో నడిచిన ఈ వ్యవహారంలో ఏపీవీవీపీలోని ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాలివీ.. గత ఏడాది వరకూ ఏపీవీవీపీ కార్యాలయం గొల్లపూడిలో ఉండేది. 16 వేల చదరపు గజాల విస్తీర్ణం కలిగిన భవనాన్ని.. చదరపు గజానికి రూ.16చొప్పున అద్దెకు తీసుకుని నెలకు రూ.2 లక్షల వరకూ చెల్లించేవారు. కానీ ఆ భవనం నిర్వహణ లేక చాలా దారుణంగా ఉండడంతో అధికారులు కార్యాలయాన్ని తాడేపల్లికి మార్చాలని నిర్ణయించారు. సాధారణంగా గొల్లపూడితో పోల్చితే తాడేపల్లిలో భవనాల అద్దెలు చాలా ఎక్కువ. ఆ విషయం తెలిసి కూడా ఏపీవీవీపీ అధికారులు తాడేపల్లిలోని ఒక పెద్ద భవనాన్ని చదరపు గజానికి రూ.30చొప్పున చెల్లించేందుకు అగ్రిమెంట్ చేసుకున్నారు. గొల్లపూడిలో రూ.2లక్షలున్న అద్దెను అధికారులు ఇక్కడ రూ.5 లక్షలకు పెంచేశారు. ప్రతి నెలా ప్రభుత్వంపై రూ.2 లక్షల భారం పెట్టారు. ఏడాదికి రూ.36 లక్షల వరకూ ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం చదరపు గజానికి రూ.25 ఎక్కువ చెల్లించకూడదంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యేక ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ప్రభుత్వం ఫర్నిచర్, మౌలికసదుపాయాలకు కల్పన కోసం రూ.70 లక్షలకు మాత్రమే అనుమతిచ్చింది. అధికారులు మాత్రం అత్యుత్సాహం ప్రదర్శించి దాదాపు రూ.1.80 కోట్లు ఖర్చు చేశారు. వాస్తవానికి ఏపీవీవీపీలో ఉన్నది కేవలం 100 మంది ఉద్యోగులు మాత్రమే. వంద మంది కోసం దాదాపు 20 వేల చదరపు గజాలున్న భవనాన్ని అద్దెకు తీసుకోవడమే కాకుండా ప్రయివేటు భవనాన్ని భారీగా హంగులతో తీర్చిదిద్దారు. ఆపై మొత్తం ఫర్నిచర్‌తో నింపేశారు. ఇప్పుడు అకస్మాత్తుగా ఆ భవనాన్ని ఖాళీ చేయాల్సి వస్తే ఫర్నిచర్ తప్ప విగిలిన సోకులకు ఖర్చు చేసిన సొమ్మంతా వృథానే!. ఈ మొత్తం వ్యవహారంలో ఓ బయో మెడికల్ ఇంజనీర్ కర్త, కర్మ, క్రియగా వ్యవహరించారు. ఏపీవీవీపీలో పాతుకుపోయిన ఆయనపై ఆది నుంచీ భారీగా అవినీతి ఆరోపణలున్నాయి. కార్యాలయం కోసం ఖర్చు చేసిన రూ.1.80 కోట్లలో కూడా భారీగా దోపిడీ చేసేశారని ఉద్యోగులే చెప్పుకొంటున్నారు. కేవలం రూ.90 లక్షలు వరకూ మాత్రమే ఖర్చు చేశారని, మిగిలిన రూ.90 పక్కదారిలో నొక్కేశారని అంటున్నారు. ఇందులో ఉన్నతాధికారుల పాత్రకూడా ఉన్నట్లు చెప్పుకొంటున్నారు. కాగా, ఈ విషయం ఆలస్యంగానైనా వెలుగులోకి రావడంతో ప్రభుత్వానికి తెలిస్తే సమస్య అవుతుందని భావించి, సదరు ఇంజనీరును రెండ్రోజుల క్రితం సెలవుపై పంపేశారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించాల్సిన అధికారులే, సదరు ఇంజనీర్‌ను కాపాడే ప్రయత్నం చేస్తుండడంపై ఉద్యోగవర్గాల్లోనే చర్చనీయంశమైంది. ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి మరి!.

వీఎంసీ సెక్రటరీ సెల్ కార్యదర్శి సరెండర్

- మాతృశాఖకు పంపేసిన అధికారులు

చిట్టినగర్: కౌన్సిల్ సమావేశాలు నిర్వహించే సెక్రటరీ సెల్ కార్యదర్శి వసంతలక్ష్మిని అధికారులు మాతృశాఖకు సరెండర్ చేశారు. ఈ మేరకు కమిషనర్ స్వప్నిల్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. పురపాలక, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖలో పనిచేస్తున్న ఆమె కొంతకాలంగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. కమిషనర్‌కు సమాచారం ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు చెప్పిన రెండు అంశాలను అజెండాలో పొందుపరిచారు. బుధవారం అజెండాను పరిశీలించిన కమిషనర్ వీటిని చూసి అవాక్కయ్యారు. సర్కిల్-1 పరిధిలో సీసీ రహదారులు, కల్వర్టు నిర్మాణం అంశాలను తన దృష్టికి తీసుకురాకుండా అజెండాలో ఎలా పొందుపరుస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. దీ నిపై క్రమశిక్షణాచర్యల్లో బాగంగా వసంతలక్ష్మిని మా తృశాఖకు సరెండర్ చేశారని తెలిసింది.

తొమ్మిది అంశాలకు ఆమోదం

మేయర్ భాగ్యలక్ష్మి అధ్యక్షతన వీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. ఇందులో 11 అంశాలతో అజెండాను ప్రవేశపెట్టారు. వాటిలో తొమ్మిది అంశాలను ఆమోదించారు. ఒక అంశాన్ని రికార్డ్ చేసి, మరో అంశాన్ని ధ్రువీకరించారు. ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించే అంశాన్ని ఆమోదించారు.

జర్నలిస్టు సాయిపై చర్యలు తీసుకోండి: షుబ్లీ

వన్‌టౌన్: మత సామరస్యానికి విఘాతం కలిగించేలా వీడియోలు ప్రదర్శిస్తున్న జర్నలిస్టు సాయిపై చర్యలు తీసుకోవాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఫరూక్ షుబ్లీ బుధవారం పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణను ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగా ఒక మతంపై తప్పుడు వార్తను తన యూట్యూబ్ చానల్‌లో ప్రసారం చేయడం సంఘ విద్రోహచర్య కిందకు వస్తుందన్నారు. అంతే కాకుండా, సోదరభావంతో మెలుగుతున్నవారి మధ్య విద్వేషాలు రగులుతాయన్నారు. అతడిపై కేసునమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్టు షుబ్లీ తెలిపారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని గాంధీనగర్ సర్ విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో కృష్ణాజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్టు ఎంపికలను చేపట్టారు. ఇందులో ప్రతిభ చాటిన క్రీడాకారులను జూల్ 13, 14న కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ చాంపియన్‌షిప్‌కు పంపుతామని సెక్రటరీ వెనిగళ్ల వినోద్ తెలిపారు. కృష్ణాజిల్లా ఆక్వాటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీవీడీవీ భాస్కర్, ట్రెజరర్ పి.బాల మురళీకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా సెక్రటరీ ఐ.రమేష్ పర్యవేక్షించారు.

ఎంపికైన స్విమ్మర్లు వీరే..

జి.సంపత్‌కుమార్, కోట వర్షంత్ నాయుడు, బి.హర్షిత, అన్నే హరి రుద్ర, బి. జయప్రకాష్ నారాయణ, జీవన సాయిసీతారామ్, కె.చైతన్యనాయుడు, ఎం.హర్షిత, ఎం. కార్తీక్, పొమర్తి రామచంద్రరావు, పొప్పూరి హనుమ కనిష్క, సాయి సూర్యతేజ, తివారీ సూర్య తే జప్రసాద్, వెంకట సాయి ధీరజ్ సోము, నిధన్స్, తలసిల సహస్ర, జోయల్ ఇమ్మాన్యుయేల్, ఎం. షాజిల్, నాగదేసి రిత్విక్, వై.ఆయుష్మాన్ బాబు, బి. ఎక్తా, సోనాక్షి, తన్వి శివ, వై.వృధ్వీ.

మెట్టుదిగిన మేయర్

- స్టాండింగ్ కమిటీ ఎన్నిక నేపథ్యంలో 'కలయిక'
- సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు
- రెండు స్థానాలు ఇవ్వాలని టీడీపీ ప్రతిపాదన

చిట్టినగర్, జూన్ 26: స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో తన ప్రాబల్యాన్ని చూపించుకోవాలన్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి మెట్టుదిగారు. తన చాంబర్‌లో కొంతమంది కార్పొరేటర్లతో ప్రత్యేకంగా రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్న మర్నాడే ఐక్యతారాగాన్ని వినిపించారు. మేయర్ ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రతిగా డిప్యూటీ మేయర్ అవుతు శైలజ తన చాంబర్‌లో మరో సమావేశం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అధికారపక్షంలో చీలికలు వస్తే ప్రతిపక్షానికి అనుకూల పవనాలు వీస్తాయని భావించిన మేయర్ వైసీపీకి కార్పొరేటర్లందరితో బుధవారం ఒక సమావేశం నిర్వహించారు. దీనికి డిప్యూటీ మేయర్లు అవుతు శైలజ, బెల్లం దుర్గను ఆహ్వానించారు. ఇప్పటి వరకు అదృశ్యంలో ఉన్న ఫ్లోర్‌లీడర్ సత్యనారాయణ ఈ సమావేశంలో ప్రత్యక్షమయ్యారు. మేయర్‌గా భాగ్యలక్ష్మి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏనాడూ ఈస్థాయిలో సమావేశాన్ని నిర్వహించలేదు. మేయర్‌కు తమపై ఉన్నట్టుండి ఇంత ప్రేమాభిమానాలు ఎందుకు వచ్చాయోనని మిగిలిన కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్లు ఆశ్చర్యపోతున్నారు. వెల్లంపల్లి శ్రీనివాసరావు మంత్రిగా ఉనప్పుడు భాగ్యలక్ష్మి దూకుడుకు హద్దుల్లేకుండా పోయాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. వెల్లంపల్లికి పదవి పోయినా ఆయన చెప్పిన అంశాలకే ఆమె ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఈ వ్యవహారమంతా డిప్యూటీ మేయర్లకు, కార్పొరేటర్లకు అసంతృప్తిని రాజేసింది. ఇప్పుడు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వస్తున్నా అటు వెల్లంపల్లి, ఇటు మల్లాది విష్ణు ఏం పట్టించుకున్నట్టు కనిపించడం లేదు. అధికారంలో ఉండగా పదవులకు ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై దిశానిర్దేశం చేసిన నేతలు ఇప్పుడు మౌనవ్రతం పాటిస్తున్నారు. దీంతో కార్పొరేషన్‌లో చక్రం తిప్పాలని మేయర్ భాగ్యలక్ష్మి భావించారు. స్టాండింగ్ కమిటీలో తన వర్గ కార్పొరేటర్లను నియమిస్తే తిరుగు ఉండదని భావించి పావులు కదిపారు. ఈ వ్యూహాన్ని పసిగట్టిన డిప్యూటీ మేయర్లు ఎత్తుకు పై ఎత్తులు వేయడంతో మేయర్ మెట్టుదిగక తప్పలేదు. ఈ సమావేశంలో మన మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా పనిచేద్దామని వివరించినట్టు తెలిసింది. దీంతో డిప్యూటీలు, కార్పొరేటర్ల ఒక్కసారిగా కంగుతిన్నారు. ఈ మూడేళ్లలో వినిపించని ఐక్యతారాగం ఇప్పుడు ఎందుకు వినిపిస్తున్నారోనని ఆలోచనలో పడ్డారు. మరోపక్క స్టాండింగ్ కమిటీలో తమకు రెండు స్థానాలు కేటాయించాలని టీడీపీ ప్రతిపాదించినట్టు సమాచారం. టీడీపీ ఫ్లోర్‌లీడర్ బాలాస్వామి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి చంటి ఈ మేరకు వినతిపత్రాన్ని మేయర్‌కు అందజేశారు. మిగిలిన కార్పొరేటర్లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ కోరిన రెండు స్థానాలను ఇవ్వలేని పక్షంలో పోటీలో ఉండాలని పార్టీ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఇదే కనుక జరిగితే ఎన్నిక అనివార్యమవుతుంది.

కొత్త క్రిమినల్ చట్టాలను తక్షణం నిలిపేయాలి

- ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్



నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

విజయవాడ లీగల్, జూన్ 26: ఏపీహైకోర్టు ఆవరణలో ఆలిండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, కొత్త క్రిమినల్ చట్టాల అమలును నిలుపుదల చేయాలని బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కొత్తచట్టాలు ప్రజాహితంగా కాకుండా ప్రజాకంటకంగా ఉన్నాయన్నారు. దేశద్రోహ నిబంధనను తీసివేస్తామని చెప్పి కొత్తచట్టంలో మరింత కఠినం చేశారన్నారు. ఎవరికైనా బేడీలు వేసే నిబంధనను కొత్తగా చేర్చారన్నారు. న్యాయవ్యవస్థకున్న అధికారాలను కత్తిరించి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు కట్టబెట్టారని, దీంతో సామాన్య ప్రజలు మరిన్ని సమస్యలు ఎదుర్కొంటారని, పోలీసు రాజ్యం ఏర్పడుతుందని సుంకర మండిపడ్డారు. ఈ ప్రదర్శనలో ఐలూ న్యాయవాదులు బొమ్మసారి రవి, వి.రాజారత్నం, సంపర శ్రీనివాసరావు, చిలువేరు మార్కండేయ, చిలువేరు మాధవి, ప్రభాకర్, పిచ్చుక శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులకు నీరు-చెట్టు బకాయిలు
చెల్లించకపోవడం దుర్మార్గం

- మంత్రి నిమ్మల రామానాయుడు



మంత్రికి నివేదిక సమర్పిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

వన్‌టౌన్, జూన్ 26: గత ప్రభుత్వ పాలనలో రైతులకు నీరు-చెట్టు బకాయిలను ఇవ్వకుండా పెండింగులో పెట్టడం దుర్మార్గమని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. నీరు-చెట్టు పనులకు సంబంధించి ఐదేళ్లలో ఎంతెంత బకాయిలు పడిఉన్నదానిపై టీడీపీ నీరు-చెట్టు పెండింగు బిల్లుల గ్రీవెన్స్ బాధ్యుడు, సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ బుధవారం సచివాలయంలో మంత్రిని ఆయన చాంబర్‌లో కలిసి సమగ్ర నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నివేదికపై ఉన్నతాధికారుల నుంచి సమగ్ర నివేదిక రప్పించుకుని పూర్తిస్థాయిలో సమీక్షించి రైతులను, సాగునీటి సంఘాల ప్రతినిధులను ఆదుకుంటామన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఆయా జిల్లాల డెల్టా ప్రాజెక్టుల కమిటీల నేతలు మైనేని మురళీకృష్ణ, పొత్తూరి రామాంజనేయరాజు, గుత్తా శివరామకృష్ణ, యనమద్ది పుల్లయ్య చౌదరి, గండి ముసలి నాయుడు పాల్గొన్నారు.

ఆర్థిక అష్ట దిగ్బంధనంలో రాష్ట్రం

- ఎన్‌జీవో నేతలతో మంత్రి కొల్లు రవీంద్ర



మంత్రి రవీంద్రను సత్కరించిన ఎన్‌జీవో నేతలు

వన్‌టౌన్,జూన్ 26: ప్రభుత్వానికి ఉద్యోగుల సహకారం ఎంతో అవసరమని, రాష్ట్రం ప్రస్తుతం ఆర్థిక అష్ట దిగ్బంధనంలో ఉందని తనను సత్కరించిన ఎన్‌జీవో నేతలతో రాష్ట్ర ఎక్సైజ్ గనుల శాఖమంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మంత్రిని ఆయన నివాస గృహంలో బుధవారం ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు పలువురు కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం ఆర్థిక అష్ట దిగ్బంధనంలో ఉందని, ఈ పరిస్థితుల్లో వేగవంతమైన ఫలితాలు రావడానికి ఉద్యోగుల సహకారం ఎంతైనా అవసరమన్నారు. ఉద్యోగుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు ఉద్యోగులు గత ప్రభుత్వంలో కోల్పోయిన హక్కులను సీఎం చంద్రబాబు పునరుద్ధరిస్తూ త్వరలోనే శుభవార్తను ప్రకటిస్తారన్నారు. నేతలు మహమ్మద్ ఇక్బాల్, పి.రమేష్, వి సతీష్, రామకృష్ణ, ఎం రాజబాబు, వేమూరి ప్రసాద్ పాల్గొన్నారు.

కంటే కూతుర్నే కనాలి..!

- తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తెలు



పటమట, జూన్ 26: కంటే కూతుర్నే కనాలి అనేది సామెత. దాన్నినిజం చేస్తూ ప్రముఖ వైద్యుడు మాజీ లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ గవర్నర్ రాయల సత్యనారాయణ ప్రసాద్ కుమార్తెలు లాయర్ శ్రీలీల, డాక్టర్ శ్రీలత తండ్రి అంత్యక్రియలు తామే దగ్గరుండి నిర్వహించి ప్రశంసలు అందుకుంటున్నారు. కనకదుర్గానగర్‌కు చెందిన డాక్టర్ రాయల సత్యనారాయణ ప్రసాదకు ఇద్దరు కుమార్తెలు. బుధవారం ఆయన తుదిశ్వాస విడిచారు. మగ పిల్లలు లేని లోటు లేకుండా తమ తండ్రి అంత్యక్రియలను సక్రమంగా నిర్వహించారు. ప్రసాద్ కుటుంబీకులంతా ఉన్నత విద్యావంతులే. ఆయన మొదటి కుమార్తె శ్రీలీల, న్యాయవాది, అల్లుడు మాజీ లయన్స్ గవర్నర్ మేకా శ్రీరామ్ సురేష్, రెండో కుమార్తె డాక్టర్ శ్రీలత, అల్లుడు రాజమండ్రిలో ప్రముఖ న్యూరాలజిస్ట్ యార్లగడ్డ అశుతోష్ ప్రసాద్, వారి పిల్లలూ వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. ప్రసాద్ అంతిమ యాత్రలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వియ్యంకులు పారిశ్రామికవేత్త వల్లభనేని సుబ్బయ్య చౌదరి, డాక్టర్ వల్లూరి శివప్రసాద్, నందిగం రామ్మోహన్, వంకినేని పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

కొత్త కలెక్టర్ సృజనకు అర్చకుల ఆశీస్సులు

వన్‌టౌన్, జూన్ 26: జిల్లా కలెక్టర్‌గా కొత్తగా వచ్చి బుధవారం బాధ్యతలు స్వీకరించిన గుమ్మళ్ల సృజనకు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో దుర్గగుడి అర్చకులు ఆశీస్సులు అందజేశారు. ఈవో రామారావు ఆమెకు ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

దుర్గగుడిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బుధవారం దుర్గగుడికి విచ్చేసిన తాడిగడప శ్రీనివాస్‌నగర్‌కు చెందిన మాగంటి కృష్ణకుమారి రూ.లక్ష విరాళం అందజేశారు. మాగంటి సరస్వతి, జానకిరామయ్య పేరిట అన్నవితరణ చేసేందుక ఈ విరాళాన్ని చెక్కు రూపంలో దుర్గగుడి అధికారులకు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆమెకు ఆశీస్సులు, శేష వస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.



తోలు బొమ్మలాటను వీక్షిస్తున్న కలెక్టర్ దంపతులు

అలరించిన తోలుబొమ్మలాట ప్రదర్శన

ఇంద్రకీలాద్రి ధర్మపథం వేదికపై ప్రాచీన కళగా ప్రసిద్ధి పొందిన తోలుబొమ్మలాట ప్రదర్శన బుధవారం జరిగింది. ఇటీవలకాలంలో తోలుబొమ్మలాట ప్రదర్శనలు అరుదుగా జరుగుతున్నాయి. దుర్గమ్మ భక్తుల కోసం ప్రాచీన కళ అయిన ఈ తోలుబొమ్మలాట ప్రదర్శన ఏర్పాటు చేసింది. కాకినాడ జిల్లా మాధవపట్నానికి చెందిన తోట బాలకృష్ణ ఆధ్వర్యంలోని శ్రీసాయినిలయం బృందం కిరాతార్జునీయం తోలుబొమ్మలాటను ప్రదర్శించింది. కథలోని ప్రతి అంశాన్ని రక్తికట్టించారు. తోలుబొమ్మలను సన్నివేశాలకు అనుగుణంగా ఆడిస్తూ అలరించారు. ఈ తోలు బొమ్మలాట ప్రదర్శనను కలెక్టర్ సృజన దంపతులు, ఈవో రామారావు వీక్షించి కళాకారులను అభినందించారు.

అమరావతి అభివృద్ధికి నేను సైతం..!



ఉయ్యూరు, జూన్ 26: అమరావతి అభివృద్ధికి నేను సైతమంటూ పట్టణంలో రవి టీస్టాల్ నిర్వాహకుడు హుండీ ఏర్పాటుచేసి రోజూ రూ.వంద అందులో వేస్తూ టీ తాగడానికి వచ్చేవారిని పోత్సహిస్తున్నాడు. కేరళ నుంచి కొన్నేళ్ల క్రితం వచ్చి పట్టణంలో సెటిలై టీ స్టాల్ నడుపుతున్న రవి అమరావతి అభివృద్ధికి నావంతు సహకారమంటూ హుండీ ఏర్పాటుచేసి అందులో రూ.వం ద వేస్తున్నాడు. ఈనెల నుంచి జూన్ 2029 వరకు హుండీలో వచ్చిన మొత్తాన్ని సీఎంకు అందజేస్తానని చెబుతున్నాడు. టీ తాగేందుకు వచ్చినవారు రవి ఔదార్యాన్ని మెచ్చుకొంటూ మేము కూడా అంటూ తోచినట్టు హుండీలో డబ్బులు వేస్తున్నారు.

ఉత్తమ పాస్‌పోర్టు కార్యాలయంగా 'విజయవాడ'

2023-24లో రికార్డు స్థాయిలో 3,70,123 పాస్‌పోర్టులు జారీ

- అంతకు ముందు ఏడాది కంటే 20 శాతం అధికం
- ప్రాంతీయ కార్యాలయ విస్తరణ పనులు ప్రారంభం
- కొత్త భవనంలోకి 'పరిపాలన'.. ఇక ముద్రణ కూడా ఇక్కడే
- రోజువారీ దరఖాస్తుల సంఖ్య రెట్టింపు చేస్తాం: శివ హర్ష

విజయవాడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించినందుకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం ఉత్తమ పాస్‌పోర్టు కార్యాలయ అవార్డును అందుకొంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఈ అవార్డును సాధించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ఢిల్లీలో ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారుల సదస్సు నిర్వహించారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పాల్గొన్న ఈ సదస్సులో విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ అధికారి శివ హర్ష ఈ అవార్డును అందుకున్నారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలోకి విజయవాడ, తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రాలు(పీఎస్‌కే)లతో పాటు 13 పోస్టాఫీసు పాస్‌పోర్టు సేవా కేంద్రాలు(పీఓపీఎస్‌కే)లు వస్తాయి. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3,70,123 పాస్‌పోర్టు సంబంధిత సేవలను అందించారు. ఇంత భారీ సంఖ్యలో పాస్‌పోర్టులను జారీ చేసేందుకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం జరిపిన కృషిని కేంద్ర విదేశాంగ శాఖ గుర్తించింది. ప్రజల నుంచి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఎక్కువ గంటలు పనిచేయటం, స్లాట్స్ సంఖ్య పెంచడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించటం, సులభతరమైన సేవలను అందించటం, పోస్టల్, పోలీసు శాఖలతో సమన్వయం పెంపొందించుకోవటం ద్వారా వేగంగా, అత్యుత్తమంగా విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం సేవలు అందించగలిగింది. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం కొత్త భవనంలోకి చేరింది. విజయవాడ పాత బస్టాండ్ సమీపంలో బందరురోడ్డులోని భారీ బహుళ అంతస్థుల భవనంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. పరిపాలనా కార్యాలయం కొత్త భవనంలో కొలువు తీరింది.



ఢిల్లీలో ఉత్తమ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం అవార్డును స్వీకరిస్తున్న విజయవాడ పాస్‌పోర్టు అధికారి శివ హర్ష

రోజువారీ దరఖాస్తుల సంఖ్య 1,200కు పెంచుతాం..

ఉత్తమ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉంది. కార్యాలయ విస్తరణ పనులు చేపట్టాం. రానున్న రోజుల్లో పెద్ద సంఖ్యలో పాస్‌పోర్టులను జారీ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రోజుకు 600 మందికి అందిస్తున్న సేవలు అతి కొద్ది రోజుల్లోనే 1,200 వరకు పెంచనున్నాం. తత్కాల్‌లో రోజుల వ్యవధిలోనే పాస్‌పోర్టులు తీసుకునే అవకాశాన్ని కల్పించాం. ఆ మేరకు మెకానిజాన్ని అభివృద్ధి చేశాం. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు ప్రధాన కార్యాలయం కొత్త భవనంలో కొలువు తీరింది. అందులో పరిపాలనా వ్యవహారాలు మాత్రమే జరుగుతాయి. సేవా కేంద్రం ప్రస్తుతం ఉన్న చోటే యథావిధిగా పనిచేస్తుంది. పాస్‌పోర్టు ముద్రణ కూడా విజయవాడ పరిధిలోనే నిర్వహించబోతున్నాం. పాస్‌పోర్టు సేవాకేంద్రంలోనే ముద్రణ విభాగాన్ని ఏర్పాటు చేశాం. రానున్న రోజుల్లో అధునాతన టెక్నాలజీని ఉపయోగించటం ద్వారా మెరుగైన సేవలు అందించనున్నాం.

-శివహర్ష, విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ అధికారి

ఉద్యాన వర్సిటీ వీసీ జానకిరామ్ నియామకం రద్దు

- యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా సెర్చ్ కమిటీ ఏర్పాటు
- కమిటీలో యూజీసీ చైర్మన్ నామినీని సభ్యుడిగా నియమించలేదు
- ఆ కమిటీ సిఫారసులు చెల్లుబాటు కావన్న హైకోర్టు

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ వీసీగా టి.జానకిరామ్ పునర్నియామకాన్ని హైకోర్టు కొట్టివేసింది. వీసీగా ఆయన నియామకం, పునర్నియామకం రెండూ చట్టవిరుద్ధమేనని ప్రకటించింది. యూజీసీ నిబంధనల ప్రకారం వర్సిటీ వీసీ నియామకం కోసం ఏర్పాటు చేసిన సెర్చ్-సెలక్షన్ కమిటీలో యూజీసీ చైర్మన్ నామినేట్ చేసిన వ్యక్తి సభ్యుడిగా ఉండాలని గుర్తు చేసింది. అందుకు విరుద్ధంగా యూజీసీ చైర్మన్ నామినీ సభ్యుడిగా లేకుండానే సెర్చ్ కమిటీ ఏర్పాటైందని పేర్కొంది. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పడిన సెర్చ్ కమిటీ చేసిన సిఫారసులు కూడా చెల్లుబాటుకావని తేల్చిచెప్పింది. మొదటి నియామకమే చట్టవిరుద్ధంగా జరిగిన నేపథ్యంలో, ఆయన పునర్నియామకం సైతం చెల్లదంటూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు ఇచ్చింది. వీసీగా జానకిరామ్ నియామకాన్ని సవాల్ చేస్తూ పల్నాడుజిల్లా అచ్చమ్మకుంట తండాకు చెందిన మనావత్ దారునాయక్, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ జి.రవిశంకర్ రెడ్డి హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు గొట్టిపాటి కవిత, ఏపీఎస్ లక్ష్మి వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు ముగియడంతో మార్చిలో తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం బుధవారం ఆ తీర్పును వెలువరించింది.

అప్రెంటీస్ విధానం వద్దు: టీఎన్‌యూఎస్

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అప్రెంటీస్ లేకుండా టీచర్ పోస్టులు భర్తీ చేసిందని, గత వైసీపీ సర్కారు దాన్ని మళ్లీ తీసుకొచ్చిందని చెప్పారు.

సూరజ్ రేవణ్ణ కేసులో భారీ ట్విస్ట్

- అప్పుడు శివకుమార్ యూటర్న్.. వెలుగులోకి మరిన్ని చీకటి కోణాలు

బెంగళూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అసహజ లైంగిక దౌర్జన్యం ఆరోపణతో అరెస్టయిన జేడీఎస్ ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ కేసులో భారీ ట్విస్ట్ చోటుచేసుకుంది. నాలుగు రోజుల కిందట సూరజ్ బ్రిగేడ్ కోశాధికారి అంటూ సూరజ్‌కు మద్దతుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన శివకుమార్, ప్రస్తుతం యూటర్న్ తీసుకున్నారు. సూరజ్‌పై ఆరోపణలు చేసిన జేడీఎస్ కార్యకర్తకు వ్యతిరేకంగా శివకుమార్ హొళెనరసీపుర పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సూరజ్ మంచివాడని, ఆయనను రూ.5 కోట్లు ఇవ్వాలని జేడీఎస్ కార్యకర్త బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఈనెల 21న శివకుమార్ ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కనిపించకుండా పోయారు. అనూహ్యంగా మంగళవారం హొళెనరసీపుర పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. సూరజ్ రేవణ్ణ స్వలింగకాముకుడని, మూడేళ్ల కిందట తనపైనా అసహజ లైంగిక దౌర్జన్యం చేశారని ఆరోపించారు. జేడీఎస్ కార్యకర్తకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేయాలని తనపై తీవ్ర ఒత్తిడి చేశారన్నారు.

సూరజ్ చీరకట్టి, గాజులు వేస్తాడు

సూరజ్‌పై ఫిర్యాదు చేసిన జేడీఎస్ కార్యకర్త.. మీడియాకు ఆయన గురించి మరిన్ని విషయాలు తెలిపారు. అమావాస్య రోజున సూరజ్‌రేవణ్ణ చేతులకు గాజులు ధరిస్తారని, చీర కడతారని వివరించారు. ఎన్నికల సందర్భంగా అరకలగూడులో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న సూరజ్, తనను పొగిడారని అన్నారు. ఆ తర్వాత తన ఫోన్ నంబరు తీసుకున్నారని, విజిటింగ్ కార్డు ఇచ్చారని అన్నారు. తరచూ ఫోన్‌లో మాట్లాడేవారని, మెసేజ్‌లతోపాటు లవ్ సింబల్స్ వేసేవారని పేర్కొన్నారు. ఫాంహౌస్‌కు పిలిపించి లైంగిక దౌర్జన్యానికి పాల్పడేవారని ఆరోపించారు. ఓ రోజు ఫాంహౌస్‌కు పిలిపించి అతడి జీవనం గురించి చెప్పారని, తన బతుకు, కుటుంబం గురించి వివరించానని అన్నారు. 'ఏమీ ఆలోచించవద్దు.. అంతా నేను చూసుకుంటా' అన్నారని తెలిపారు. ఆ తర్వాత గదిలోకి తీసుకెళ్లి కాళ్లు నొక్కాలని సూచించారని, అనంతరం ఏం జరిగిందనేది తాను చెప్పలేనని బాధితుడు వాపోయారు. ఈ నెల 16న గన్నికడ ఫాంహౌస్‌కు ఒంటరిగా రావాలని సూచించారని, సాయంత్రం 6.15కు ఫాంహౌస్‌కు వెళ్లగా బెడ్‌రూంకు తీసుకెళ్లి లైంగిక దౌర్జన్యం చేశారని అన్నారు. ఇదే విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

సూక్ష్మసేద్య కంపెనీలకు జగన్ సర్కారు సున్నం

- చివరి రెండేళ్లలో 1,167 కోట్లు బకాయి
- అచ్చెన్న సమీక్షలో వెలుగులోకి
- సన్నకారు రైతులకు అందని రాయితీలు
- 2020-22లో మైక్రో ఇరిగేషన్ జీరో
- జగన్ పాలనలో సూక్ష్మసేద్యానికి గ్రహణం

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో గత ఐదేళ్లలో అడ్డగోలుగా నిధులు దారి మళ్లించి వాడేశారు. బిల్లులు చెల్లించకుండా భారీగా బకాయిలు పెట్టారు. చివరకు రైతులకు సూక్ష్మసేద్యం ద్వారా రాయితీ అందకుండా చేశారు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం సూక్ష్మసేద్య కంపెనీలకు పెట్టిన బకాయిలను తాము చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పుకొన్న జగన్ సర్కార్ చివరి రెండేళ్లలో రూ.1,167 కోట్లు బకాయిలు పెట్టి పోయింది. డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరా కంపెనీలకు సొమ్ము చెల్లించకుండా, రైతులకు రాయితీ వర్తింపజేయకుండా నిర్లక్ష్యం చేసింది. 2019-20లో ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ (ఏపీఎంఐపీ)ను నామమాత్రంగా అమలు చేసింది. 2020-22 మధ్య పూర్తిగా పక్కన పెట్టేసి ఏపీఎంఐపీని జీరో చేసింది. మొన్నటి దాకా బకాయిలేమీ లేవంటూ ఉద్యాన శాఖాధికారులు కూడా చెప్పుకొచ్చారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తాజాగా నిర్వహించిన సమీక్షలో సూక్ష్మసేద్య కంపెనీలకు బకాయిల వ్యవహారం బయటపడింది. 2019-24 మధ్య సూక్ష్మసేద్యానికి రూ.1,984 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం.. ఇందులో రూ.817 కోట్లు మాత్రమే విడుదల చేసింది. 2022-23లో రూ.657.45 కోట్లకు రూ.96.95 కోట్లు మాత్రమే చెల్లించింది. 2023-24లో రూ.606.50కోట్లకు గాను నయాపైసా కూడా ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వ నిధులకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసి సన్న, చిన్నకారు రైతులకు రాయితీ అందకుండా చేసింది. వాస్తవానికి 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2,786 కోట్లతో 5.92 లక్షల మంది రైతులకు 16.45 లక్షల ఎకరాలకు సూక్ష్మసేద్యం ద్వారా లబ్ధి కలిగించారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వంలో రూ.1,984 కోట్లతో 2.61 లక్షల మంది రైతులకు 7.35 లక్షల ఎకరాలకు సూక్ష్మసేద్యం ద్వారా లబ్ధిచేకూర్చామని చెప్పినా.. 2020-22 మధ్య సూక్ష్మసేద్యాన్ని మచ్చుకైనా అమలు చేయలేదు. జగన్ సర్కారు ఓటమికి ఇది కూడా ఓ కారణమని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో సూక్ష్మసేద్యానికి మళ్లీ ప్రాధాన్యం దక్కనుంది. 2024-25లో 2.5 లక్షల ఎకరాలకు రూ.902.56 కోట్లతో సూక్ష్మసేద్యాన్ని విస్తరించాలని ఉద్యాన శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో సూక్ష్మసేద్యానికి అనువైన విస్తీర్ణం 53.12 లక్షల ఎకరాలు ఉండగా, ప్రస్తుతం 37.9 లక్షల ఎకరాలకు 13.49 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. ఇంకా 15.22 లక్షల ఎకరాలు సూక్ష్మసేద్యం కిందకు తీసుకురావాల్సి ఉంది. దేశంలో డ్రిప్ కింద 49%, స్ప్రింక్లర్ల కింద 51% సాగులో ఉండగా, ఏపీలో డ్రిప్ కింద 75%, స్ప్రింక్లర్ల కింద 25% ఉంది.

నేడు కోస్తా, రాయలసీమల్లో వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇంకా కేరళ నుంచి మహారాష్ట్ర తీరం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో ఉత్తర కోస్తాలో రుతుపవనాలు చురుగ్గా మారాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని, కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని వాతావరణశాఖ పేర్కొంది. ఉత్తర కోస్తాలో తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కాగా, బుధవారం పలుచోట్ల తేలిక పాటి నుంచి ఒక మోస్తరుగా, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిశాయి. దక్షిణ కోస్తాలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి.

ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీలో 43% ఉత్తీర్ణత

- 78 శాతం మందికి మార్కులు మెరుగుదల
- మొత్తంగా ఇంటర్ ఫస్టియర్‌లో 80 శాతం పాస్
- 'ఎక్స్' ద్వారా ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 43.3 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బెటర్‌మెంట్ రాసిన వారిలో 78 శాతం మందికి మార్కులు పెరిగాయి. దీంతో మొత్తంగా ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్‌లో 80 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ఇంటర్ విద్యామండలి వెల్లడించింది. ఫస్టియర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ ఫలితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం 'ఎక్స్' (ట్విటర్) ద్వారా విడుదల చేశారు. ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ రెండు కేటగిరీల్లో కలిపి 1,46,750 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 63,548 (43.3 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 2,10,820 మంది బెటర్‌మెంట్ పరీక్షలు రాస్తే 1,64,716 మందికి మార్కులు మెరుగయ్యాయి. సప్లిమెంటరీలో అబ్బాయిలు 41 శాతం, అమ్మాయిలు 46 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు కలిపితే మొత్తంగా ఈ ఏడాది ఫస్టియర్‌లో 79.55 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రశ్నపత్రాల రీవెరిఫికేషన్ కోరుకునే విద్యార్థులు ఈ నెల 28 నుంచి జూలై 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక్కో పేపరుకు రుసుము రూ.వెయ్యి చెల్లించాలని విద్యా మండలి తెలిపింది. సప్లిమెంటరీ ఫలితాల్లో జనరల్ విద్యార్థులు అల్లూరి జిల్లా 67శాతం, నెల్లూరు 55శాతం, పార్వతీపురం మన్యం 53శాతం ఉత్తీర్ణతతో టాప్‌లో నిలిచాయి. కోనసీమ జిల్లా 31శాతం, పశ్చిమ గోదావరి 34శాతం, అనకాపల్లి 34శాతం ఉత్తీర్ణతతో చివరన ఉన్నాయి. ఒకేషనల్ కోర్సుల్లో పార్వతీపురం మన్యం 76శాతం, ఏలూరు 68శాతం, నెల్లూరు 67శాతంతో టాప్‌లో ఉన్నాయి. కడప 33శాతం, కోనసీమ 38శాతం, కర్నూలు 39శాతంతో లాస్ట్‌లో మిగిలాయి.

టెన్త్ సప్లిమెంటరీలో 62 శాతం పాస్

- ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో 62.21 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం విడుదల చేశారు. 1,07,883 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 67,115 (62.21శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో అబ్బాయిలు 59.99శాతం, అమ్మాయిలు 65.96శాతం ఉన్నారు. 96.15 శాతం ఉత్తీర్ణతతో ప్రకాశం జిల్లా టాప్‌లో నిలవగా.. 30.6 శాతంతో కర్నూలు జిల్లా చివరన ఉంది. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం విద్యార్థులు నేటి నుంచి జూలై 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం తెలిపింది.



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

గంజాయి మాఫియాపై ఉక్కుపాదం!

- 100 రోజుల ప్రణాళిక రూపొందిస్తున్నాం: డీజీపీ

విజయవాడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గంజాయి మాఫియాను ఉక్కుపాదాలతో తొక్కేస్తామని డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు స్పష్టంచేశారు. గంజాయి వాసన రాకుండా, వినియోగం లేకుండా చేయడానికి 100 రోజుల ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. డీజీపీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఇప్పుడు రాష్ట్రానికి గంజాయి ఒక పెద్ద సవాలుగా మారిందని డీజీపీ చెప్పారు. మావోయిస్టులను, ఎర్రచందనం దొంగలను అరికట్టిన పోలీసు శాఖ గంజాయి సమస్యను కచ్చితంగా అరికడుతుందన్నారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించడానికి 100 రోజుల ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారన్నారు. గంజాయి ఎక్కువగా విశాఖ ఏజెన్సీ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని శివారు ప్రాంతాల్లో సాగవుతోందని తెలిపారు. గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి రెండు అంశాలను ప్రధానంగా గుర్తించామని, ముందుగా గంజాయి రవాణా, సాగుకు బ్రేకులు వేయాల్సి ఉందని చెప్పారు. కొంతమంది అమాయక ప్రజలు గంజాయి సాగును ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారని, వారికి ప్రత్యామ్నాయ పంటలను చూపించాల్సి ఉందని చెప్పారు. పొరుగున ఉన్న ఒడిసా పోలీసులతో కలిసి గంజాయిని నామరూపాలు లేకుండా చేస్తామన్నారు. అవసరమైతే కేంద్ర ఏజెన్సీల సహకారం తీసుకుంటామని చెప్పారు. గంజాయి స్మగ్లర్లకు, రవాణాదారులకు న్యాయస్థానాల్లో శిక్షలు పడేలా చేయడంలో కొన్ని లోపాలున్నాయని, వాటిని త్వరలోనే సరిచేస్తామని తెలిపారు. కోర్టుకు అవసరమైన అన్ని సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలను ఫోరెన్సిక్ ల్యాబ్ ద్వారా అందజేయాల్సి ఉంటుందని, దేశంలో రాష్ట్ర ఎఫ్ఎస్ఎల్‌కు మంచికీర్తి ఉందన్నారు. త్వరలో ఎఫ్ఎస్ఎల్‌ను మరింత బలోపేతం చేస్తామని వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ, మానసిక వైద్య నిపుణుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేటేస్తారా.. వేచి చూస్తారా...!?

- ఉన్నత విద్యామండలిలో వైస్ చైర్మన్ల పెత్తనం
- వైసీపీతో అంటకాగిన ఇద్దరు అధికారులు

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఉన్నత విద్యామండలిలో వైసీపీతో అంటకాగిన ఇద్దరు వైస్ చైర్మన్లపై వేటు వేస్తారా.. వేచిచూస్తారా..!? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి రాజీనామా చేశారు. వైస్ చైర్మన్లుగా ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన కె.రామ్మోహన్‌రావు, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన ఉమామహేశ్వరి ఉన్నారు. వీరిలో రామ్మోహన్‌రావుకు మరో ఏడాది, ఉమామహేశ్వరికి రెండేళ్ల పదవీకాలం ఉంది. రామ్మోహన్‌రావు.. హేమచంద్రారెడ్డితో కలిసి యూనివర్సిటీలు, కాలేజీలపై పెత్తనం చేశారు. పూర్తిగా వైసీపీ అనుకూల ప్రొఫెసర్ కావడంతో రెండోసారీ ఆయన పదవీకాలాన్ని పొడిగించారు. డిగ్రీలో సంస్కరణల పేరుతో నాలుగేళ్ల డిగ్రీ, సింగిల్ మేజర్ డిగ్రీలకు ఆయనే రూపకల్పన చేశారు. దీంతో 2023-24లో సింగిల్ మేజర్ డిగ్రీతో విద్యార్థులు చాలా ఇబ్బందిపడ్డారు. అలాగే ఆన్‌లైన్ ఇన్‌టర్న్‌షిప్‌లు అంటూ అనేక కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని భారీగా నగదు చెల్లించారు. ఆన్‌లైన్ ఇన్‌టర్న్‌షిప్‌లు లక్షల మంది విద్యార్థులు చేసినట్టు భారీ అంకెలు చూపించారు. చివరికి ఎన్నికల ఫలితాల రోజు హేమచంద్రారెడ్డి కొన్ని కీలక ఫైళ్లు ధ్వంసం చేయగా, దానికి రామ్మోహన్‌రావు సహకరించినట్లు తెలిసింది. ఆ స్థాయిలో వైసీపీతో అంటకాగిన వీరే ఉన్నత విద్యామండలిలో మళ్లీ చక్రం తిప్పుతున్నారు. అందువల్ల వైస్ చైర్మన్లను సాగనంపాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. కానీ వారికి ఇంకా గడువు ఉన్నందున ప్రభుత్వం వేచిచూసే ధోరణి ప్రదర్శిస్తోంది.

మనమంతా ఒక్కటే!

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటు చర్చల్లో పాల్గొనాలని హితవు పలికారు. ఎంపీలందరూ ఐక్యమత్యంతో కలిసిమెలసి ఉండాలని ఆకాంక్షించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చారని తెలుసుకుని అభినందించారు. కుటుంబ నేపథ్యం గురించి ఆరాతీశారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ప్రాతినిధ్యం వహించిన విజయనగరం నుంచి ఆయన ఎన్నికయ్యారని తెలుసుకుని.. అశోక్ ఆరోగ్యం గురించి రామ్మోహన్‌నాయుడిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానిని టీడీపీ ఎంపీలు సన్మానించారు. రామ్మోహన్ ఆయనకు తిరుమల శ్రీవేంకటేశ్వరుడి విగ్రహాన్ని బహూకరించారు.

బాబు నేతృత్వంలో 2 పార్టీలు కలిసి పనిచేస్తున్నాయ్

భారతదేశ పురోగతికి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ప్రధాని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ, టీడీపీ కలిసి పనిచేస్తున్నాయని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ ట్వీట్‌కు చంద్రబాబు ఎక్స్‌లో స్పందించారు. ఎన్డీయే ఎంపీలు లోక్‌సభలో వికసిత్ ఆంధ్రప్రదేశ్, వికసిత్ భారత్ కోసం కృషి చేస్తారన్నారు.

నా నియోజకవర్గానికి ఎయిర్‌పోర్టు కావాలి: స్పీకర్

అంతకుముందు.. లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాను టీడీపీ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు బాలాజీ విగ్రహాన్ని ఆయనకు బహూకరించారు. టీడీపీ నుంచి 16 మంది సభ్యులు లోక్‌సభకు ఎంపికయ్యారని, తమకు సభలో తగినంత సమయం ఇవ్వాలని కోరారు. బదులుగా స్పీకర్ నవ్వుతూ.. తన నియోజకవర్గ కేంద్రం కోటా (రాజస్థాన్)కు ఎయిరుపోర్టు కావాలన్నారు. పరిశీలిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

- రాజస్థాన్‌లోని బన్స్వారా నియోజకవర్గం నుంచి గెలిచి లోక్‌సభ సమావేశాల తొలిరోజున ఒంటెపై వచ్చిన ఎంపీ రాజ్‌కుమార్ రౌత్.. అదే రోజు సైకిల్‌పై పార్లమెంటుకు వచ్చిన ఎంపీ కలిశెట్టి పార్లమెంటు లాబీలో పరస్పరం ఎదురయ్యారు. వారు సరదాగా మాట్లాడుకోవడం అందరినీ ఆకర్షించింది.
- బుధవారం లోక్‌సభ ప్రారంభానికి ముందు 50-అశోకా రోడ్‌లో రాష్ట్ర టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీలు సుమారు అరగంట పాటు భేటీ అయ్యారు. స్పీకర్ ఎన్నికపై చర్చించారు.

లోక్‌సభ సజావుగా జరిగేందుకు టీడీపీ మద్దతు

» స్పీకర్‌కు తెలిపిన పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు

» ఓం బిర్లాకు వైసీపీ, జనసేన అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాబోయే ఐదేళ్లలో లోక్‌సభ సజావుగా జరగడానికి తెలుగుదేశం పార్టీ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు స్పీకర్ ఓంబిర్లాకు తెలిపారు. లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఎన్నికైన ఓం బిర్లాకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ ఎంపీల తరఫున ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం లోక్‌సభలో స్పీకర్ ఎన్నిక అనంతరం లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో లోక్‌సభ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించారని స్పీకర్‌ను కొనియాడారు. రెండోసారి లోక్‌సభ స్పీకర్‌గా ఇప్పటి వరకు ఐదుగురు ఎన్నికవగా.. వారిలో ఇద్దరు ఆంధ్రులు ఉన్నారని తెలిపారు. నీలం సంజీవరెడ్డి, జీఎంసీ బాలయోగి ఏపీ నుంచి రెండు సార్లు స్పీకర్ అయినప్పటికీ పూర్తికాలం పదవిలో లేరన్నారు. 'మీకు రెండోసారి కూడా ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసేందుకు సమయం ఉంటుంది. మీరు స్పీకర్‌గా ఉన్న సమయంలోనే పార్లమెంటు సమావేశాలు పాత భవనం నుంచి కొత్త భవనానికి మారడం, ఆర్టికల్ 370 రద్దు, నారీశక్తి వందన్, ట్రిపుల్ తలాక్ బిల్లులు వచ్చాయి' అని కొనియాడారు. వైసీపీ లోక్‌సభ పక్షనేత మిథున్‌రెడ్డి మాట్లాడుతూ స్పీకర్ ఓం బిర్లాకు అభినందనలు తెలిపారు. గత లోక్‌సభ సమావేశాలను హుందాగా నడిపారని, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టారని, కొత్తగా ఎన్నికైన సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించారని కొనియాడారు. అదే తరహాలో నూతన లోక్‌సభ సమావేశాలను విజయవంతంగా నడపాలని ఆకాంక్షించారు. జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ.. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ తరఫున స్పీకర్‌కు అభినందనలు తెలిపారు. తాను లోక్‌సభకు మూడో సారి ఎంపీ అవడానికి కారణం పవన్‌కల్యాణేనని బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు.

స్పీకర్ ఓం బిర్లా

(మొదటి పేజీ తరువాయి)

ఓం బిర్లా గుర్తింపు పొందారు. బుధవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమయ్యాక.. ఓంబిర్లా పేరును ప్రతిపాదిస్తూ ప్రధాని మోదీ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తోపాటు.. కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, టీడీపీపీనేత లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు ఎన్డీయే ఎంపీలు ఈ తీర్మానాన్ని బలపరిచారు. ఇండియా కూటమి తరఫున కె.సురేశ్ పేరును ప్రతిపాదిస్తూ శివసేన(ఉద్ధవ్ వర్గం) ఎంపీ అరవింద్ సావంత్ తీర్మానాన్ని తీసుకురాగా.. విపక్ష కూటమి ఎంపీలు బలపరిచారు. అనంతరం మూజువాణి ఓటుతో ఓం బిర్లా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్రకటించారు. ఆ వెంటనే ప్రధాని మోదీ లేచి.. ఓం బిర్లా వద్దకు వెళ్లి, ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ఓం బిర్లా వద్దకు వెళ్తుండగా.. మోదీ ఆయనను రమ్మంటూ ఆహ్వానించారు. వీరిద్దరూ కలిసి ఓం బిర్లాకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మోదీ, రాహుల్ కరచాలనం చేసుకున్నారు. ఆ తర్వాత పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు వీరిద్దరితో కలిసి ఓం బిర్లాను స్పీకర్ స్థానం వద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఓం బిర్లా మాట్లాడుతూ సభలో సంప్రదాయాలు, విలువలను కాపాడతానన్నారు. సభలో భిన్నాభిప్రాయాలు, విమర్శలు ఉండొచ్చని, అయితే.. లోక్‌సభ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకాలను ఏర్పరచకూడదని కోరారు. సభను అడ్డంకులు లేకుండా నడపాలన్నదే తన అభిమతమన్నారు. ప్రతిపక్షాలు ఇచ్చే నిర్మాణాత్మక సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఒక పార్టీ నుంచి ఒకేఒక్క సభ్యుడున్నా.. అతనికి కూడా మాట్లాడే సమయం దక్కాలి. ప్రతి ఒక్కరూ పార్లమెంటరీ సంప్రదాయాలను పాటించాలి. అలా జరగని పక్షంలో.. కొన్నిసార్లు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. నేనెప్పుడూ ఏ సభ్యుడికి వ్యతిరేకంగా ప్రవర్తించాలని కోరుకోను" అని స్పష్టం చేశారు. అనంతరం లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నియామకాన్ని ఆమోదిస్తూ పార్లమెంట్ వ్యవహారాల శాఖ అధికారిక ప్రకటనను విడుదల చేసింది. పార్లమెంట్ చట్టం-1977 ప్రకారం ఆయనకు అన్ని రకాల వసతులను కల్పించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.

ప్రధాని మోదీ ప్రశంసలు

ఓం బిర్లా రెండోసారి స్పీకర్‌గా ఎన్నికవ్వడంతో ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. "మీ చిరునవ్వుతో సభలో ఆనందం వెల్లివిరుస్తుంది. మీ చిరునవ్వు సభను ఎల్లప్పుడూ సంతోషకర వాతావరణంలో ఉంచుతుంది. కొన్ని దశాబ్దాలుగా సభాపతిగా పనిచేసిన వారంతా ఎటువంటి పోటీని ఎదుర్కోలేదు. కానీ మీరు ఎన్నికల్లో గెలిచి, చరిత్ర సృష్టించారు. చరిత్రలోనే స్వర్ణయుగానికి మీరు నేతృత్వం వహిస్తున్నారు. కొత్తగా లోక్‌సభకు ఎన్నికైన వారికి మీ పనితీరు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. "గత ఐదేళ్లలో స్పీకర్‌గా మీ హయాంలో సభ 97% ఉత్పాదకతను సాధించింది. పాతికేళ్లలోనే ఇది అత్యధికం. ఇది ఒక భవనం.. నాలుగు గోడలే కాదు. 140 కోట్ల ప్రజల ఆశాకిరణం. వచ్చే ఐదేళ్లు మీరు సభ్యులందరికీ మార్గదర్శనం చేస్తారని విశ్వసిస్తున్నాను" అని మోదీ అన్నారు.

విపక్షాలకు అవకాశం ఇవ్వాలన్న రాహుల్

ప్రజావాణిని బలంగా వినిపించేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పీకర్‌ను కోరారు. ఓం బిర్లాకు ఇండియా కూటమి తరఫున శుభాకాంక్షలు చెప్పారు. లోక్‌సభ భారతదేశ ప్రజల స్వరాన్ని వినిపించాలని ఆకాంక్షించారు. "ప్రభుత్వానికి రాజకీయంగా బలం ఉండొచ్చు. విపక్షాలు ప్రజావాణికి ప్రాతినిధ్యం వహిస్తాయి. సభ సజావుగా సాగడానికి ప్రతిపక్షం సహకరిస్తుంది. గతంతో పోలిస్తే.. ఈ సారి మంచి వాతావరణంలో సభ నడుస్తుందని ఆశిస్తున్నాను. సభను ఎంత సమర్థంగా నడుపుతున్నామనేది ముఖ్యం కాదు. ఈ సభలో దేశ ప్రజల స్వరాన్ని ఎంతవరకు వినిపించేందుకు అవకాశం ఇస్తున్నామనేది ముఖ్యం. ప్రజా సమస్యలను బలంగా వినిపించేందుకు విపక్షాలకు అవకాశం ఇస్తారని ఆశిస్తున్నాను" అని రాహుల్ వ్యాఖ్యానించారు.



ఎన్నిక అనంతరం ఓం బిర్లాను ఆసనం వద్దకు తీసుకెళ్తున్న సందర్భంగా మోదీ-రాహుల్ కరచాలనం

నేడు రాష్ట్రపతి ప్రసంగం

న్యూఢిల్లీ, జూన్ 26: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. గత సోమవారం లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. గురువారం రాజ్యసభ 264వ సెషన్ ప్రారంభం కానుంది. గురువారం రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ముర్ము పార్లమెంట్‌కు చేరుకుంటారు. పార్లమెంట్ బిల్డింగ్ గజ ద్వారం వద్ద ఆమెకు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు లోక్‌సభ, రాజ్యసభల ప్రిసైడింగ్ అధికారులు స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి ఆమెను సాంప్రదాయ రాజదండం 'సెంగోల్'తో లోక్‌సభ చాంబర్‌కు తీసుకువెళతారు. కాగా, జూలై 2-3 తేదీల్లో ప్రధాని మోదీ.. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మాణంపై చర్చ సందర్భంగా మాట్లాడే అవకాశం ఉంది.

తొలిరోజే సభలో గందరగోళం

న్యూఢిల్లీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్పీకర్ ఓం బిర్లా బుధవారం సభనుద్దేశించి మాట్లాడుతూ.. దేశంలో ఎమర్జెన్సీ రోజులను గురించి ప్రస్తావించడంతో.. తొలిరోజే లోక్‌సభలో గందరగోళం నెలకొంది. సభ తీర్మానమని చెబుతూ ఆయన ఎమర్జెన్సీని ఖండించారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నిర్ణయాన్ని రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. "దేశంలో ఎమర్జెన్సీ విధించి.. 50వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా ఆ చర్యను నేను ఖండిస్తున్నాను. 1975లో ఇదే రోజు(జూన్ 26) ఎమర్జెన్సీ విధించడాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తోంది. ఆ రోజు దేశ చరిత్రలోనే ఓ చీకటి అధ్యాయంగా నిలిచిపోయింది" అని ఓం బిర్లా వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన వారికి అభినందిస్తున్నానని, వారు తమ పోరాటంతో భారత రాజ్యాంగాన్ని కాపాడారని పేర్కొన్నారు. సభ్యులు




పార్లమెంటు వెలుపల ఎన్డీయే నేతల నిరసన

అంతా రెండు నిమిషాలు మౌనం పాటించాలని సూచిస్తూ.. సభను గురువారానికి వాయిదా వేశారు. కాగా.. స్పీకర్ ఎమర్జెన్సీ ప్రకటనపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీని స్పీకర్ తీవ్రంగా ఖండించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అప్పట్లో జరిగిన చీకటి అధ్యాయాన్ని ఎత్తి చూపడాన్ని అభినందిస్తూ.. నేటి యువత ఎమర్జెన్సీ రోజుల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యమని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

విపక్ష.. అధికార పక్ష నిరసనలు

స్పీకర్ ఓం బిర్లా ఎమర్జెన్సీపై మాట్లాడడాన్ని లోక్‌సభలో విపక్ష నేతలు ఖండించారు. తమతమ స్థానాల్లోంచి లేచి నిలబడి నిరసన వ్యక్తం చేశారు. స్పీకర్ మాట్లాడుతున్న సమయంలోనే అభ్యంతరం చెబుతూ నినదించారు. "నియంతృత్వాన్ని ఆపండి" అని నినాదాలిచ్చారు. సభ వాయిదా పడ్డాక.. కేంద్ర మంత్రులు, ఎన్డీయే ఎంపీలు లోక్‌సభ వెలుపల ఆందోళన చేపట్టారు. "ఎమర్జెన్సీపై కాంగ్రెస్ సిగ్గుపడాలి".. "ఎమర్జెన్సీ విధించినందుకు క్షమాపణలు చెప్పాలి".. అని హిందీలో రాసిన ప్లకార్డులను ప్రదర్శించారు. "రాజ్యాంగ ప్రతులను చేతుల్లో పట్టుకున్న వాళ్లు అద్దంలో ఒకసారి చూసుకోవాలి. రాజ్యాంగాన్ని మార్చాలని చూసింది ఎవరో తెలుస్తుంది" అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్రా వ్యాఖ్యానించారు.

లోకం తీరు



కదలరు.. మెదలరు

సగం మంది భారతీయులు వ్యాయామం చేయట్లేదు: డబ్ల్యూహెచ్‌వో

న్యూఢిల్లీ, జూన్ 26: భారత్‌లోని పెద్దల్లో దాదాపు సగం మంది అవసరమైన మేరకు శారీరక శ్రమ చేయడం లేదట! నడక, వ్యాయామం లాంటివేమీ చేయరట! 2000 సంవత్సరంలో ఇలాంటి వారి సంఖ్య 22.3 శాతం ఉండగా.. 2022 నాటికి 49.4 శాతానికి పెరిగిపోయింది! ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ అధ్యయనం 'లాన్సెట్ గ్లోబల్ హెల్త్'లో ప్రచురితమైంది. కనీస వ్యాయామం చేయని వారిలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉండడం మరో విశేషం. 2022 నాటికి శరీరానికి అవసరమైనంతగా వ్యాయామం చేయని పురుషులు 42% ఉంటే మహిళలు ఏకంగా 57.2% ఉన్నారు. ఇది ఇలాగే కొనసాగితే 2030కి దేశంలోని పెద్దల జనాభాలో 60 శాతానికి పైగా శారీరకంగా నిర్వ్యలురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. శారీరక శ్రమ లేకపోవడం వల్ల గుండె జబ్బులు, టైప్2 మధుమేహం, మతిమరుపు, క్యాన్సర్ల వంటి వ్యాధుల బారిన పడే ముప్పు ఉందని తెలిపింది. పెద్దలు వారానికి కనీసం 150 నుంచి 300 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని సూచించింది. కఠినమైన వ్యాయామం అయితే వారానికి 75 నుంచి 150 నిమిషాలు చేయాలని పేర్కొంది. ఇక ప్రపంచంలోని 195 దేశాల్లో సరిపడినంత వ్యాయామం చేయని దేశాల జాబితాలో భారత్ 12వ స్థానంలో ఉంది. 2022లో ప్రపంచవ్యాప్తంగా 180 కోట్ల మంది వైద్యుల సిఫారసు మేరకు వ్యాయామం చేయడం లేదు. శారీరక శ్రమ లేకపోవడం అనేది ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు పెను ముప్పు అని, ప్రజలు తీవ్రమైన జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంటుందని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ (హెల్త్ ప్రమోషన్) క్రైచ్ తెలిపారు. శారీరక శ్రమ లేని వారిలో అంతర్జాతీయంగానూ పురుషుల (29%) కంటే మహిళలే (34%) ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

అమెరికాలో వాహనానికి 'వై నాట్ 11'

» సోషల్ మీడియాలో నంబర్ ప్లేట్ చక్కర్లు



అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఘోర ఓటమిపాలైన వైసీపీని, ఆ పార్టీ అధినేత జగన్‌ను.. సోషల్ మీడియాలో ట్రోలర్లు ఓ ఆట ఆడేసుకుంటున్నారు. ఏపీలోనే కాదు.. అమెరికాలో కూడా వైసీపీ కామెడీ పీస్ అయిపోయింది. తాజాగా సోషల్ మీడియాలో వైరలవుతున్న 'వై నాట్ 11' (Y NOT11) అనే అక్షరాలతో ఉన్న వాహన నంబర్ ప్లేట్.. జగన్ పరువుని అమెరికాలో తీసేసింది. అక్కడి ఓ ఎన్ఆర్ఐ తన కారుకు ఈ నంబర్ ప్లేట్‌ను తీసుకున్నారు. అమెరికాలో వ్యక్తిగత నంబర్ ప్లేట్ తీసుకునే సౌలభ్యం ఉంటుంది. వాహన యజమానులు తమకు కావాల్సిన అక్షరాలతో పాటు నంబర్‌ను కూడా ఎంపిక చేసుకోవచ్చు. వాటిని 'వానిటీ ప్లేట్లు'గా పిలుస్తారు. ఈ నేపథ్యంలో ఓహియో రాష్ట్రంలో ఉంటున్న ఓ తెలుగు ఎన్ఆర్ఐ 'వై నాట్ 11' అనే నంబర్ ప్లేట్ తీసుకున్నారు.

రోడ్లు బాగా లేకపోతే టోల్ వసూలు చేయొద్దు

» కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జూన్ 26: కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏ మాత్రం బాగాలేని, అధ్వాన్నంగా ఉన్న హైవేలపై టోల్ సంస్థలు ఫీజు వసూలు చేయవద్దన్నారు. ఉపగ్రహ సమాచారం ఆధారంగా టోల్ ఫీజును లెక్కించి వసూలు చేసే వ్యవస్థకు సంబంధించిన ఓ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మీరు మంచి రోడ్లు వేయలేకపోతే టోల్ ఫీజును కూడా వసూలు చేయకండి. గుంతలు పడి, బురదతో కూడిన రోడ్లకు కూడా టోల్ ఫీజు వసూలు చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది" అని చెప్పారు. కాగా, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) టోల్ ఫీజు వసూలు కోసం గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌ను తీసుకురావడానికి ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 5వేల కిలోమీటర్లలో దీన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ వ్యవస్థను తొలుత వాణిజ్య వాహనాలకు, తర్వాత ప్రైవేటు వాహనాలకు విస్తరించనున్నారు. హైవేపై వాహనం ఎంతదూరం ప్రయాణించిందనేది నావిగేషన్ సాయంతో గుర్తించి ఆ మేరకు వాహనదారుల బ్యాంకు ఖాతా నుంచి టోల్ ఫీజు వసూలు అయ్యేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నారు. అయితే, ఎల్లప్పుడూ వాహనంపై నిఘా ఉండటంతో దీనిపై గోప్యతాపరమైన ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

నేడు రామోజీ సంస్మరణ సభ

» విజయవాడలోని పెనమలూరులో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహణ

» హాజరుకానున్న సీఎం చంద్రబాబు

పెనమలూరు, జూన్ 26: రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్, దివంగత చెరుకూరి రామోజీరావు సంస్మరణ సభను రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సహా పలువురు మంత్రులు హాజరుకానున్నారు. విజయవాడ సమీపంలోని పెనమలూరు మండలంలోని తాడిగడపలో ఉన్న అనుమోలు గ్రౌండ్స్‌లో నిర్వహించే ఈ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ సహా సంస్మరణ సభ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తదితరులు బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి వేదిక ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యం వంటివాటిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యమంత్రి సహా ఇతర మంత్రులు, పలు రంగాలకు చెందిన ప్రముఖులు కూడా వస్తున్న నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేసినట్టు తెలిపారు. రామోజీరావు కుటుంబసభ్యులు, పలువురు సినీనటులు, రాజకీయ ప్రముఖులు, పాత్రికేయులు హాజరుకానున్నట్టు చెప్పారు. వీవీఐపీలకు ఏ-1 గ్యాలరీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీరికి పక్కనే ఉన్న ఏ-1 పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. పార్లమెంటు, శాసనసభ సభ్యులకు స్థానిక శ్రీచైతన్య కళాశాలలో పార్కింగ్ సదుపాయం కల్పించామని తెలిపారు. మీడియాకు బీ-1 గ్యాలరీ ఏర్పాటు చేశామన్నారు. వాహనాల పాసులు లేని వారు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో పార్కు చేసుకోవాలని సూచించారు. సాధారణ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

పేపర్ లీక్ చేస్తే రూ.కోటి జరిమానా

» రెండేళ్ల నుంచి యావజ్జీవం దాకా జైలు

» యూపీ సర్కార్ ఆర్డినెన్స్

లఖ్‌నవూ, ముంబై, జూన్ 26: పోటీ/ప్రవేశ పరీక్ష పేపర్ల లీకేజీలకు పాల్పడేవారికి యావజ్జీవ ఖైదు, రూ.కోటి ఫైన్ వంటి కఠిన శిక్షలు విధించేలా ఉత్తరప్రదేశ్‌లోని యోగి సర్కారు ఒక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. 'ఉత్తరప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్)' పేరిట జారీ చేసిన ఈ ఆర్డినెన్స్‌లో పేర్కొన్న నేరాలకు పాల్పడ్డవారికి బెయిల్ రావడం కూడా చాలా కష్టమే. కారాగారవాసం, జరిమానాలతోనే సరిపెట్టకుండా.. పేపర్ లీక్ కేసుల్లో భాగస్వాములైనవారి ఆస్తులను సైతం జప్తు చేసే ప్రొవిజన్‌నూ ఈ ఆర్డినెన్స్‌లో పొందుపరిచారు. పేపర్ లీక్ కారణంగా పరీక్ష రద్దయితే.. దానివల్ల పడే ఆర్థిక భారాన్ని దోషుల నుంచే వసూలు చేస్తామని యూపీ సర్కారు స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పాలుపంచుకునే సంస్థలు, సర్వీస్ ప్రొవైడర్లు లీకేజీలో భాగమైతే.. వాటిని శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని పేర్కొంది. ఇక.. మహారాష్ట్రలో నీట్ లీక్ కేసులో అరెస్టయిన ఇద్దరు టీచర్లు.. ఈ పరీక్షలో అభ్యర్థులను పాస్ చేయించేందుకు ఒక్కొక్కరి వద్ద రూ.5 లక్షలు తీసుకున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది.

సీబీఐ కస్టడీకి కేజ్రీవాల్

» 3 రోజులకు ప్రత్యేక కోర్టు అనుమతి

» దేశంలో ఎమర్జెన్సీ : సునీతా కేజ్రీవాల్

న్యూఢిల్లీ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను మూడు రోజుల సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ ప్రత్యేక న్యాయస్థానం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. అంతకుముందు, తిహాడ్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను కేసు విచారిస్తున్న ప్రత్యేకకోర్టు ఎదుట హాజరుపర్చినప్పుడు.. న్యాయాధికారి అమితాబ్ రావత్ అనుమతి మేరకు సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. మద్యం కుంభకోణంలో ప్రశ్నించటానికి వీలుగా కేజ్రీవాల్‌ను తమకు అయిదు రోజుల కస్టడీకి అప్పగించాలని సీబీఐ విజ్ఞప్తి చేసింది. దీనిపై తొలుత తీర్పును రిజర్వు చేసిన అమితాబ్ రావత్.. మూడు రోజుల కస్టడీకి అప్పగిస్తూ నిర్ణయాన్ని వెలువరించారు. తదుపరి విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేశారు. కాగా, కోర్టులో విచారణ సందర్భంగా కేజ్రీవాల్ తన వాదనలను స్వయంగా వినిపించారు. 'మొత్తం తప్పంతా మనీష్ సిసోడియాదేనని నేను ఒక ప్రకటన చేశానంటూ సీబీఐ వర్గాలను ఉటంకిస్తూ మీడియాలో వార్తలు వస్తున్నాయి. నేను అటువంటి ప్రకటన ఎన్నడూ చేయలేదు. సిసోడియా, ఆమ్‌ఆద్మీపార్టీ, నేను నిర్దోషులం. ఇదంతా మా ప్రతిష్ఠను దెబ్బతీయటానికి మీడియా వేదికగా సీబీఐ చేస్తున్న కుట్ర' అని తెలిపారు. దీనికి సీబీఐ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. తాము వాస్తవాల ఆధారంగానే వాదనలు వినిపిస్తున్నామని, మీడియాతో సీబీఐ వర్గాలు ఎవరూ మాట్లాడలేదని చెప్పారు. 'ఈ కేసులో సహనిందితుడైన విజయ్ నాయర్ తన కింద పని చేశాడన్న సంగతిని కూడా కేజ్రీవాల్ అంగీకరించటం లేదు. అతిషీ మర్లేనా, సౌరభ్ భరద్వాజ్‌ల కింద నాయర్ పని చేశాడని చెబుతున్నారు. మొత్తం తప్పంతా మనీశ్ సిసోడియాదేనని అంటున్నారు. అందువల్ల, కేసుకు సంబంధించిన పత్రాలను ఆయన ముందుపెట్టి ప్రశ్నించాల్సి ఉంది. ఈ మేరకు సీబీఐ కస్టడీకి అప్పగించాలి' అని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, కేజ్రీవాల్ తరఫు న్యాయవాది సీబీఐ అభియోగాలను తప్పుబడుతూ, వారి రిమాండ్ అప్లికేషన్ పూర్తి అస్పష్టంగా ఉందని, ఇది అధికార దుర్వినియోగానికి ఒక మచ్చుతునక అని పేర్కొన్నారు.



బుధవారం రౌజ్ అవెన్యూ కోర్టులో కేజ్రీవాల్

సుప్రీంకోర్టు నుంచి పిటిషన్ ఉపసంహరణ

మద్యం కేసులో విచారణ కోర్టు తనకు ఇచ్చిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించటాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ కొనసాగించినప్పుడు.. ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకోవటానికి కేజ్రీవాల్ అనుమతి కోరారు. బెయిల్‌పై స్టే విధిస్తూ హైకోర్టు మంగళవారం తీర్పు ఇవ్వటం, మరోవైపు, ఇదే కేసులో సీబీఐ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయటం వంటి తాజా పరిణామాల దృష్ట్యా.. పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని, పూర్తి వివరాలతో తర్వాత అప్పీల్ దాఖలు చేస్తామని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి తెలిపారు. దీనికి న్యాయమూర్తులు అంగీకరించారు. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. జైలు నుంచి తన భర్త బయటకు రాకుండా వ్యవస్థలన్నీ కట్టగట్టుకొని పని చేస్తున్నాయని, దేశంలో చట్టబద్ధపాలన లేదని, నియంతృత్వం, ఎమర్జెన్సీ నడుస్తోందని కేజ్రీవాల్ భార్య సునీత ఆవేదన వ్యక్తం చేశారు.

వికీలీక్స్ అసాంజేకు విముక్తి

» విడుదల చేసిన అమెరికా కోర్టు

కాన్‌బెర్రా, జూన్ 26: రహస్యాల వెల్లడి కేసులో అరెస్టయిన వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే (52)కు ఎట్టకేలకు విముక్తి లభించింది. ఆయనను విడిచిపెట్టాలని అమెరికా కోర్టు ఒకటి ఆదేశించడంతో బుధవారం స్వదేశమైన ఆస్ట్రేలియాకు చేరుకున్నారు. అమెరికా న్యాయశాఖతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఆయన కేసు నుంచి బయటపడ్డారు. అమెరికా ప్రధాన భూభాగంలోని కోర్టుల్లో విచారణ జరిగేందుకు ఆయన ఇష్టపడకపోవడంతో అమెరికా కామన్‌వెల్త్ ప్రాంతమైన నార్తరన్ మారియానా ద్వీపంలోని సైపాన్‌లో ఉన్న యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో విచారణ జరిగింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న ఈ దీవి ఆస్ట్రేలియాకు సమీపంలో ఉండడం గమనార్హం. అమెరికా రక్షణ శాఖకు చెందిన రహస్య పత్రాలను బహిర్గతం చేశారన్న ఆరోపణలు అసాంజేపై ఉన్నాయి. 2006లో స్థాపించిన వికీలీక్స్ సంస్థ ద్వారా వీటిని బహిర్గతం చేశారు. ఇరాక్, అఫ్గానిస్థాన్‌ల్లో అమెరికా సైన్యం చేసిన అక్రమాలతోపాటు వివిధ అంశాలపై ఆయన దాదాపు కోటి పత్రాలను వెలుగులోకి తెచ్చారు. ఈ పత్రాల కారణంగానే అమెరికా మిలటరీ అకృత్యాలు ప్రపంచానికి తెలిశాయి. అసాంజే చర్యలను పత్రికా స్వేచ్ఛను ఆకాంక్షించేవారు స్వాగతించినా అమెరికా ప్రభుత్వం మాత్రం తీవ్రంగా పరిగణించింది. దాంతో అమెరికా నుంచి లండన్‌కు పరారై అక్కడి ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో తలదాచుకున్నారు. చివరకు అయిదేళ్ల పాటు లండన్ జైలులో శిక్షను అనుభవించారు. గత వారం రహస్య విచారణ జరిపిన అక్కడి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాంతో సోమవారం ఆయన లండన్ జైలు నుంచి విడుదలయ్యారు. లండన్ నుంచి వచ్చిన తరువాత అమెరికా కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశాన్ని పొందారు. అమెరికా న్యాయవిభాగంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం అసాంజే.. కోర్టులో తన నేరాన్ని అంగీకరించారు. గూఢచర్య చట్టానికి విరుద్ధంగా జాతీయ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పొందడం, ప్రచురించడం వంటి నేరాలకు పాల్పడినట్లు ప్రకటించారు. సుమారు మూడు గంటల పాటు వాదనలు విన్న జడ్జి రమోనా వి మంగ్లోనా ఈ నేర అంగీకారాన్ని ఆమోదించారు. లండన్ జైలులో గడిపిన కాలాన్ని శిక్షగా పరిగణిస్తూ ఆయనను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంకా అదనపు శిక్ష అవసరం లేదని తెలిపారు. అనంతరం అసాంజే ప్రత్యేక విమానంలో అమెరికా, బ్రిటన్‌ల్లోని ఆస్ట్రేలియా రాయబారులతో కలిసి కాన్‌బెర్రా చేరుకున్నారు.



కాన్‌బెర్రాలో అసాంజే

ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ కాంట్రాక్టర్లు!

» కీలక నిర్ణయం దిశగా బైడెన్ ప్రభుత్వం

వాషింగ్టన్, జూన్ 26: రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్‌కు సాయం చేసే విషయంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకోబోతుంది. రష్యా భూభాగంలో తమ ఆయుధాలతో దాడి చేసేందుకు మే నెలలో ఉక్రెయిన్‌కు అనుమతినిచ్చిన అమెరికా.. ఇప్పుడు తమ దేశానికి చెందిన ఆయుధాల కాంట్రాక్టర్లను ఉక్రెయిన్‌కు పంపేందుకు సిద్ధమవుతోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనడంపై విధించుకున్న అప్రకటిత నిషేధం ఎత్తివేసే దిశగా అడుగులు వేస్తోంది. నిజానికి, రష్యా-ఉక్రెయిన్ పోరుకు అమెరికా దళాలు, ప్రజలను దూరంగా ఉంచేందుకు జోబైడెన్ దాదాపు రెండేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. అమెరికా నేరుగా యుద్ధంలో పాల్గొందనే భావన రష్యాకు కలగకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో ఉక్రెయిన్‌కు సరఫరా చేసిన ఆయుధాల మరమ్మతులు, నిర్వహణ పనులను అమెరికా స్వయంగా చేపట్టడం లేదు. ఆయా ఆయుధాలను నిర్వహణ పనుల కోసం పోలాండ్, రొమేనియా లేదా ఏదైనా నాటో సభ్య దేశానికి తరలిస్తున్నారు. ఈ విధానం వల్ల చాలా సమయం వృథా అవుతోంది. దీంతో యుద్ధభూమిలో రష్యా పైచేయి సాధిస్తుంది. ఈ నేపథ్యంలో అప్రకటిత నిషేధం ఎత్తివేత ప్రతిపాదనపై అమెరికా అధికార వర్గాల్లో చాలా కాలంగా చర్చ జరుగుతోంది. దీనికి ఈ ఏడాదే బైడెన్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అదే జరిగితే అమెరికాకు చెందిన ఆయుధాల కాంట్రాక్టర్లు స్వయంగా ఉక్రెయిన్ వెళ్లి పని చేయనున్నారు. ఫలితంగా ఆయుధాల మరమ్మతు, నిర్వహణ పనులు వేగవంతం కానున్నాయి. పైగా, అమెరికా త్వరలో ఉక్రెయిన్‌కు ఎఫ్-16 ఫైటర్ జెట్లు ఇవ్వనుంది. ఈ నిషేధం ఎత్తివేత ఎఫ్-16ల నిర్వహణకు కూడా ఉపకరిస్తుందని అమెరికా వర్గాలు పేర్కొంటున్నాయి.

విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తేవాలి

» కేంద్ర మంత్రికి రాష్ట్ర బీజేపీ విజ్ఞప్తి

» సానుకూల నిర్ణయం తీసుకుందాం: మంత్రి

న్యూఢిల్లీ, అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమను లాభాల బాటలోకి తీసుకురావాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని, బీజేపీ రాష్ట్ర నాయకత్వం కోరింది. విశాఖ ఉక్కుకు పూర్వ వైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు కలిశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను కేంద్ర మంత్రికి అందజేశారు. విశాఖ ఉక్కుకు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి గనులు కేటాయిస్తే రెండు సంస్థలకు లాభం చేకూరుతుందని తెలిపారు. ఆంధ్రుల హక్కుగా భావించే ఈ సంస్థను బలోపేతం చేయాలని కోరారు. దీనిపై ఇప్పటికే సమీక్ష నిర్వహించామని రెండు నెలల్లో మరోసారి సమావేశమై సానుకూల నిర్ణయం తీసుకుందామని హామీ ఇచ్చారు.



కుమార స్వామితో సమావేశమైన పురందేశ్వరి తదితరులు



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమంపై సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్

2 వేల కోట్లకు 7 కోట్లు మిగిలాయా?

» స్వచ్ఛాంధ్ర నిధులూ దారిమళ్లించారా? : ఉప ముఖ్యమంత్రి పవన్

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కేంద్రం నుంచి 'స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్'కు వచ్చిన రూ.వేల కోట్ల నిధులపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరా తీశారు. ఈ కార్పొరేషన్‌కు రూ.2092 కోట్లు కేంద్రం నుంచి అందగా, ప్రస్తుతం రూ.7కోట్లు మాత్రమే మిగలడంపై విస్మయం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిధులను దారి మళ్లించిందా? అని ప్రశ్నించారు. సొమ్ములు ఏమయ్యాయో.. ఎటు వెళ్లాయో తెలుసుకుని పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దారిమళ్లింపు వ్యవహారం ఎవరి కనుసన్నల్లో జరిగిందో.. దీనివెనుక ఎవరి ఆదేశాలు ఉన్నాయో తేల్చాలని కోరారు. మంగళగిరిలోని పవన్ నివాసంలో బుధవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యక్రమాలు, కార్పొరేషన్‌కు ఉన్న నిధులు, రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణపై ఉన్నతాధికారులతో సమగ్రంగా సమీక్షించారు. పవన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో 2020-21 మధ్య రూ.728.35 కోట్లు, 2021-22లో రూ.508 కోట్లు ఖర్చు చేశారని.. ఆ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.1,066 కోట్లు ఖాతాలో ఉన్నాయన్నారు. అయితే, 2022-23 నాటికి కార్పొరేషన్ ఖాతాలో రూ.3కోట్లు మాత్రమే ఉన్నాయని రికార్డులు స్పష్టం చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. 2020-21లో రూ.2,092 కోట్ల నిధులు ఉంటే ఇప్పుడు జీతాలకు సరిపడా రూ.7కోట్ల నిధులు మాత్రమే ఖాతాలో ఉండే పరిస్థితి ఎందుకొచ్చిందని పవన్ ప్రశ్నించారు.

'గ్రీన్‌కో' ఉల్లంఘనలపై పవన్ సీరియస్

జగన్ హయాంలో 'గ్రీన్‌కో' సంస్థ చేసిన కర్నూలు ఫారెస్టు రేంజ్ పరిధిలో ఉన్న భూముల ఆక్రమణ, పర్యావరణ నిబంధనల ఉల్లంఘనపై డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. గ్రీన్‌కో సంస్థ అక్రమాలపై మీడియాలో కథనాలు, ఫిర్యాదులు రావడంతో ఆయన స్పందించారు. అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌తో మాట్లాడారు. గ్రీన్‌కో సంస్థ ఉల్లంఘనలపై ఆరా తీశారు. గురువారం జరిగే సమావేశానికి పూర్తిస్థాయి నివేదికతో రావాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కూడా హాజరుకావాలన్నారు. కాగా, ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన గ్రూప్-1 అధికారులు పవన్ కల్యాణ్‌తో బుధవారం భేటీ అయ్యారు. తమ సమస్యలను ఆయనకు వివరించారు.

రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

» కాంట్రాక్టర్లకు 2,261 కోట్ల బకాయిలు: జనార్దన్‌రెడ్డి

» మంత్రిగా బాధ్యతల స్వీకారం



బాధ్యతలు చేపడుతున్న జనార్దన్ రెడ్డి

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో దెబ్బతిన్న ఆర్ అండ్‌బీ రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహిస్తాం. గుంతలు లేని రహదారులే మా తక్షణ లక్ష్యం' అని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఐదవ బ్లాకులో తనకు కేటాయించిన చాంబర్‌లో వేదపండితుల ఆశీర్వచనాల మధ్య పూజ నిర్వహించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, '2014-2019లో మా ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖకు బడ్జెట్‌లో రూ.14,970కోట్లు కేటాయించి రూ.12,064కోట్లు(80%) ఖర్చు చేసి రోడ్లను బాగుచేసింది. గత ప్రభుత్వ హయాంలో 2019-24లో ఆర్‌అండ్‌బీకి రూ.19,428 కోట్లు బడ్జెట్‌లో కేటాయించి కేవలం రూ.9,015కోట్లు అంటే 46శాతం మాత్రమే ఖర్చు చేసింది. గత ప్రభుత్వం రూ.2,261 కోట్ల బిల్లులు చెల్లించలేదు. పనులు చేసినా కాంట్రాక్టర్లు చాలా ఇబ్బందిపడుతున్నారు' అని తెలిపారు.

పింఛన్ల పంపిణీ రెండు రోజుల్లో పూర్తి!

» 1.09 లక్షల మంది వలంటీర్ల రాజీనామా: మంత్రి డోలా



బాధ్యతలు చేపడుతున్న బాలవీరాంజనేయ స్వామి

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీని ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమశాఖ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులంతా పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటిదాకా 1.09 లక్షల మంది వలంటీర్లు రాజీనామా చేశారని, రాజీనామా చేసిన తర్వాత కూడా సెల్‌ఫోన్లు, సిమ్‌కార్డులు స్వాధీనం చేయని వారి సంగతేంటని ప్రశ్నించారు. అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చాలా చోట్ల గ్రామ, వార్డు సచివాలయాల భవనాలు ఊరికి దూరంగా, ప్రజలకు ఏమాత్రం అందుబాటులో లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయన్నారు. అలాంటి వాటిపై వెంటనే సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. సచివాలయాల్లో ఉద్యోగులందరి సెలవుల మంజూరుపై ఒక కచ్చితమైన విధానాన్ని రూపొందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో చాలా చోట్ల గ్రామ సచివాలయాలు, పంచాయతీల మధ్య సమన్వయం లేదని, సీఎం ఆదేశాల ప్రకారం ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సైతం సంప్రదించి అవసరమైతే ఒక కమిటీ వేసుకుని సమన్వయాన్ని సాధించుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల రోజువారీ వ్యవహారాలను పరిశీలించేలా మండలస్థాయిలోనే ఒక అధికారికి బాధ్యతలు అప్పచెప్పే దిశగా కూడా ఆలోచనలు చేయాలని మంత్రి ఆదేశించారు.

ఇంటి వద్దకే పింఛన్: మంత్రి సవిత



కాంపాక్ట్ వాహనాన్ని నడుపుతున్న సవిత

పెనుకొండ టౌన్, జూన్ 26: టీడీపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టో హామీ మేరకు వచ్చే నెల ఒకటో తేదీన ఇంటి వద్దనే పింఛన్లు అందజేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్‌దారులను జగన్ మోసగించారని, అధికారంలోకి వస్తే పింఛన్ రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. నిలబెట్టుకోలేదని విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో రూ.50 లక్షలతో కొనుగోలు చేసిన కాంపాక్ట్ వాహనాన్ని ఆమె బుధవారం స్వయంగా నడిపి ప్రారంభించారు. సీఎం చంద్రబాబు హామీ మేరకు పెంచిన పింఛన్ రూ.4 వేలు, మూడు నెలలకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున... కలిపి మొత్తం రూ.7,000 పింఛన్‌దారులకు అందజేస్తామని మంత్రి అన్నారు.

పింఛన్ పెంపు ఉత్తర్వులు జారీ

(మొదటి పేజీ తరువాయి)

వృత్తివారు, ట్రాన్స్‌జెండర్లు, ఏఆర్‌టీ, డప్పు కళాకారులు, ఆర్టిస్టు పెన్షన్‌దారులకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారు. దివ్యాంగులు, కుష్టురోగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. పూర్తి వైకల్యం ఉన్న వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు, తీవ్రమైన వ్యాధిగ్రస్తులు, కిడ్నీ, లివర్, గుండె ట్రాన్స్‌ప్లాంట్ చేయించుకున్నవారు, డయాలసిస్ రోగులు తదితరులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచారు. పెంచిన పెన్షన్ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. జూలై 1న ఒక్కో పెన్షన్‌దారుడు రూ.7 వేలు పొందే అవకాశం ఉంది. అనంతరం ప్రతి నెలా రూ.4 వేల పెన్షన్ అందుకోనున్నారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికెళ్లి పంపిణీ చేస్తారు. ఒక్కో సచివాలయ ఉద్యోగి కనీసం 50 మందికి పంపిణీ చేస్తారని, కలెక్టర్లు, అధికారులు ఆ మేరకు

జగన్ బొమ్మలున్న పాస్‌పుస్తకాలు వెనక్కి!

» రైతులకు రాజముద్రతో కొత్తవి జారీ

» త్వరలో సీఎంతో చర్చించి నిర్ణయం

» రెవెన్యూ అధికారులతో మంత్రి అనగాని సమీక్ష

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు ఇచ్చే పట్టాదారు పాస్‌పుస్తకాలపై రాజముద్రే ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. మాజీ సీఎం జగన్ పేరు, ఆయన బొమ్మలు ముంద్రించిన పాస్‌పుస్తకాలను వెనక్కి రప్పించాలని యోచిస్తోంది. ఎన్నికలకు ముందే వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు పథకం పేరిట రాష్ట్రంలో 4,618 గ్రామాల్లో 20.19 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలు రైతులకు అందించారు. వాటిపై జగన్, ఆయన తండ్రి, తాత పేరు కలిసివచ్చేలా వైఎస్ ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, జగనన్న భూహక్కు పత్రం అని పేర్లు రాసుకొచ్చారు. పుస్తకంలోని పేజీల నిండా జగన్ కలర్ ఫొటోలు ముద్రించారు. రైతు ఫొటో మాత్రం చాలా చిన్నదిగా ముద్రించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాలు ప్రచురించింది. భూమి రైతుదా? పాస్‌పుస్తకం జగన్‌దా? రైతుదా అని అనుమానాలు కలిగేలా ఉండటంపై రైతుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. చాలామంది రైతులు వాటిని బహిరంగ వేదికలు, తహసీల్దార్ కార్యాలయాల వద్దే చించివేశారు. కొందరయితే ఏకంగా తగులబెట్టారు. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే వాటిని తొలగిస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు హామీ ఇచ్చారు. బుధవారం ఇదే అంశంపై సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్షించారు. సీసీఎల్ఏ జి. సాయిప్రసాద్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, సర్వే కమిషనర్ సిద్ధార్థ్ జైన్ తదితర అధికారులు పాల్గొన్నారు. జగన్ బొమ్మలు, పేర్లతో రైతులకు అడ్డగోలుగా పాస్‌పుస్తకాలు అంటగట్టారని మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'జగన్ బొమ్మ, ఆయన పేరుతో ఉన్న ప్రతీ పాస్‌పుస్తకాన్ని వెనక్కి తీసుకుంటాం. ఆ పేర్లతో ఉన్నవి ఏవీ రైతులకు పంపిణీ చేయకూడదు. ఇప్పటికే రైతులకు పంపిణీ చేసిన వాటిని వెనక్కి రప్పించాలని(రీకాల్) ప్రభుత్వం భావిస్తోంది. ఇకపై రైతులకు ఇచ్చే పాస్‌పుస్తకాలపై రాజముద్రే ఉంటుంది. దీనిపై త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకొని ఆదేశాలు జారీ చేస్తాం' అని మంత్రి స్పష్టం చేసినట్లు తెలిసింది. సీఎంతో సమావేశం జరిగే నాటికి కొత్త పాస్‌పుస్తకాల డిజైన్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ లెక్కన 20.19 లక్షల మంది రైతులకు పంపిణీ చేసిన పాస్‌పుస్తకాలను వెనక్కి రప్పిస్తారు. వాటిని రైతులు సంబంధిత రెవెన్యూ కార్యాలయాల్లో సమర్పించాలి. వాటి స్థానంలో కొత్త పాస్‌పుస్తకాలు జారీ చేస్తారు.



రెవెన్యూ ఉన్నతాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రీసర్వే సమస్యలపై గ్రామస్థాయిలో పరిష్కారం

భూముల సర్వే విధానం మంచిదేనని, అయితే, సర్వే చేయడంలో అనేక తప్పులు, లోపాలు జరిగాయని సర్వేయర్లే తన దృష్టికి తీసుకొచ్చారని మంత్రి చెప్పడంతో ఉన్నతాధికారులు నిశ్చేష్టులయ్యారు. సర్వే అధికారి వివరించే ప్రయత్నం చేయబోగా అజయ్ జైన్ జోక్యం చేసుకొని ఇప్పుడు ఆ తప్పులను సరిదిద్దుదామని చెప్పారు. రీసర్వేలో రైతులు ఎదుర్కొన్న సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించేందుకు తగిన కార్యక్రమం చేపడతామని ప్రతిపాదించినట్లు సమాచారం.

నన్ను 'లాక్' చేయాలని!

» ఓటుకు 5 వేల చొప్పున పంచారు

» కొందరు టీడీపీ నేతలను మభ్యపెట్టారు

» అందుకే ఆశించిన మెజారిటీ రాలేదు: సీఎం

» కుప్పంలో ముగిసిన రెండ్రోజుల పర్యటన



కుప్పంలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కుప్పం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో మరెక్కడా నేను దృష్టి పెట్టకుండా కుప్పంలోనే నన్ను లాక్ చేసేందుకు కుట్ర పన్నారు. అందుకే ఇక్కడ ఓటుకు రూ5 వేలు పంచారు. కొంతమంది టీడీపీ నాయకులను మభ్య పెట్టారు. అయినా పట్టించుకోకుండా రాష్ట్రమంతటా తిరిగాను. అందుకే కుప్పంలో ఆశించిన మెజారిటీ రాలేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సొంత నియోజకవర్గం కుప్పంలో ఆయన రెండ్రోజుల పర్యటన బుధవారం ముగిసింది. ఉదయం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. తర్వాత నియోజకవర్గంలోని అధికారులతో, టీడీపీ శ్రేణులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కుప్పం నియోజకవర్గం నుంచే శ్రీకారం చుడతాను. సింపుల్ గవర్నమెంట్.. సమర్థ ప్రభుత్వం (ఎఫెక్టివ్ గవర్నెన్స్) నా విధానం. దీనికి అనుగుణంగా అధికారులు పనిచేయాలి. గత ప్రభుత్వ పాలనకు, ఇప్పటికి చాలా వ్యత్యాసం ఉంటుంది. అధికారులు ఫిజికల్‌గా, వర్చువల్‌గా పనిచేసేందుకు సిద్ధపడండి. బలవంతపు జనసమీకరణతో పెద్ద సమావేశాలు, భారీ కాన్వాయ్ హంగామా ఈ ప్రభుత్వంలో ఉండవు. సాయంత్రం 6 తర్వాత సమావేశాలు వద్దని మంత్రులకు చెప్పాను. కుప్పం సమగ్ర అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి. ఇక్కడ రౌడీయిజం, హింస, గంజాయి, అక్రమాలు కనిపించకూడదు. రాజకీయ ప్రోద్బలంతో గత ప్రభుత్వ హయాంలో పెట్టిన కేసులను ఎత్తేయండి. గత ఐదేళ్లలో కొందరు అధికారులు మనసు చంపుకొని పనిచేశారు. మరికొందరు వైసీపీ నేతలకు సహకరించారు. నా సొంత నియోజకవర్గానికి రాకుండా నన్ను అడ్డుకున్నారు. నాపైనా హత్యాయత్నం కేసు పెట్టారు' అని గుర్తుచేశారు.

కష్టపడిన వారికి పదవులిస్తా..

పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ఏ ఒక్కరినీ వదులుకోనని చంద్రబాబు స్పష్టంచేశారు. 'ఐదేళ్ల వైసీపీ పాలనలో మీరు పడిన కష్టం గుర్తుంది. అలాంటివారికి పదవులిచ్చే బాధ్యత నాది. గత ఐదేళ్లలో జరిగినంత హింస, దాడులు, దారుణాలు నా జీవితంలో చూడలేదు. నన్ను నైతికంగా దెబ్బ తీయాలని చూశారు. నేతలు, కార్యకర్తలపై దాడులు చేసి ప్రలోభపరిచే ప్రయత్నం చేశారు. అయితే గత ప్రభుత్వంలో చేసిన తప్పులు మీరు చేయొద్దు. వారికి, మనకు ఉన్న తేడా ప్రజలకు కనిపించాలి. సామాన్య కార్యకర్తలను ఎంపీలు, మంత్రులను చేసిన ఘనత టీడీపీది. కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే బాధ్యత నాది' అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. అతిథిగృహంలో శాంతిపురం మండలానికి చెందిన సుధాకర్, ప్రియ దంపతుల కుమార్తెకు 'చరణి'గా చంద్రబాబు నామకరణం చేశారు.

అర్జీల పరిష్కార బాధ్యత కలెక్టర్‌కు..

నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు తొలిసారి తన సొంత నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గంతో పాటు చిత్తూరు జిల్లా నలుమూలల నుంచీ ప్రజలు ఆయన్ను చూసేందుకు, కలిసేందుకు పోటెత్తారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి వేల సంఖ్యలో అభిమానులు చేరుకున్నారు. ప్రజలు కూడా పెద్దఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలను అర్జీల రూపంలో చంద్రబాబుకు అందించారు. వారందరినీ ఆయన పేరుపేరునా పలకరించి.. అర్జీలు తీసుకుని పరిష్కార బాధ్యతను కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు అప్పగించారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి, వారితో అధిక సమయం మాట్లాడారు. అనంతరం అధికారులు, నాయకులు కుప్పంలోని పీఈఎస్ హెలిప్యాడ్‌లో ఆయనకు వీడ్కోలు పలికారు. సీఎం పర్యటనలో రవాణా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

ఐదేళ్లుగా నీరు-చెట్టు బిల్లులు పెండింగ్: నిమ్మల

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వం నీరు-చెట్టు బిల్లులను పెండింగ్‌లో పెట్టడం దుర్మార్గమని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం తనను కలసిన రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు బృందంతో ఆయన సమావేశమయ్యారు. 'నీరు-చెట్టు కార్యక్రమం కింద చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించడం లేదంటూ 9,361 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న కోర్టు రూ.968కోట్లు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ మేరకు రైతులకు బిల్లులను జగన్ ప్రభుత్వం చెల్లించింది. న్యాయస్థానాన్ని ఆశ్రయించని రైతులకు చెల్లించాల్సిన రూ.427 కోట్లను ఇప్పటికీ చెల్లించలేదు. ఈ బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లించాలి' అని ఆళ్ల విజ్ఞప్తి చేశారు. దానిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, జీఎస్టీ మినహాయించి రైతులకు రూ.408 కోట్లు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

త్వరలో మహిళలకు ఉచిత ప్రయాణం

కుప్పం, జూన్ 26: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని త్వరలో నెరవేరుస్తామని రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. కుప్పం ఆర్టీసీ బస్టాండులో బుధవారం ఆయన ఐదు కొత్త బస్సులను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒక కమిటీని ఏర్పాటు చేసి కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం చేస్తామన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.

సీఎస్‌కు పీసీబీ బాధ్యతలు

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ సమీర్ శర్మ రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. దీంతో తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్‌కు కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం బుధవారం గెజిట్ జారీ చేసింది.

ప్రతిపక్ష నేత హోదా చాన్సే లేదు

» జగన్ వైసీపీకి ఫ్లోర్ లీడర్ మాత్రమే

» ఏ సలహాదారు సూచనలతో లేఖ రాశారో: మంత్రి పయ్యావుల



అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీకి ప్రతిపక్ష హోదా లేదు. అందుకే జగన్ ప్రతిపక్ష నేత కాదు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి ఫ్లోర్ లీడర్ మాత్రమే' అని రాష్ట్ర ఆర్థిక, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రస్తుత నిబంధనల ప్రకారం జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చే అవకాశం లేదు. కేంద్రంలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా రావడానికి పదేళ్లు పట్టింది. ఆ హోదా రావడానికి జగన్‌కూ ఓ పదేళ్లు పడుతుంది. ఆయనకు ఆప్తుడైన కేసీఆర్ కూడా 2019లో తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. స్పీకర్‌కు లేఖ రాసిన జగన్ బెదిరించే ప్రయత్నం చేశారు. లేఖ రాసింది మీరే అయితే మీ వైఖరి మార్చుకోండి.. దాన్ని రాసింది సలహాదారులైతే వారిని మార్చుకోండి' అని సూచించారు. ప్రజా తీర్పును జీర్ణించుకోలేని స్థితిలో జగన్ ఉన్నారనే విషయం స్పీకర్‌కు ఆయన రాసిన లేఖను బట్టి అర్థమవుతోందన్నారు. ప్రతిపక్ష నేత కావడం తన హక్కు అనే తరహాలో లేఖ రాయడమేంటని మంత్రి నిలదీశారు.

వారి సలహాలతో మునిగిపోతారు

'జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకూడదని ప్రజలు నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చారు. వారి తీర్పును అంగీకరించాలి. అధికార పార్టీగా మేం హుందాగానే స్పందించి మంత్రులతో పాటు జగన్‌తోనూ ప్రమాణం చేయించాం. ప్రతిపక్ష హోదా కోసం ఏ సలహాదారు సూచనలతో ఆయన లేఖ రాశారో అర్థం కావడంలేదు. (ఆంధ్రప్రదేశ్ పేమెంట్స్, అండ్ శాలరీస్ యాక్ట్) జీతాలు, పెన్షన్లు ఇచ్చే యాక్ట్ ప్రకారం ప్రతిపక్ష హోదా వస్తుందని ఆయనకు ఏ పెద్దమనిషి సలహా ఇచ్చారో' అని పయ్యావుల ఎద్దేవా చేశారు. 'గతంలో అంత మంది సలహాదారులను పెట్టుకునే జగన్ ఇప్పుడు ఇక్కడిదాకా వచ్చారు. వారి సలహాలు తీసుకుంటే మునిగిపోతానని జగన్ గుర్తించాలి. జగన్ లేఖ మొదటి లైన్‌లోనే తప్పు ఉంది. ఓనమాలు కూడా చూడకుండా ఈ లేఖ ఎలా రాశారు? సభ్యుల ఓత్ అనేది సంప్రదాయం కాదు... రాజ్యాంగంలోని ఆర్టికల్ 188 ప్రకారం తప్పనిసరి. ప్రమాణ స్వీకారం చేశాకే సభ్యుడిగా గుర్తింపు పొందుతారు' అని స్పష్టం చేశారు.

కొసరు అధికారం కోసం పాకులాట

'దేశవ్యాప్తంగా అన్ని శాసనసభలు, పార్లమెంట్‌లో పాటించే నిబంధనలు జగన్ తెలుసుకోవాలి. ప్రతిపక్ష హోదా ఎవరికి ఇవ్వాలన్న దానిపై తొలి స్పీకర్ మౌలాలంకర్ నిర్దేశించారు. కేవలం మద్యం, ఇసుక ఖాతా పుస్తకాలనే చూడటం కాదు. అప్పుడప్పుడూ శాసనసభ, పార్లమెంటరీ నిబంధనలు ఉండే కౌల్ అండ్ షక్దర్ పుస్తకాలను కూడా జగన్ చూడాలి. సభ జరపడానికి కోరం ఎంతమంది ఉండాలో అంతమంది ఉంటే మాత్రమే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఆ బుక్‌లో ఉంది. గతంలో చంద్రబాబును సభలో ఎంత హేళన చేశారో వీడియో తెప్పించుకుని చూడండి. మొన్నటి వరకూ ప్రభుత్వంలో ఉన్నప్పుడు మేం చిటికేస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదన్నారు. 10శాతం సభ్యులు కూడా లేకుండా ప్రతిపక్ష హోదా ఎలా వస్తుందని గత శాసనసభ సాక్షిగా జగన్ తన నోటితోనే చెప్పారు. ఇప్పుడు ఆ నిబంధనే లేదు తూచ్ అంటారా? ప్రజలు అధికారం తీసేసినా కొసరు అధికారం కోసం పాకులాడుతున్నారు. అందరు సభ్యుల్లాగానే జగన్‌కూ మాట్లాడే అవకాశం కల్పిస్తామని సభ మొదటిరోజే చెప్పాం. ప్రతిపక్ష హోదా కావాలి... ప్రజా సమస్యల గురించి మాట్లాడతామని చెబుతున్నారు. ఇన్ని రోజులకు ప్రజా సమస్యలు గుర్తుకొచ్చాయా' అని పయ్యావుల నిలదీశారు. జగన్ ఏదో ఒక వంకతో సభకు రాకూడదనే ప్రయత్నం చేస్తున్నారని చాలా మంది చెబుతున్నారని, అందులో ఈ లేఖ భాగం కావొచ్చన్నారు. 11 సీట్లు పొందిన జగన్ ప్రతిపక్ష హోదా కావాలని, అది ఉంటేనే సభలో ప్రజా సమస్యల్ని సమర్థంగా వినిపించగలమని చెప్పడం అసంబద్ధంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య విమర్శించారు.

ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలి

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. బుధవారం వాణిజ్యపన్నుల శాఖ అధికారులతో ఆయన విజయవాడలో సమీక్ష నిర్వహించారు. వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో వస్తువుల అమ్మకం, వినిమయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. హైకోర్టులో ప్రత్యేక ట్యాక్స్ బెంచ్ ఏర్పాటుకు కృషి చేయాలని, రాబోయే 100 రోజుల్లో సాధించాల్సిన లక్ష్యాలను మంత్రి కేశవ్ అధికారులకు నిర్దేశించారు.

11 సీట్లకే పరిమితమైనా మారరా?

» జగన్‌పై కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఫైర్



అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఘోర పరాజయంతో జనానికి మొహం చూపించలేక.. జగన్ కుయుక్తులకు తెర లేపారని కడప టీడీపీ ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి మండిపడ్డారు. ప్రతిపక్ష హోదా కోసం స్పీకర్‌కు జగన్ లేఖ రాయడం సిగ్గుచేటని విమర్శించారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇన్ని రోజులూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడిపిన జగన్‌రెడ్డి... భారత రాజ్యాంగాన్ని మార్చి, కొత్త రాజ్యాంగం రాస్తేనే అసెంబ్లీకి వస్తానన్నట్లు మాట్లాడటం సిగ్గుచేటు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, సీఎంగా పనిచేసిన జగన్‌కు అసెంబ్లీ రూల్స్‌పై కనీస అవగాహన లేదు. మొత్తం సభ్యుల్లో పదో వంతు ఉంటేనే ప్రతిపక్ష హోదా వస్తుందన్న విషయం కూడా తెలియకపోవడం విడ్డూరం. ప్రజాసమస్యలపై మాట్లాడాలంటే ప్రతిపక్ష నేత హోదానే కావాలా? అధికారమో, ప్రతిపక్ష హోదానో లేకపోతే జగన్ అసెంబ్లీకి రారా? ప్రతిపక్షానికి కూడా జగన్ అర్హుడు కాదనే వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారు. జనం ఓటుతో బుద్ధి చెప్పినా.. జగన్ మారరా' అంటూ ఎమ్మెల్యే మాధవీరెడ్డి నిలదీశారు.

జగన్ అసెంబ్లీలో ఫ్లోర్ లీడర్ మాత్రమే

» ప్రతిపక్ష హోదా కోరుతూ రాద్ధాంతం తగదు: పల్లా

» రేపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు



గాజువాక, జూన్ 26, అమరావతి (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీలో ఆ పార్టీకి ఫ్లోర్ లీడర్ మాత్రమేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆయన ప్రధాన ప్రతిపక్ష స్థాయిని కోరడం ప్రజాతీర్పును అవహేళన చేయడమేనన్నారు. ఈ విషయంలో లేనిపోని రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో పల్లా మాట్లాడారు. శాసనసభలో పదో వంతు ఎమ్మెల్యేలను గెలిచిన పార్టీకి ప్రతిపక్ష హోదా లభిస్తుందని, కేవలం 11 స్థానాలు గెలిచిన జగన్.. శాసనసభలో ఫ్లోర్ లీడర్‌గా మాత్రమే కొనసాగాలని అసెంబ్లీ నిబంధనలు చెబుతున్నాయని చెప్పారు. కాగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన పల్లా శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. మధ్యాహ్నం 1.45 గంటలకు మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.



ప్రజా దర్బార్‌లో మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ప్రజాదర్బార్‌కు జనం బారులు

» రాష్ట్రవ్యాప్తంగా తరలివస్తున్న వైనం

» సావధానంగా సమస్యలు వింటున్న మంత్రి లోకేశ్

తాడేపల్లి, జూన్ 26: రాష్ట్ర మంత్రి లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పోటెత్తుతున్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లి కరకట్ట నివాసం వద్ద ఈ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరి సమస్య వింటూ పరిష్కారం చేస్తానని ఆయన హామీ ఇస్తుండడంతో ప్రతి ఒక్కరూ తమ సమస్యలు విన్నవించేందుకు బారులు తీరుతున్నారు. బుధవారం పెదవడ్లపూడికి చెందిన మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ సభ్యులు తమ గౌరవ వేతనాలు పెంచాలని లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రూ.3వేలు ఇస్తున్నారని, రూ.5-10వేలు చేయాలని కోరారు. పాఠశాలల్లో రాగిజావ, కోడిగుడ్లు ఉడకబెట్టేందుకు అదనంగా డబ్బులేమీ ఇవ్వడం లేదని, అందుకయ్యే వంటగ్యాస్‌కు తమ జీతం డబ్బుల నుంచే వెచ్చిస్తున్నామని వాపోయారు. జీతాలు కూడా సక్రమంగా అందడం లేదని, పని ఒత్తిడి అధికంగా ఉందని, వైసీపీ ప్రభుత్వంలో తమ మాట వినేవారు లేరని, కూటమి ప్రభుత్వంలో సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజాదర్బార్‌కు వచ్చామని చెప్పారు. అలాగే, నాలుగు చక్రాల మీటర్ సైకిల్ ఇప్పించి ఆదుకోవాలని తాడేపల్లి మండలం సీతానగరానికి చెందిన దివ్యాంగుడు ఎస్.రమేష్ విన్నవించారు. పనికి తగ్గ జీతం ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని, సెలవులు మంజూరు చేయించాలని మంగళగిరి ఆశావర్కర్లు కోరారు. విశాఖ జిల్లా కొమ్మాదిలో నకిలీ సర్టిఫికెట్లు తయారుచేసి సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతున్న సన్యాసిరావుపై చర్యలు తీసుకోవాలని విశాఖకు చెందిన బి. ప్రవీణ్‌కుమార్ కోరారు. ఇలా ప్రతి ఒక్కరూ తమ సమస్యలతో తెల్లవారుజామున 5.30 గంటలకే ప్రజాదర్బార్ వద్ద బారులుతీరుతుండడంతో కరకట్ట కిటకిటలాడుతోంది.

బదిలీల్లో రాజకీయ జోక్యం వద్దు

» టీచర్లపై అనవసర యాప్‌ల భారం తగ్గించాలి: మంత్రి లోకేశ్

అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో ఇకపై ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టంచేశారు. గత ప్రభుత్వం తరహాలో రాజకీయ ఒత్తిళ్లు ఉండకూడదని, ఇందుకోసం స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాల సలహాలు తీసుకోవాలని సూచించారు. బుధవారం సచివాలయంలో పాఠశాల విద్యాశాఖపై మంత్రి సమీక్షించారు. టీచర్లకు బోధనేతర పనులు, అనవసరమైన యాప్‌ల భారాన్ని తగ్గించాలని, పూర్తిస్థాయిలో బోధనపైనే దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు స్పష్టంచేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు ఎన్ని నిధులు అవసరమని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతపై పలు సూచనలు చేశారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ బడుల నుంచి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లడానికి కారణాలను సమగ్ర నివేదిక రూపంలో సమర్పించాలన్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలు, విద్యా ప్రమాణాల పెంపుపై అధికారులతో చర్చించారు. సమీక్షలో ఉన్నతాధికారులు కోన శశిధర్, సురేశ్ కుమార్, బి.శ్రీనివాసరావు, నిధి మీనా పాల్గొన్నారు.

దళితులకు చంద్రబాబు దన్ను: వర్ల

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు దళితులకు ప్రాధాన్యం ఇచ్చారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన్ను సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. వర్ల మాట్లాడుతూ 'దళితులకు దన్నుగా నిలిచిన గొప్ప వ్యక్తి చంద్రబాబు. ఆయన అప్పగించిన గురుతర బాధ్యతను గౌరవప్రదంగా భావించి, దళితుల జీవన ప్రమాణాల మెరుగుదలకు మరిన్ని చర్యలు తీసుకోవాలి. దళిత బిడ్డల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కృషి చేసి, సమాజంలో మరింత గౌరవాన్ని సొంతం చేసుకోవాలి' అని డోలాకు సూచించారు.

ఎట్టకేలకు పిన్నెల్లి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)



నరసరావుపేటలో పిన్నెల్లిని అరెస్టు చేస్తున్న పోలీసులు

సమయంలో పిన్నెల్లిని అదుపులోకి తీసుకుని ఎస్పీ కార్యాలయానికి తరలించారు. అరెస్టు వార్తను ఎస్పీ మల్లికాగార్గ్ రాత్రి 7 గంటల సమయంలో ధ్రువీకరించారు. ఆయనను వైద్య పరీక్షల నిమిత్తం ఎస్పీ కార్యాలయం నుంచి నరసరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి 8 గంటల సమయంలో తరలించారు. అనంతరం 9.13 గంటలకు ఆస్పత్రి నుంచి ఎస్పీ కార్యాలయానికి తిరిగి తీసుకొచ్చారు. మాచర్ల నియోజకవర్గంలో కేసులు నమోదు కావడంతో ఆయనను మాచర్ల కోర్టులో హాజరు పరచాలని పోలీసులు నిర్ణయించారు. రాత్రి 10 గంటల సమయంలో ఎస్పీ కార్యాలయం నుంచి పిన్నెల్లిని మాచర్ల కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు. పోలింగ్ రోజు, ఆ తర్వాత మొత్తం పిన్నెల్లిపై 14 కేసులు నమోదయ్యాయి. వీటిలో మూడు హత్యాయత్నం కేసులు ఉన్నాయి.

సీసీటీవీ ఫుటేజీ బయటకు రాకపోతే..!

పోలింగ్ కేంద్రంలోకి చొరబడి ఈవీఎంను ధ్వంసం చేస్తున్న సీసీ టీవీ ఫుటేజీ బయటకు వచ్చింది కాబట్టి పిన్నెల్లిపై పోలీసులు అరెస్టు చేయగలిగారు. అదే గనుక ఈ దృశ్యాలు బయటకు రాకుంటే పిన్నెల్లి చేసిన సవాలక్ష పాపాల్లాగే ఈ నిజం కూడా సమాధి అయిపోయేదే. ఎన్నికలు జరిగిన మే 13వ తేదీన కేపీ గూడెం, రాయవరం పోలింగ్ బూత్‌లపై దాడులు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న టీడీపీ ఏజెంట్లపై హత్యాయత్నం చేశారు. టీడీపీ పోలింగ్ ఏజెంట్ రేఖ్యానాయక్‌పై పిన్నెల్లి అనుచరులు హత్యాయత్నం చేశారు. ఓటర్లను పోలింగ్ కేంద్రం నుంచి తరిమికొట్టారు. పిన్నెల్లి నేతృత్వంలో వైసీపీ గూండాలు పోలింగ్ కేంద్రాన్ని ముట్టడించారు. దీనిపై టీడీపీ నేతలు.. అప్పుడే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పట్టించుకోలేదు. తమపైనే ఫిర్యాదు చేస్తారా.. అంటూ వైసీపీ గూండాలు మరింతగా రెచ్చిపోయారు. బరిసెలతో మూకుమ్మడి దాడులు చేశారు. ఈ వీడియోలను టీడీపీ నేతలు బయటపెట్టడంతో రాష్ట్రమంతా విస్తుపోయింది. ఈసీ రంగంలోకి దిగి పిన్నెల్లి అరెస్టుకు ఆదేశించింది.

ఎన్నికలకు విఘాతం కలిగిస్తే శిక్ష తప్పదు!

- **నిందితుని అరెస్టుతో ఈ అంశానికి తార్కిక ముగింపు**
- **వ్యవస్థలను బెదిరించేవారిని ఉపేక్షించబోం: ఈసీ**

ఎన్నికల ప్రక్రియకు విఘాతం కల్గించే ఎవరికైనా శిక్ష తప్పదని భారత ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈవీఎంల ధ్వంసం, ఇతర నేరాలపై నమోదైన కేసుల్లో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారావు ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేయడం, ఆ వెంటనే ఆయనను పోలీసులు అరెస్టు చేయడాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసీ ఈ వ్యాఖ్యలు చేసింది. దీనిపై బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. "రాజ్యాంగబద్ధంగా శాంతియుతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియను అడ్డుకునేలా దుస్సాహసాలకు ఇకముందు ఎవరూ పాల్పడబోరని ఆశిస్తున్నాం. ఈవీఎం డ్యామేజ్‌కు కారణమైన నిందితుడిని అరెస్టు చేయడంతో ఈ అంశానికి తార్కిక ముగింపు లభించినట్టే. చట్టానికి ఎవరూ అతీతులు కాదనే సూత్రాన్ని ఇది బలపరిచింది. ఎన్నికల ప్రక్రియను పరిరక్షించడానికి ఈసీ కట్టుబడి ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థను బెదిరించే వారిని ఉపేక్షించబోం" అని ఆ ప్రకటనలో కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కాగా, మే 13వ తేదీన పోలింగ్ సందర్భంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలను ధ్వంసం చేసిన ఘటనను కేంద్ర ఎన్నికల తీవ్రంగా పరిగణించింది. ఆయనను తక్షణమే అరెస్టు చేయాలని ఆదేశించింది.

పిన్నెల్లికి హైకోర్టు షాక్

- **నేరారోపణలు తీవ్రమైనవి.. బెయిల్ ఇస్తే ప్రజలకు తప్పుడు సంకేతాలు**
- **ముందస్తు బెయిల్ పిటిషన్లు కొట్టివేత**

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు షాక్ ఇచ్చింది. ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీప్యాట్‌ల ధ్వంసం, హత్యాయత్నం తదితర తీవ్ర నేరాభియోగాలతో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్‌కు ఆయన దాఖలుచేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. పిటిషనర్ మొత్తం 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నారని, గత ఎన్నికల సందర్భంగా కూడా ఇదే తరహా నేరాలకు పాల్పడ్డారంటూ విచారణలో పోలీసులు తెలిపిన వివరాలను కోర్టు గుర్తు చేసింది. నేరాలకు పాల్పడడం పిటిషనర్ అలవాటుగా మార్చుకున్నారని పోలీసులు చెబుతున్నారని పేర్కొంది. బెయిల్ మంజూరు చేస్తే సామాన్య ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయని అభిప్రాయపడింది. నేరఘటనలు పునరావృతం చేసే అవకాశం ఉందని పేర్కొంది. కేసుల దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, ఈ సమయంలో బెయిల్ మంజూరు చేస్తే నిష్పాక్షిక, స్వేచ్ఛాయుత దర్యాప్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపింది. మరోవైపు ఈవీఎం ధ్వంసం చేసిన వ్యవహారంలో పిటిషనర్ పై నమోదైన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్న వైనందున తనను అరెస్ట్ చేయడానికి వీల్లేదన్న పిటిషనర్ వాదనను తోసిపుచ్చింది.

తనకు సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుందన్న వాదనను కొట్టివేసింది. నోటీసులు ఇవ్వాలా?లేదా? అనేది దర్యాప్తు అధికారి విచక్షణాధికారమని తెలిపింది. సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వడం తప్పనిసరి ఏమీ కాదంది. ముందుస్తు బెయిల్ మంజూరు సమయంలో పిటిషనర్ పూర్వ నేరచరిత్ర, నేర తీవ్రత, పారిపోయే అవకాశం ఉందా? సాక్షులను బెదిరించడం, ఆధారాలు తారుమారు చేయడంచేస్తారా? వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని కోర్టు గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో పిటిషనర్ పై వచ్చిన నేరారోపణల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు బుధవారం తీర్పు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా, మే 13న ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేసిన వ్యవహారంలో పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పై కేసు నమోదు చేశారు. ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేస్తుండగా పిన్నెల్లిని అడ్డుకున్న టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేసి, హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి రెంటచింతల పోలీసులు పిన్నెల్లి, అతని అనుచరులు మరో 15 మంది పై హత్యాయత్నం(ఐపీసీ 307), మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈవీఎంను ధ్వంసం చేసి బయటకు వస్తున్న పిన్నెల్లిని చెరుకూరి నాగశిరోమణి అనే మహిళ నిలదీసింది. దీంతో పిన్నెల్లి ఆమెను బూతులు తిట్టారు. బాధిత మహిళ ఫిర్యాదుతో రెంటచింతల పోలీసులు పిన్నెల్లి పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పోలింగ్ తర్వాతి రోజు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డి, అనుచరులు కారంపూడిలో దాడులకు పాల్పడుతుండగా సీఐ నారాయణ స్వామి అడ్డుకున్నారు. దీంతో సీఐపై దాడి చేసి గాయపరిచారు. సీఐ ఫిర్యాదుతో పిన్నెల్లి సోదరులు, అతని అనుచరులు పై పోలీసులు హత్యాయత్నం, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు తనపై నమోదు చేసిన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై ఇటీవల తుది విచారణ జరిపిన న్యాయస్థానం ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసింది. బుధవారం నిర్ణయాన్ని వెల్లడించింది.



పల్నాడులో రక్త చరిత్ర

- **మాచర్లలో పిన్నెల్లి ఫ్యాక్షన్ పాలన**
- **రాజకీయ జీవితమంతా నేరమయమే**
- **సోదరుడితో కలిసి హత్యలు, దాడులు, కబ్జాలు**
- **కేసులు పెట్టడానికీ భయపడిన పోలీసులు**
- **ఈసీ ఆదేశాలు, కొత్త సర్కారు రాకతో మొదలైన చర్యలు**
- **పిన్నెల్లి సోదరులపై రౌడీషీట్ .. అరెస్టు వార్తతో జనం సంబరాలు**

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

కన్ను పడిన భూముల కబ్జా.. మాట్లాడితే మారణాయుధాలతో దాడులు.. ఎదురు తిరిగితే హత్యలు! ఇలా మాచర్ల మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రాజకీయ జీవితం అంతా అరాచకమే.. నేరమయమే.. హత్యలు, దాడులు, కబ్జాలతో చెలరేగిపోయి రౌడీ సామ్రాజ్యాన్ని నెలకొల్పారు. రామకృష్ణారెడ్డి మాచర్ల నియోజకవర్గ పరిధిలోని వెల్దుర్తి జడ్పీటీసీగా రాజకీయ జీవితం ప్రారంభించారు. 2009లో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి 2019 వరకు వరుసగా గెలుపొందుతూ వచ్చారు. నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేసుకుని వారిని అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అహంకార పూరితంగా దౌర్జన్యాలు, దాడులకు పాల్పడ్డారు. 2024 ఎన్నికలకు ముందు పోలింగ్ తరువాత కొనసాగించిన హింసాకాండలో రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలపై కేసులు నమోదయ్యాయి. రామకృష్ణారెడ్డి జైలుపాలు కాగా, తమ్ముడు వెంకట్రామిరెడ్డి ఇంకా పరారీలోనే ఉన్నారు. పిన్నెల్లి అరెస్టు వార్తతో కారంపూడిలో ప్రజలు బాణసంచా కాల్చి, కేకులు పంచుకున్నారు. నిజానికి, కొత్త ప్రభుత్వం రాగానే పిన్నెల్లి ఆటలు సగం కట్టాయి. తాజాగా హైకోర్టు తీర్పుతో ఆయన సాగించిన రక్త చరిత్రకు చరమాంకం పడింది. పల్నాడులో ఫ్యాక్షన్ పాలన పిన్నెల్లి సాగించారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ కార్యకర్త చంద్రయ్యను అదే గ్రామానికి చెందిన చింతా శివరామయ్య, ఆదినారాయణతో హత్య చేయించారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడు గ్రామంలో కంచర్ల జల్లయ్యను అదే గ్రామానికి చెందిన ఊరిబండి మన్నెయ్యతో హత్య చేయించారు. మాచర్ల మండలం నాగులవరం పంచాయతీ పరిధిలోని విజయపురిసౌత్ పరిధిలో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. వెల్దుర్తి మండలం కండ్లకుంటలో 1500 ఎకరాలు, టీడీపీ దివంగత సీనియర్ నేత వీరమాచినేని సుభాష్‌చంద్రబోస్‌కు చెందిన రూ. కోట్ల విలువైన ఆస్తులను బినామీ పేర్లతో కబ్జా చేశారు. గ్రానైట్ రాళ్ల తరలింపు లారీల నుంచి అక్రమ వసూళ్లు, రేషన్ బియ్యం, తెలంగాణ మద్యం, బెల్ట్‌షాపులు ద్వారా కోట్లాది రూపాయలు అక్రమంగా కూడబెట్టుకున్నారు. అక్రమ లేఅవుట్లు, రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, సెబ్ తదితర కార్యాలయాల నుంచి ముడుపులు దండుకున్నారు.

పెట్రోలుతో దాడులు... అక్రమ కేసులు

- **వందలాది మందితో పంటలు ధ్వంసం**
- **జగన్ భూముల్లోని రైతులపై దౌర్జన్యం**
- **వైసీపీ రాజ్‌లో చెలరేగిన పిన్నెల్లి సోదరులు**

పల్నాడు జిల్లా మాచవరం మండలం చెన్నాయపాలెం సమీపంలో సరస్వతి పవర్ ప్రాజెక్టు, సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు అప్పటి సీఎం వైఎస్ కుటుంబం 2008 నుంచి 2010 వరకు రెండేళ్ల వ్యవధిలో సుమారు 1200 ఎకరాల భూమిని కొంది. భూముల కొనుగోళ్ల ప్రక్రియ పూర్తైన వెంటనే 2012లో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని భూములిచ్చిన రైతులను నమ్మించారు. 2014 వరకు కూడా ఆ భూముల్లో ఎటువంటి నిర్మాణ ప్రక్రియ జరగలేదు. ఫ్యాక్టరీ నిర్మించండి...లేదా నిర్మించే వరకు తమ భూముల్లో తామే సాగు చేసుకుంటామని రైతులు తేల్చిచెప్పారు. తమ భూముల్లో పలు రకాల పంటలను సాగుచేశారు. అదే ఏడాది అక్టోబరులో అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని తమ్ముడు వెంకట్రామిరెడ్డిలు 40 ట్రాక్టర్లలో వందలాది మంది అనుచరులతో చెన్నాయపాలెం చేరుకొని రైతులు సాగుచేస్తున్న పలురకాల పంటలను ట్రాక్టర్లతో దున్నించి ధ్వంసం చేశారు. అడ్డు వచ్చిన రైతులు, ఎస్సీ ఎస్టీ మహిళలను కులంపేరుతో దూషించారు. అడ్డు వచ్చిన వారిపై పెట్రోల్ పోశారు. మారణాయుధాలతో దాడులకు పాల్పడ్డారు.

అప్పట్లో స్థానిక సంస్థలన్నీ ఏకగ్రీవమే...

పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరు ముందుకొచ్చినా వారిపై గంజాయి, అక్రమ మద్యం వంటి పలు కేసులు పెట్టించి భౌతిక దాడులు చేయించి నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలు, మున్సిపాలిటీ, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఏకగ్రీవం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల సరళిని పరిశీలించేందుకు వచ్చిన టీడీపీ బృందం బొండా ఉమ, బుద్దా వెంకన్న, హైకోర్టు న్యాయవాదిపై మాచర్ల పట్టణంలోని రింగురోడ్డు సెంటర్లో నాటు కర్రతో తురకా కిషోర్‌తో దాడి చేయించారు. మాచర్లలో 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి నిర్వహిస్తుండగా పిన్నెల్లి, అనుచరులు కవ్వింపు చర్యలకు పాల్పడి టీడీపీ నేతల కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. పిన్నెల్లి సోదరుల్లో రామకృష్ణారెడ్డిపై 14 కేసులు, అతని సోదరుడిపై 9 కేసులు నమోదయ్యాయి. వీరివురిపై రౌడీ షీటు కూడా తెరిచారు.

పరారీలోనే వెంకట్రామిరెడ్డి


- **షాడో ఎమ్మెల్యేగా నాడు అరాచకాలు**



మాచర్ల ఎమ్మెల్యేగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఉండగా, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి షాడో ఎమ్మెల్యేగా పెత్తనం చెలాయించారు. అధికారం అండతో చెలరేగిపోయారు. నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థలను తన చెప్పుచేతల్లో పెట్టుకున్నారు. టీడీపీ నేతలు కార్యకర్తలను హత్యలు చేయించారు. తనకు ఎదురే లేదు అన్న రీతిలో వ్యవహరించిన వెంకట్రామిరెడ్డి పోలింగ్, ఆ తర్వాత విధ్వంసకాండకు పాల్పడ్డారు. ఈ కేసుల భయంతో సోదరుడు రామకృష్ణారెడ్డితో కలిసి ఈ ఏడాది మే 14న పరారయ్యారు. అప్పటి నుంచి అజ్ఞాతంలోనే కొనసాగుతున్నారు. వెంకట్రామిరెడ్డిపై రెండు హత్యాయత్నం కేసులతో సహా మొత్తం 9 కేసులు నమోదయ్యాయి. పోలీస్ డిపార్టుమెంట్‌లో ఇప్పటికీ కొనసాగుతున్న కొందరు జగన్ భక్తుల సహకారంతోనే అయన తప్పించుకు తిరుగుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఐదేళ్ల జగన్ పాలనలో వెంకట్రామిరెడ్డి చెలరేగిపోయారు. టీడీపీ కార్యకర్తలు, నేతలను భయభ్రాంతులకు గురిచేసి గ్రామాల నుంచి వలసలు వెళ్లేలా చేశారు. అలాంటిది ఇప్పుడు ఆయనే కేసులు, అరెస్టు భయంతో అజ్ఞాతంలో గడుపుతున్నారు.

వైసీపీ భవనాల విషయంలో నేటి వరకు యథాతథ స్థితి

- **పూర్తి వివరాలు మా ముందుంచండి.. ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**



అమరావతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులూ లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాల భవనాల విషయంలో గురువారం వరకు యథాతథ స్థితి పాటించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ భవనాలను ఎందుకు కూల్చివేయకూడదో వివరణ ఇవ్వాలంటూ అధికారులిచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ వివిధ జిల్లాల వైసీపీ అధ్యక్షులు అత్యవసరంగా వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై బుధవారం విచారణ జరిగింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని, గురువారం వరకు భవనాల విషయంలో అధికారులు యథాతథ స్థితి పాటించాలంటూ న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను గురువారానికి వాయిదావేశారు. 9 జిల్లాల వైసీపీ అధ్యక్షులు బుధవారం వేసిన ఈ పిటిషన్లను హైకోర్టు లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి వాదనలు వినిపించారు. 'జాతీయ పార్టీలు, గుర్తింపు కలిగిన ప్రాంతీయ పార్టీల కార్యాలయాల నిర్మాణం కోసం స్థలాల కేటాయింపునకు 2016లో అప్పటి ప్రభుత్వం జీవో 340 జారీ చేసింది. అసెంబ్లీలో 50 శాతానికిపైగా సంఖ్యాబలం ఉన్న పార్టీకి కార్యాలయం నిర్మాణం కోసం జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో రెండు ఎకరాలు కేటాయించవచ్చు. భూకేటాయింపు జరిగిన ఏడాది లోపే కార్యాలయాల నిర్మాణం ప్రారంభించి, పూర్తి చేయాలి. బిల్డింగ్ ప్లాన్ ఆమోదం కోసం చేసిన దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. నిర్మాణాలు కొనసాగించుకోవచ్చని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను ఎందుకు కూల్చివేయకూడదో వివరణ ఇవ్వాలని అధికారులు నోటీసులు ఇచ్చారు. వాటిని కూల్చివేస్తారేమోనన్న పిటిషనర్ల ఆందోళన సహేతుకమైనదే. చట్టనిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాన్ని కూల్చివేయడమే పరిష్కారం కాదు. దానిని క్రమబద్ధీకరించే అధికారం కమిషనర్‌కు ఉంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని భవనాల విషయంలో యథాతథస్థితి పాటించేలా అధికారులను ఆదేశించండి' అని కోరారు. అడ్వకేట్ జనరల్ తరఫున న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ పిటిషన్లకు విచారణార్హత లేదన్నారు. పిటిషనర్లది కేవలం ఆందోళన మాత్రమేనన్నారు. అనుమతులు లేకుండా నిర్మించిన భవనాల విషయంలో అధికారులు ముందుకెళ్లకుండా ఉత్తర్వులు (బ్లాంకెట్ ఆర్డర్స్) పొందేందుకు పిటిషనర్లు ప్రయత్నిస్తున్నారని.. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ జారీ చేయవద్దని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

వారంతా వైసీపీ వలంటీర్లు!

- **హైకోర్టులో పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వాదనలు**
- **కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ధర్మాసనం ఆదేశం**

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నియమితులైన వలంటీర్లంతా ఆ పార్టీ కార్యకర్తలేనని, వారి నియామకాలను చట్టవిరుద్ధమైనదిగా ప్రకటించాలని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది హైకోర్టును అభ్యర్థించారు. వలంటీర్లకు గౌరవ వేతనంగా ప్రభుత్వ ఖజానా నిధులు ఇచ్చారని, కానీ, నియామక ప్రక్రియలో రిజర్వేషన్ పాటించలేదని తెలిపారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను సెప్టెంబరు 18కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్. జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. గ్రామ-వార్డు వలంటీర్లను నియామకాన్ని సవాల్ చేస్తూ కడప జిల్లా, రాజంపేటకు చెందిన షేక్ అబుబాకర్ సిద్ధిఖి గతంలోనే హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిల్‌పై తొలుత మార్చి 20న విచారణ జరిపిన ధర్మాసనం.. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న అప్పటి సీఎం జగన్, అప్పటి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఇతర అధికారులు, కొందరు వలంటీర్లకు కూడా నోటీసులు జారీ చేసింది. కాగా, ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపించారు. వైసీపీ కార్యకర్తలనే వలంటీర్లుగా నియమించారని తెలిపారు.

హెల్మెట్ పెట్టుకోవాల్సిందే

- **చట్ట నిబంధనలు కఠినంగా అమలు చేయండి**
- **కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం ఏ మేరకు అమలు చేస్తున్నారు?: హైకోర్టు**

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని హైకోర్టు తేల్చిచెప్పింది. రోడ్డు ప్రమాదాల కారణంగా రాష్ట్రంలో ఏటా వేల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో చట్టనిబంధనలు కఠినంగా అమలుచేయాలని ప్రభుత్వం, పోలీసులను ఆదేశించింది. రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ ధరించకపోవడం వల్ల సంభవించే దుష్ప్రభావాలు, చట్టనిబంధనల గురించి అధికారులతో కలసి ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆదేశించింది. మోటార్ వెహికిల్ చట్టనిబంధనల గురించి విస్తృత సర్క్యులేషన్ ఉన్న ప్రాంతీయ, జాతీయ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని పేర్కొంది. రోడ్లపై విధులు, వాహన తనిఖీలు నిర్వహించే పోలీసు అధికారులు తప్పనిసరిగా బాడీ కెమెరాలు ధరించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. చట్టనిబంధనలు ఉల్లంఘించేవారిని ఎంతమాత్రం ఉపేక్షించవద్దని, విస్తృత ప్రజా ప్రయోజనం ఇమిడి ఉన్న నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. కేంద్ర మోటార్ వెహికిల్ సవరణ చట్టం అమలుకు ఏం చర్యలు తీసుకున్నారు? వాహనాలు తనిఖీలు, నిబంధనలు ఉల్లంఘించినవారికి చలాన్‌ల విధింపు, తదితర వివరాలను కోర్టు ముందు ఉంచాలని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఆగస్టు 21కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. పిల్ దాఖలు చేసిన పార్టీ ఇన్ పర్సన్ న్యాయవాది తాండవ యోగేశ్‌ను అభినందించింది. కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం నిబంధనలు అమలు చేయకపోవడంతో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించినవారికి జరిమానా విధించడంలేదని పేర్కొంటూ యోగేశ్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. రోడ్లపై విధులు నిర్వర్తించే పోలీస్, ఇతర అధికారులు తప్పనిసరిగా బాడీ కెమెరాలు ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా యోగేశ్ వాదనలు వినిపించారు. గణాంకాల ప్రకారం.. 2022లో జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 3,703 మరణాలు సంభవించాయని, ఇందులో 3,042 మంది హెల్మెట్ ధరించకపోవడంతో సంభవించినవేనని వివరించారు. నిబంధనల ప్రకారం వాహనదారులు, వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... విజయవాడలో వాహనదారులు హెల్మెట్ ధరించకుండా తిరగడాన్ని తామూ గమనించామని, విస్తృత ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని చట్టనిబంధనలు కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.



ఇసుక అక్రమ తవ్వకాలు నిజమే



(మొదటి పేజీ తరువాయి)

పసుపులేటి సురేష్‌బాబు నేతృత్వంలోని నిపుణుల బృందం ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించి సుప్రీంకోర్టుకు నివేదిక ఇచ్చింది.

అనుమతుల్లేకుండానే తవ్వకాలు

ఇసుక తవ్వకాలు చేపట్టాలంటే గనుల శాఖ నుంచి మైనింగ్ అనుమతి, సియా నుంచి పర్యావరణ అనుమతి తీసుకోవాలి. కాలుష్య నియంత్రణమండలి నుంచి కన్సెంట్ పొందాలి. అయితే జీసీకేసీ, ప్రతిమ ఇన్‌ఫ్రా కంపెనీలు ఏ అనుమతి తీసుకోకుండానే నదుల్లోని రీచ్‌ల్లో ఇసుక తవ్వుకొని తరలిస్తున్నాయి. ఇది చట్టాలు, నియమ నిబంధనలకు విరుద్ధం. ఎన్నికలకు రెండురోజుల ముందు అంటే మే 11 వరకూ తవ్వకాలు కొనసాగాయి. తర్వాత 16 వరకు తవ్వకాలు చేపట్టారు. మేం తనిఖీలకు వస్తున్నామని తెలిసి కొన్ని రీచ్‌ల్లో ఆ రోజు వరకు మైనింగ్ ఆపారు.

తనిఖీ చేసిన రీచ్‌లివీ...

మే 14న ఉమ్మడి కృష్ణాజిల్లాలో శ్రీకాకుళం రీచ్, స్టాక్‌యార్డ్ (ఘంటసాల మండలం) లంకపల్లి రీచ్, రొమ్మూరు రీచ్, చోడవరం రీచ్, మున్నలూరు రీచ్‌లను, మే 15న ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొత్తపల్లి, చింతపల్లి రీచ్, స్టాక్‌యార్డ్, కొంగటివారిపాలెం(కేవీపాలెం), మల్లాది, పొందుగుల రీచ్, వైకుంఠపురం రీచ్‌లను కేంద్ర బృందం తనిఖీ చేసింది.

భారీ యంత్రాలతో నదులు గుల్ల

ఉమ్మడి కృష్ణాజిల్లా ఘంటసాల మండలంలోని శ్రీకాకుళం రీచ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడ కనీసం పర్యావరణ అనుమతులు తీసుకోలేదు, ఇంకా దారుణం ఏమిటంటే, కనీసం పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు కూడా చేయలేదు. రెండు టన్నుల బకెట్ సామర్థ్యం కలిగిన జేసీబీతో తవ్వకాలు జరుపుతున్నారు. ఒక్క రీచ్‌లోనే ఐదు జేసీబీలను ఉపయోగించి తవ్వుతూ లారీల్లో ఇసుక లోడ్ చేస్తున్నారు. దీన్ని జీసీకేసీ ప్రాజెక్టు నిర్వహిస్తోంది. తనిఖీల సందర్భంగా రహదారి, క్యాష్ బిల్లులను ఫొటోలు తీసుకున్నాం. తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురంలోని రీచ్‌లో ప్రతిమ ఇన్‌ఫ్రా ఇసుక మైనింగ్ చేస్తోంది. ఆ కంపెనీ ఎలాంటి అనుమతులు, ఆమోదాలు పొందలేదు. నగటున కిలోమీటరు పొడవునా నాలుగైదు అడుగుల లోతున ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు తక్షణమే ఆపాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఏప్రిల్ 29న, ఆ తర్వాత మే 10న ఇచ్చిన ఆదేశాలను జగన్ సర్కారు పెడచెవిన పెట్టింది. దీంతో గుంటూరు చెందిన నాగేంద్రకుమార్ మే 15న ఈ-మెయిల్ ద్వారా అక్రమ ఇసుక తవ్వకాలకు సంబంధించి జియోట్యాగింగ్ చేసిన ఫొటోలు, ఇతర ఆధారాలు సుప్రీంకోర్టుకు ఇచ్చారు. ఈ ఫొటోలు నిజమైనవేనని, అక్రమ తవ్వకాలు జరిగాయని కేంద్ర నిపుణుల బృందం తన నివేదికలో తేల్చిచెప్పింది.

ద్వివేది.. ఇప్పుడేమంటారు?

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలే జరగడం లేదని ఇటు కలెక్టర్లతో, అటు గనుల శాఖ తరఫున నాటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది నివేదికలు ఇప్పించారు. కానీ, అవన్నీ పచ్చి అబద్ధాలని, రాష్ట్రంలో అక్రమ ఇసుక మైనింగ్ జరుగుతోందని కేంద్ర నిపుణుల బృందం సుప్రీంకోర్టుకు నివేదిక ఇచ్చింది. దీంతో ఇప్పటివరకూ గత ప్రభుత్వం ఇచ్చిన నివేదికలు, ఆఫిడవిట్‌లో పేర్కొన్నవన్నీ కట్టుకథలేనని తేలిపోయింది. మరి ఇప్పుడు కేంద్ర నివేదికపై ద్వివేది ఏమంటారో, కొత్తగా ఏ కథనం వినిపిస్తారో చూడాలి. అక్రమ ఇసుక మైనింగ్‌లో జగన్ సర్కారు, దానికి కొమ్ముకాసిన అధికారులు సుప్రీంకోర్టుకు చెప్పినవన్నీ అబద్ధాలేనని నిరూపించేలా కేంద్ర నిపుణుల బృందం నివేదికలు ఇవ్వడంతో అందరూ అడ్డంగా దొరికిపోయారు.

1861 కోట్లు 'ఔట్'!

(మొదటి పేజీ తరువాయి)

ఖర్చు రూ.864కోట్లు. అదే జగన్ హయాంలో చివరి ఏడాది 2023-24లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతం ఖర్చు ఏకంగా రూ.2861 కోట్లకు చేరింది. అంటే.. మూడింతలకు మించి పెరిగింది. 11వ పీఆర్సీ కారణంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు నామమాత్రంగా పెరిగాయి. కొందరికి అసలు పెరగనేలేదు. మొత్తంగా వారి వేతనాలు రూ.864 కోట్ల నుంచి వెయ్యి కోట్లకు పెరిగినట్లు అంచనా! కానీ... 2023-24లో ఈ ఖర్చు రూ.2861 కోట్లకు పెరిగింది. ఆయా శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు భారీగా పెరిగారా అంటే అదీ లేదు. జగన్ హయాంలో కొత్తగా వచ్చింది 'ఏపీ డిజిటల్ కార్పొరేషన్' ఒక్కటే! దీన్ని పక్కా వైసీపీ ప్రచార సంస్థగా వాడుకున్నారు. వైసీపీ సోషల్ మీడియా, ఐప్యాక్‌తోపాటు 'పేటీఎం బ్యాచ్' పేమెంట్లన్నీ దీనిద్వారానే జరిగినట్లు అనుమానాలున్నాయి. ఫలితంగానే... 2023-24లో ఔట్ సోర్సింగ్ వేతనాల భారం పెరిగిందని అంచనా!

మాయ లెక్కలు..

డిజిటల్ మీడియా కార్పొరేషన్ అనేది మాయా ప్రపంచం! ఎంతమంది, ఎక్కడ ఏం పనిచేస్తున్నారో ఎవరికీ తెలియదు. లక్షల్లో జీతాలు తీసుకుంటున్నా ఆఫీసుకు రానివాళ్లు, భార్యాభర్తలు, వైసీపీ కేంద్ర కార్యాలయం దగ్గర బడ్డీ కొట్టు నడిపే వాళ్లూ ఇందులో ఉద్యోగులే! జగన్‌ను మళ్లీ అధికారంలోకి తెచ్చేందుకు విషవ్యూహాలు రచించిన ఐప్యాక్ సంస్థకు వందల కోట్లు చెల్లించారు. ఈ డబ్బంతా ప్రజలు కట్టిన పన్నుల నుంచి చెల్లించిన సొమ్మే. రెండేళ్ల క్రితం ఐప్యాక్ ఉద్యోగులందరినీ సజ్జల భార్గవ్ ఆఫీసుకు తరలించారు. వీరందరికీ ఔట్ సోర్సింగ్ పద్దు నుంచే జీతాలు చెల్లించారు. ఏపీసీఎఫ్ఎస్ఎస్‌లో(ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ అండ్ సర్వీసెస్) పేరిట మరో సంస్థను ఏర్పాటు చేశారు. అందులో... దాదాపు 400 మందిని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా కూర్చోబెట్టారు. భారీ జీతాలు! చేసే పనిమాత్రం... టీడీపీ, జనసేన నేతలు, సానుభూతిపరులపై అసభ్యకర పోస్టింగులు పెట్టడమే. ఇక సజ్జల భార్గవ్ తన సోషల్ మీడియా కార్యాలయాన్ని విజయవాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ భవనంలో నిర్వహించారు. వందల కొద్దీ ఉద్యోగులను చేర్చుకున్నారు. వీరి జీతాలు ఖజానా నుంచే చెల్లించారు.

అరెస్టైన వారికి అందలం

జడ్జిలపై దూషణ కేసులో అరెస్టైన 11 మంది డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులకు జగన్ ప్రభుత్వమే కోర్టు ఖర్చులు భరించింది. కేసుల నుంచి బయటకు వచ్చాక వారందరికీ ప్రమోషన్లు కల్పించి లక్షల్లో జీతం ఇచ్చింది. ఇందులో ఒక మహిళా ఉద్యోగిని ఏకంగా డిజిటల్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించి నెలకు రూ.2.5 లక్షల జీతం ఇచ్చారు. ఇదంతా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పద్దు నుంచి వెళ్లినవే. అలాగే, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో కూడా వందల సంఖ్యలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకున్నారు. జగన్ హయాంలో ప్రభుత్వానికి ఉపయోగపడేలా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం ఒక్కటీ జరగలేదు. అప్పటికే ఉన్న వారందరినీ ఒక్క కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొచ్చి దానికి 'ఆప్కాస్' అనే పేరు పెట్టారు. ఇందులో చాలా కార్పొరేషన్లలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను, శానిటేషన్ వర్కర్లను చేర్చనేలేదు. టీడీపీ హయాంలో నియమితులై... రూ.40వేల కంటే ఎక్కువ జీతమున్న వారినందరినీ తప్పించి సొంత మనుషులను కూర్చోబెట్టారు. 'ఆప్కాస్'కు నిధులు విడుదల చేయలేదు. కానీ... డిజిటల్ కార్పొరేషన్‌తోపాటు వైసీపీ సేవచేసిన సంస్థలకు నిధులు గుమ్మరించారు. ఈ గుట్టంతా ఐ అండ్‌పీఆర్‌లో ఉందని, విచారణ చేస్తే బయటకు వస్తుందంటున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)- ఎంటెక్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం విధానాల్లో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. జైస్‌లోని ఆర్‌జీఐపీటీ, బెంగళూరులోని ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్, శివసాగర్‌లోని అస్సాం ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

పెట్రో వర్సిటీ

ఎంటెక్ విభాగాలు-సీట్లు: జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాల్లో ఒక్కోదానిలో 10 సీట్లు ఉన్నాయి. బెంగళూరు ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్‌లో రెన్యూవబుల్ ఎనర్జీ 15, ఎలక్ట్రానిక్ వెహికిల్ టెక్నాలజీ 20 సీట్లు ఉన్నాయి.

పీహెచ్‌డీ విభాగాలు-సీట్లు

- జైస్ ఆర్‌జీఐపీటీలో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోకెమికల్ ఇంజనీరింగ్ 6, సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ 7, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ జియో ఇంజనీరింగ్ 3, మేథమెటికల్ సైన్సెస్ 3, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 2, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 6, మేనేజ్‌మెంట్ స్టడీస్ 2 సీట్లు ఉన్నాయి.
- ఈఐబీ సెంటర్లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 6 సీట్లు ఉన్నాయి.
- ఏఈఐ సెంటర్లో కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజనీరింగ్ విభాగాలకు గాను మొత్తం 9 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- పీహెచ్‌డీలో ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధిత విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ లేదా కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. సైన్సెస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ సైన్స్ లేదా కనీసం 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ ఇన్ సైన్స్ ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. హ్యూమానిటీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ ఇన్ ఇంజనీరింగ్ లేదా మాస్టర్స్ డిగ్రీ(హ్యూమానిటీస్/సైన్సెస్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/సైన్సెస్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ (మేనేజ్‌మెంట్) లేదా 75 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్)+రెండేళ్ల అనుభవం ఉండాలి. అన్ని విభాగాలకు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఎంపిక

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ స్కోర్ లేని అభ్యర్థులు సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఇందులో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు.
- పీహెచ్‌డీలో ప్రవేశానికి కూడా సంస్థ నిర్వహించే రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. నేషనల్ లెవెల్ స్కాలర్‌షిప్‌లు సాధించినవారు, కనీసం 80 శాతానికి మించి అకడమిక్ మార్కులు ఉన్నవారు ఇంటర్వ్యూలకు హాజరైతే చాలు.
- ఎక్స్‌టర్నల్, స్పాన్సర్డ్, పార్ట్ టైం ప్రోగ్రామ్‌లలో చేరే వారు రాత పరీక్ష రాయనవసరం లేదు.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 5
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** జూలై 11, 12
- **అడ్మిషన్స్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 16
- **తరగతులు ప్రారంభం:** జూలై 30 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

నలంద యూనివర్సిటీ

బిహార్‌లోని నలంద యూనివర్సిటీ-మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. మాస్టర్స్‌లో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విదేశీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్ మాట్లాడని దేశాలకు చెందిన అభ్యర్థులు, ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్/టీఓఈఐసీ/ పీటీఈ/ ఎస్‌టీఈపీ అర్హత పొంది ఉండాలి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు ప్రోగ్రామ్‌లకు అప్లయ్ చేసుకొనే వీలుంది. మాస్టర్స్ ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. పీహెచ్‌డీ వ్యవధి నాలుగేళ్లు. ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ఏడాది కోర్సు పూర్తిచేసిన తరవాత డిప్లొమాతో ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది.

పీజీ, పీహెచ్‌డీ



- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** హిందూ స్టడీస్(సనాతన), వరల్డ్ లిటరేచర్, హిస్టారికల్ స్టడీస్, బుద్దిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ అండ్ పీస్ స్టడీస్, ఆర్కియాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్:** సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్:** ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్
- **పీహెచ్‌డీ స్పెషలైజేషన్‌లు:** వరల్డ్ లిటరేచర్, సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్, ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్, హిస్టారికల్ స్టడీస్, బుద్దిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారటివ్ రెలిజియన్స్, హిందూ స్టడీస్(సనాతన)

అర్హత

- మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ (హ్యూమానిటీస్/సైన్సెస్/ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/లా) ఉత్తీర్ణులై ఉండాలి. 250 పదాలకు మించకుండా సెల్ఫ్ ఇంట్రడక్షన్/ బయో నోట్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ)లో భాగంగా వంద పదాలకు మించకుండా నలంద యూనివర్సిటీలో చదవాలనుకోవడానికి కారణాలు, 300 నుంచి 500 పదాలకు మించకుండా సంబంధిత ప్రోగ్రామ్‌ను ఎంచుకోవడానికి గల కారణాలు వివరిస్తూ ఆర్టికల్ రాయాలి.
- ఎంబీఏ (సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లో చేరాలనుకొనే వారు కనీసం 70 శాతం స్కోర్‌తో క్యాట్/ఎక్స్‌ఏటీ/మ్యాట్ అర్హత పొంది ఉండాలి. ప్రభుత్వ సంస్థలు/ప్రముఖ పీఎస్‌యూలలో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న వర్కింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు ఈ స్కోర్ అవసరం లేదు. విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ స్కోర్ లేదా డిగ్రీ స్థాయిలో 3/4 జీపీఏ ఉండాలి.
- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కనీసం 65 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ఎంఫిల్ పూర్తిచేసి ఉండాలి. సెల్ఫ్ ఇంట్రడక్షన్, రికమండేషన్/రిఫరెన్స్ లెటర్స్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, రీసెర్చ్ ప్రపోజల్, ఏవైనా రెండు/మూడు పబ్లిష్‌డ్ లేదా నాన్ పబ్లిష్‌డ్ పేపర్స్ సబ్మిట్ చేయాలి. పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో చేరాలంటే కనీసం ఎనిమిది నుంచి పదేళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక: ప్రోగ్రామ్‌ను అనుసరించి అకడమిక్ ప్రతిభ, జాతీయ పరీక్ష స్కోర్, ఇంగ్లీష్ సంబంధిత టెస్ట్ స్కోర్‌లు, ఎస్ఓపీ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులకు ఈమెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **చివరి తేదీ:** జూలై 10
- **వెబ్‌సైట్:** nalandauniv.edu.in



కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అధ్వర్యంలోని మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ)- గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్(జీఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఏడాదిపాటు ప్రీ సీ ట్రెయినింగ్ ఉంటుంది. ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఈ ప్రోగ్రామ్‌నకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్) గుర్తింపు ఉంది. స్టయిపెండ్ సౌకర్యం లేదు. మొత్తం 114 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తయిన వెంటనే ఆర్నెల్ల వ్యవధిగల షిప్‌బోర్డ్ ట్రెయినింగ్ పొందాల్సి ఉంటుంది. ఈ శిక్షణ పూర్తి చేసుకొన్న అభ్యర్థులకు డీజీఎస్ నిర్వహించే ఎంఈఓ క్లాస్- 4 సీఓసీ ఎగ్జామ్ రాసేందుకు అర్హత లభిస్తుంది.

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో జీఎంఈ ట్రెయినింగ్

ప్రోగ్రామ్ వివరాలు: ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. డీజీఎస్, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్(ఐఎంఓ) నిబంధనల ప్రకారం క్లాస్ రూం తరగతులు, ల్యాబొరేటరీ వర్క్‌లు, వర్క్‌షాప్ ప్రాక్టీస్‌లతోపాటు సీ ట్రెయినింగ్ ఉంటాయి. అభ్యర్థులందరూ ట్రెయినింగ్ మాన్యువల్, వర్క్ డెయిరీ మెయింటైన్ చేయాల్సి ఉంటుంది. సమయానుసారం రిటెన్ టెస్ట్‌లు, ప్రాక్టికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. అడ్మిషన్ నాటికి పాస్‌పోర్ట్ పొంది ఉండాలి.

● ప్రోగ్రామ్‌నకు సంబంధించిన స్టడీ మెటీరియల్, టార్ బుక్, ట్రెయినింగ్ మాన్యువల్ అందిస్తారు. భోజన, వసతి సౌకర్యాలకు సంబంధించిన ఖర్చులన్నీ కోర్సు ఫీజులోనే ఉంటాయి. వర్కింగ్ డ్రెస్ కింద ఒక జత సేఫ్టీ షూస్, రెండు జతల బ్లాక్ సాక్స్, ఒక సేఫ్టీ హెల్మెట్ ఇస్తారు. యూనిఫామ్ కింద అయిదు వైట్ షర్ట్‌లు, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, ఒక వైట్ ప్యాంట్, వైట్ క్యాప్, ఒక జత ఎపొలెటర్‌లు ఇస్తారు. పీటీ డ్రెస్ కింద రెండు బ్లూ షార్ట్‌లు, రెండు జతల వైట్ టీ షర్ట్‌లు, రెండు జతల వైట్ సాక్స్, ఒక స్విమ్మింగ్ ట్రంక్ ఇస్తారు. పర్సనల్ లాకర్, నాలుగు బెడ్‌షీట్‌లు, ఒక పిల్లో, రెండు పిల్లో కవర్‌లు, రెండు టవల్స్, ఒక మ్యాట్రెస్ కవర్ కూడా ఇస్తారు.

● ఎంపికైన అభ్యర్థులు ఒక జత బ్లాక్ షూస్, ఒక జత వైట్ కాన్వాస్ పీటీ షూస్, రెండు బ్లాక్ ప్యాంట్‌లు, మూడు బాయిలర్ సూట్‌లు(ఆరెంజ్ కలర్ ఫుల్ స్లీవ్స్ కాటన్), రెండు స్లీపింగ్ సూట్స్ (వైట్), ఒక జత స్లిప్పర్స్, షూ బ్రష్, షూ పాలిష్ (బ్లాక్, వైట్), రెయిన్ కోట్, రెండు బాత్ రోబ్స్ వెంట తెచ్చుకోవాలి. ఒక పాకెట్ క్యాలిక్యులేటర్, ఇంజనీరింగ్ డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా తెచ్చుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి (బీఈ/బీటెక్) (మెకానికల్ ఇంజనీరింగ్/మెకానికల్ అండ్ ఆటోమేషన్/మెకానికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/మెకానికల్ అండ్ ఆటోమొబైల్స్/నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్/ నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్/ మెరైన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. పదోతరగతి/ఇంటర్/ డిప్లొమా/డిగ్రీ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్టులో ద్వితీయ శ్రేణి మార్కులు ఉండాలి. డీజీఎస్ నిర్దేశించిన ప్రకారం మెడికల్ ఫిట్‌నెస్ ఉండాలి. అభ్యర్థుల వయసు ప్రోగ్రామ్ ప్రారంభం నాటికి 28 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: అకడమిక్ మెరిట్, మెడికల్ ఫిట్‌నెస్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సందర్భానుసారం సైకలాజికల్ స్క్రీనింగ్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.4,75,000
- **అడ్మిషన్ ఛార్జెస్:** రూ.10,000
- **దరఖాస్తు:** వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఈ మెయిల్ ద్వారా పంపాలి. నిర్దేశిత పత్రాలు అప్‌లోడ్ చేయాలి.
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** డిగ్రీ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఇంగ్లీష్ మార్కుల ప్రూఫ్ కోసం పదోతరగతి/ ఇంటర్/ డిప్లొమా మార్కుల పత్రాలు; పాస్‌పోర్ట్; సంతకం; అభ్యర్థి ఫొటో; కుల ధృవీకరణ పత్రం; మెడికల్ సర్టిఫికెట్.
- **స్పీడ్ పోస్ట్/ కొరియర్ ద్వారా దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూలై 31
- **చిరునామా:** హెచ్ఓడీ, మెరైన్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ), విజ్ఞాన సాగర్, గిరినగర్-682020, ఎర్నాకుళం, కేరళ.
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 1 నుంచి
- **ఈ-మెయిల్:** metihod@cochinshipyard.in
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.in

నార్త్ ఈస్టర్న్ రైల్వేలో అప్రెంటిస్‌లు

జాబ్ కార్నర్

ఖాళీలు 1104

గోరఖ్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్- నార్త్ ఈస్టర్న్ రైల్వే... ఎన్ఈఆర్ పరిధిలోని కింద పేర్కొన్న యూనిట్లలో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

వర్క్‌షాప్/యూనిట్: మెకానికల్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్), సిగ్నల్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), బ్రిడ్జ్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), మెకానికల్ వర్క్‌షాప్(ఇజ్జత్‌నగర్), డీజిల్ షెడ్(ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్ (ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్(లఖ్‌నవూ జంక్షన్), డీజిల్ షెడ్(గోండా), క్యారేజ్ అండ్ వ్యాగన్(వారణాసి)

పోస్టు: యాక్ట్ అప్రెంటిస్

ట్రేడ్: ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్ ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూన్ 12 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక ఏడాది

ఎంపిక: మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 11

వెబ్‌సైట్: ner.indianrailways.gov.in/

ఎన్‌హెచ్‌ఏఐలో రోడ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ ఉద్యోగాలు

ఖాళీలు 38

రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖకు చెందిన న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ)... డీపీఆర్ విభాగంలో ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రిన్సిపల్ డీపీఆర్ ఎక్స్‌పర్ట్: 5 పోస్టులు
2. సీనియర్ హైవే ఎక్స్‌పర్ట్: 5
3. రోడ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్: 5
4. ట్రాఫిక్ ఎక్స్‌పర్ట్: 5
5. ఎన్విరాన్‌మెంట్/ఫారెస్ట్ స్పెషలిస్ట్: 5
6. ల్యాండ్ అక్విజిషన్ ఎక్స్‌పర్ట్: 5
7. జియో టెక్నికల్ ఎక్స్‌పర్ట్: 5
8. బ్రిడ్జ్ ఎక్స్‌పర్ట్: 2
9. టన్నెల్ ఎక్స్‌పర్ట్: 1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 18

వెబ్‌సైట్: https://nhai.gov.in/

ఆర్ఐఈలో టీచింగ్ సిబ్బంది

ఖాళీలు 20

మైసూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఈ)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న టీచింగ్ ఖాళీల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. అసిస్టెంట్ ప్రొఫెసర్(ఫిజిక్స్, మేథ్స్, జువాలజీ, కెమిస్ట్రీ, ఇంగ్లిష్): 8 పోస్టులు
2. ప్రీప్రైమరీ నర్సరీ టీచర్: 3
3. ఒకేషనల్ టీచర్(రిటైల్, ఐటీ- ఐటీఈఎస్): 2
4. పీజీటీ(ఇంగ్లిష్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్): 2
5. వర్క్ ఎక్స్‌పీరియన్స్ టీచర్(హోమ్ సైన్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్): 2
6. ల్యాబొరేటరీ అసిస్టెంట్(బోటనీ): 1
7. కంప్యూటర్ అసిస్టెంట్(డీసీజీసీ): 1
8. కోర్సు అడ్మినిస్ట్రేటర్: 1

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, డీఎడ్, ఎంఈడీ, నెట్/కేసెట్/స్లెట్/పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు 70 ఏళ్లు, ప్రీప్రైమరీ నర్సరీ టీచర్ పోస్టుకు 30 ఏళ్లు; ఒకేషనల్ టీచర్ పోస్టుకు 35 ఏళ్లు, పీజీటీ, కోర్సు అడ్మినిస్ట్రేటర్ పోస్టుకు 40 ఏళ్లు, ల్యాబొరేటరీ/కంప్యూటర్ అసిస్టెంట్‌కు 27 ఏళ్లు మించకూడదు.

ఇంటర్వ్యూ తేదీలు: జూలై 1, 2, 3

వేదిక: రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపాల్ ఛాంబర్, మైసూరు

వెబ్‌సైట్: www.riemysore.ac.in/


ఫన్‌డే

తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు

ఒక ఊరిలో వీరయ్య, రాజయ్య అనే ఇద్దరు రైతులు ఉండేవారు. వీరయ్య ఎల్లపుడూ అందరి తప్పులుసరిదిద్దుతూ., సలహాలు చెబుతూ ఉండేవాడు.రాజయ్య వీరయ్యతో ప్రతి చిన్న విషయానికి అందరినీ నొప్పించడం మంచిది కాదని చెబుతూ ఉండేవాడు. ఇలా చాలా కాలం గడిచిన తర్వాత అందరికీ వీరయ్య సలహాలు వినీవినీ విసుగు కలిగింది. అందరి ముందూ వీరయ్య తమను అవమాన పరచడం చూసి, ప్రజలకు బాధ కలిగింది. వారంతా గ్రామ పెద్దతో తమ బాధను చెప్పుకున్నారు. గ్రామ పెద్ద వీరయ్యను పిలిచి, ఆ మర్నాటి నుండి రాజయ్య పొలంలో కలుపు తీయాలని చెప్పాడు. తన తెలివినీ, పనితనాన్నీ అందరూ గుర్తించారని, కాబట్టే రాజయ్య పొలం బాధ్యత కూడా తనకే అప్పగించారని ఆనందించాడువీరయ్య. కొన్ని రోజులకు వీరయ్య వచ్చి, రాజయ్య పొలంలో కలుపు ఇక తాను తీయలేననీ, రాజయ్య తన పని తానే, చేసుకునేట్లు చూడ వలసిందనీ, రాజయ్య పొలంలో కలుపు తీస్తూ ఉంటే తన సొంత పొలంలో కలుపు మొక్కలు పెరిగి పోతున్నాయి కాబట్టి, ఇక తనా పనిని చేయలేనని గామ పెద్దతో చెప్పుకున్నాడు. దానికి గ్రామ పెద్ద, 'నిజమే కదా ఎవరి పొలంలో కలుపు వారే తీసుకోవాలి. అలాగేఎవరి తప్పులు నెమ్మదిగా వారే దిద్దుకుంటారు.. నిరంతరం నువ్వు ఇతరుల తప్పులనే దిద్దుతూ ఉంటే నిన్ను నువ్వు దిద్దుకునేది ఎపుడు?' అన్నాడు. ఆ రోజు నుండి వీరయ్య ప్రతి చిన్న దానిలో అందరిలో తప్పులు వెతకడం మానుకున్నాడు.



ఎన్ని జంతువులు ఉన్నాయి?




6 తేడాలు గుర్తించండి!





దారి కనుక్కోండి





డైలీ సుడోకు - 343

3		5		2	1			
9			8					
	1		7			8		
				7	5		8	6
7	5		9	4				
		4			6		7	
					7			5
			5	3		2		1

సుడోకు - 342 సమాధానం

3	5	8	7	6	1	9	4	2
2	4	1	3	9	8	5	6	7
9	7	6	5	4	2	1	3	8
4	2	3	9	7	5	6	8	1
8	6	5	2	1	3	4	7	9
1	9	7	6	8	4	2	5	3
7	1	9	4	3	6	8	2	5
6	3	2	8	5	9	7	1	4
5	8	4	1	2	7	3	9	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.